www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 16-9-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 152

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: త్రయోదశి మ. 2.10 తదుపరి చతుర్దశి; నక్షత్రం: ధనిష్ఠ సా. 4.33 తదుపరి శతభిషం; వర్జ్యం: రా. 10.57-12.22; దుర్ముహూర్తం: మ. 12.33-1.22, మ. 2.59-3.47; అమృతఘడియలు: ఉ. 7.07-8.34; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.06; సూర్యాస్తమయం: 6.12 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ప్రధాని మోదీపై పుతిన్ గుర్రు



జెలెన్స్కీతో సమావేశంపై అసంతృప్తి?

ప్రధాని ఆదేశాలతో హుటాహుటిన మాస్కోకు దోభాల్

రష్యా అధ్యక్షుడితో అంతర్గత చర్చలు

ఉక్రెయిన్ అధినేతతో భేటీపై వివరణ!

2

శాంతిభద్రతలతో ఎలాంటి సంబంధమూ లేని నాటి నిఘా విభాగం అధిపతి పీఎస్ఆర్ ఆంజనేయులు జనవరి 31న తాడేపల్లిలోని ముఖ్యమంత్రి కార్యాలయానికి విజయవాడ పోలీస్ కమిషనర్ కాంతిరాణా తాతా, డీసీపీ విశాల్ గున్నీలను పిలిపించుకుని ఒక మహిళ (ముంబై నటి కాదంబరి)ను అన్యాయంగా కేసులో ఇరికించేందుకు కుట్ర చేశారు. వైసీపీ నేతలతో కలిసి చేసిన కుట్రలో ముగ్గురు ఐపీఎస్‌లు భాగస్వాములయ్యారు. ఆలిండియా సర్వీస్ రూల్స్ 1969లోని సెక్షన్ 3(1)కింద ఐపీఎస్‌లకు ఉన్న అధికారాలను అతిక్రమించారు.

విజయవాడ సీపీగా కాంతిరాణా తన పరిధిలోని పోలీసు స్టేషన్‌లో నమోదైన ఈ కేసు పర్యవేక్షణలో దారుణంగా విఫలమయ్యారు. ఒక మహిళను అరెస్టు చేసే ముందు ఫిర్యాదును కనీసం పరిశీలించకుండా ఇంటెలిజెన్స్ చీఫ్ చెప్పగానే గుడ్డిగా ముందుకెళ్లారు. జెత్వానీ కేసులో నాటి విజయవాడ డీసీపీ విశాల్ గున్నీ చర్యలు దుష్ప్రవర్తనకు ఏ మాత్రం తీసిపోవు. బాధితురాలు వివరణ ఇచ్చేందుకు ప్రయత్నించినా వినకుండా ఏకపక్షంగా వ్యవహరించి క్షోభ పెట్టారు.

- ఐపీఎస్‌ల తీరును దుయ్యబడుతూ ప్రభుత్వానికి డీజీపీ సమర్పించిన 16 పేజీల నివేదికలోని అంశాలు



వైపీఎస్‌లపై వేటు

పీఎస్ఆర్, కాంతిరాణా, విశాల్ గున్నీ సస్పెన్షన్

ముంబై నటి జెత్వానీ కేసులో సంచలనం

సీనియర్ ఐపీఎస్‌లపై కొరడా.. నాడు వైసీపీ పెద్దల ఆదేశాలతో అడ్డగోలు వ్యవహారాలు

జగన్ స్నేహితుడు సజ్జన్‌ను కాపాడేందుకు నటి కాదంబరిపై అక్రమ కేసు బనాయింపు

వైసీపీ నేత విద్యాసాగర్ ఫిర్యాదుతో నమోదు.. పీఎస్ఆర్ ప్లాన్.. రాణా, గున్నీ యాక్షన్

ముంబైలో అక్రమంగా జెత్వానీ కుటుంబాన్ని అరెస్ట్ చేసి విజయవాడకు తరలింపు

ఐపీఎస్‌లు పరిధి దాటి వ్యవహరించారని, తప్పుచేశారని డీజీపీ నివేదిక!

అమరావతి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఐపీఎస్ అధికారులమనే విషయాన్ని మరిచి జగన్ ప్రభుత్వంలో అడ్డగోలు పనులు చేసిన అధికారుల పాపం పండింది. అధికారాన్ని అడ్డు పెట్టుకుని విచ్చలవిడిగా చెలరేగిన ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులపై వేటు పడింది. ముంబై

మిగతా 11వ పేజీలో...

సీక్రెట్ ఆపరేషన్.. సీక్రెట్ ఫండ్

అడ్డంగా బుక్కైన పీఎస్ఆర్ ఆంజనేయులు

విశాల్ గున్నీ స్టేట్‌మెంట్‌తో మెడకు ఉచ్చు

జెత్వానీపై విద్యాసాగర్ ఫిర్యాదుకు ముందే అరెస్ట్ చేయడానికి విమాన టికెట్లు బుక్

ఇంటెలిజెన్స్ సీక్రెట్ ఫండ్ నుంచి ఖర్చు

డీజీపీ అనుమతి లేకుండానే ముంబైకి

చిక్కుల్లో పీఎస్ఆర్, గున్నీ, కాంతిరాణా

11

రాజీనామా చేస్తా

పదవి నుంచి తప్పుకొంటానని ఢిల్లీ సీఎం కేజ్రీ ప్రకటన

ఇది నాకు నేను విధించుకునే అగ్నిపరీక్ష

పార్టీని చీల్చేందుకు బీజేపీ కుట్రలు

దేవుడు అండగా ఉండి కాపాడాడు

రాజ్యాంగాన్ని కాపాడాలనే.. ఇంతకాలం రాజీనామా చేయలేదు

నిర్దోషిగా నిరూపించుకునే వరకు.. సీఎం కుర్చీని అధిరోహించను

నవంబరులోనే ఎన్నికలు నిర్వహించాలి

సీఎం పదవిని ప్రజాకోర్టు నిర్ణయిస్తుంది

కార్యకర్తల భేటీలో కేజ్రీవాల్ వ్యాఖ్యలు

కొత్త సీఎంగా ఆతిషికి అవకాశాలు!

హరియాణాపై దృష్టి సారించనున్న కేజ్రీ

రాజీనామా ప్రకటన ఓ గిమ్మిక్కు: కాంగ్రెస్

అది పబ్లిసిటీ కోసం నాటకం: బీజేపీ



ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను ఫిబ్రవరిలో కాదు.. నవంబరులోనే నిర్వహించాలని ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేస్తున్నా. మహారాష్ట్రతో పాటు.. ఢిల్లీ ఎన్నికలు జరగాలి. ఇంటింటికీ వెళ్లి.. ఓట్లడుగులా. నేను నిర్దోషినని నమ్మితేనే ఓట్లు వేయాలని ప్రజలను కోరుతా - సీఎం అరవింద్ కేజ్రీవాల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ సంచలన నిర్ణయాన్ని ప్రకటించారు. రెండ్రోజుల్లో సీఎం పదవికి రాజీనామా చేస్తానని వెల్లడించారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో సీబీఐ నమోదు చేసిన కేసులో సుప్రీంకోర్టు శుక్రవారం కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే.! ఆర్నెల్లుగా జైలులో ఉన్న కేజ్రీవాల్ సుప్రీంకోర్టు తీర్పుతో విడుదలయ్యారు. ఆ వెంటనే విలేకరులతో మాట్లాడుతూ.. దేశాన్ని బలహీనపరుస్తూ.. విభజించే ప్రయత్నాలు చేస్తున్న శక్తులపై తాను పోరాటం చేస్తానని ప్రతినబూనారు. "నేను నిర్దోషిగా నిరూపించుకునేంత వరకు సీఎం పదవిలో ఉండను. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆప్‌ను గెలిపించి, అధికారం కట్టబెట్టేవరకు సీఎం పీఠాన్ని అధిరోహించను" అని వ్యాఖ్యానించారు. రాజీనామా తర్వాత.. తదుపరి సీఎంను ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఆదివారం ఢిల్లీలోని ఆప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో కేజ్రీవాల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆప్ కష్టాల్లో ఉన్నప్పుడు భగవంతుడే తమ వెంట ఉండి, ముందుకు నడిపించారని, దేవుడిచ్చిన ధైర్యంతోనే శత్రువులపై పోరాడుతామని ఉద్ఘాటించారు. "మా నాయకులు సత్యేందర్ జైన్, అమానతుల్లాఖాన్ ఇంకా

మిగతా 2వ పేజీలో...



గోదావరి బేసిన్ భూభాగంలో

చమురు నిక్షేపాలు!

నదీ పరీవాహక ప్రాంతంలో సహజ వాయువులు

బీఎస్ఐపీ శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడి

11



త్వరలో ఆపరేషన్ బుడమేరు!

రాష్ట్రవ్యాప్తంగా కాలువలు, చెరువులు ఆక్రమణకు గురికాకుండా పకడ్బందీ చర్యలు

వరద ప్రాంతాల్లో ఎన్యుమరేషన్ ప్రక్రియ పూర్తి

రేపటి నుంచి పరిహారం

బుడమేరు ప్రాంతంలోని ప్రజలకు టిడ్కో ఇళ్లు

'ఆంధ్రజ్యోతి'తో మంత్రి నారాయణ

12

జమిలి ఈ టర్మ్‌లోనే!

ఒక దేశం-ఒకే ఎన్నికకు అన్ని పార్టీల మద్దతుపై మోదీ సర్కారు ఆశాభావం

ఎన్డీయే పార్టీల మధ్య సమన్వయం భేష్

ఈ బంధం ఐదేళ్లూ కొనసాగుతుంది

త్వరలోనే జనాభా లెక్కల సేకరణ

కులగణనపై ఇంకా నిర్ణయించలేదు

ప్రభుత్వ వర్గాల వెల్లడి

2



ఇసుక రవాణా చార్జీలు ఖరారు

రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విధానం.. జిల్లాల వారీగా ఇసుక కమిటీలతో చర్చలు

స్టాక్ పాయింట్ల దూరం ప్రామాణికంగా ధరల నిర్ణయం



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉచిత ఇసుక పంపిణీలో రవాణా చార్జీల భారం తగ్గించే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా రవాణా చార్జీలు ఒకే విధంగా ఉండేలా ధరలను ఖరారు చేసింది. ఈ మేరకు గనులశాఖ ముఖ్యకార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా ఉత్తర్వులు(జీఓ-52) జారీ చేశారు. ఇసుక రవాణా కోసం గనుల శాఖ వద్ద రిజిస్టర్ చేసుకున్న ట్రాన్స్‌పోర్టు కంపెనీలు, లారీ అసోసియేషన్ల ప్రతినిధులతో జిల్లాల వారీగా జిల్లా ఇసుక కమిటీలు

మిగతా 11వ పేజీలో...

వైద్య కళాశాలలపై మాజీ సీఎం జగన్ విషం చిమ్ముతున్నారు. అధికారంలో ఉన్నంత కాలం అబద్ధాలతో నెట్టుకొచ్చిన ఆయన ఇప్పుడు విపక్షంలోనూ అదే ఎత్తుగడను నమ్ముకుంటున్నారు. కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. మెడికల్ కాలేజీల నిర్మాణంలో తానేదో ఘనంగా చేసినట్లు చెప్పుకొంటూ... కూటమి ప్రభుత్వం వాటిని గాలికొదిలేసిందంటూ మొసలి కన్నీరు కారుస్తున్నారు.

వైద్య కళాశాలలపై విషం!



నిర్మాణానికి ఒక్క పైసా కేటాయించని జగన్ ప్రభుత్వం

నాలుగేళ్లలో నాలుగో వంతు పనులూ పూర్తి చేయలేదు

ఇప్పుడు మెడికల్ కాలేజీలు, సీట్లపై తప్పుడు ప్రచారం

విపక్షంలోనూ అబద్ధాలనే నమ్ముకున్న మాజీ సీఎం

విద్యార్థులకు అన్యాయమంటూ మొసలి కన్నీరు

గతంలో తమ ప్రభుత్వం చేసిన తప్పిదాలను కూటమి ప్రభుత్వంపైకి నెట్టేందుకు యత్నాలు

పీజీ సీట్ల నిధులు కాలేజీ నిర్మాణాలకు మళ్లింపు

జగన్ నిర్వాకంతో ఆ సీట్లు నిలిచిపోయే ప్రమాదం

25% పనులకు.. 16 శాతమే బిల్లులు చెల్లింపు

అవీ నాబార్డు, కేంద్ర నిధులతో చెల్లించి డబ్బాలు

కాంట్రాక్ట్ సంస్థలకు రూ.674 కోట్ల బకాయిలు

పనులు నిలిపేసిన సంస్థలు.. అడ్మిషన్లు నిలిచిపోవడానికి ఇదే కారణం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు నిర్మిస్తామని గత జగన్ ప్రభుత్వం 2020లో ప్రకటించింది. వీటి నిర్మాణానికి రూ.8,480 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసింది. ఇది జరిగి నాలుగేళ్లవుతున్నా అందులో నాలుగో వంతు ఖర్చు కూడా చేయలేదు. పైగా ఈ కాలేజీల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్క పైసా ఇచ్చిన దాఖలాలు లేవు. అధికారంలో ఉన్నప్పుడు కాలేజీలను గాలికి వదిలేసిన జగన్.. ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై అభాండాలు మోపుతున్నారు. మంగళగిరిలో రూ.1,100 కోట్లతో ఎయిమ్స్‌ను కేంద్రం కేవలం 17 నెలల్లో నిర్మించింది. వైసీపీ ప్రభుత్వం మాత్రం నాలుగేళ్లలో ఒక్క మెడికల్ కాలేజీని కూడా పూర్తిస్థాయిలో నిర్మించలేకపోయింది. పైగా రూ.8,480 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించిన కాలేజీల్లో చాలా వరకు ఇప్పటికీ పునాదుల దశలోనే ఉన్నాయి. మరోవైపు ఈ మొత్తంలో దాదాపు రూ.5వేల కోట్ల వరకూ రుణాలు, కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రారంభించినవే తప్ప రాష్ట్ర ఖజానా నుంచి

మిగతా 12వ పేజీలో...

అవినీతి 'గని' పరార్!

గనుల వెంకటరెడ్డి విదేశాలకు జంప్



ప్రభుత్వ అలసత్వమే కారణం?

ఇసుక అక్రమాల్లో జూన్ 7న బదిలీ వేటు

మధ్యలో తన సస్పెన్షన్‌పై హైకోర్టులో పిటిషన్ వేయడానికి రాక

ఆ వెంటనే తిరిగి హైదరాబాద్‌కు


తర్వాత 3 రోజులకు ఏసీబీ కేసు

ఇప్పుడు గాలిస్తున్నా ప్రయోజనం శూన్యం

అన్నీ తెలుసుకునే దర్జాగా విదేశాలకు!

అమరావతి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఊహించిందే జరిగింది. గనుల శాఖ మాజీ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డి విదేశాలకు పరారయ్యారు. ఇసుక కాంట్రాక్టులో అవినీతి, అక్రమాల కేసులో ఆయన కోసం ఏసీబీ గత రెండు మూడ్రోజులుగా గాలిస్తున్నా ఆచూకీ కనిపెట్టలేకపోయింది. ఎందుకంటే అంతకు ముందే వెంకటరెడ్డి విదేశాలకు పారిపోయినట్లు తాజాగా

మిగతా 12వ పేజీలో...



ప్రతి ప్రశ్నకూ.. ఒకే సమాధానం

12

నాకు తెలియదు.. గుర్తులేదు!



టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో పోలీసు కస్టడీలో నందిగం సురేశ్

విచారణకు సహకరించని వైనం

ఆదివారం రాత్రి స్టేషన్‌లోనే నిద్ర



వెంకట్రామిరెడ్డిని కాపాడుతున్నదెవరు?

11

వైసీపీ వీరవిధేయుడికి సచివాలయం నుంచే రక్షణ

గతంలోనూ సస్పెన్షన్ ఎత్తివేతకు ప్రతిపాదన

బయటికి పొక్కడంతో అభియోగాలకు ఆదేశం

పది రోజుల్లో వివరణ ఇవ్వకుంటే చర్యలని హెచ్చరిక

ఆ గడువు కూడా ముగిసి పదిహేను రోజులైంది

అయినా ఇంతవరకూ ఎలాంటి చర్యలూ లేవు



11

'రివర్స్'కు చెల్లు

జలవనరుల శాఖలో తిరిగి 2003 నాటి టెండర్ విధానం

పాత జీవో 94ను అమల్లోకి తెచ్చిన ప్రభుత్వం

ప్రత్యేక సీఎస్ ఉత్తర్వు

ఫైబర్ నెట్ ఈడీ జగన్మోహనరావుపై వేటు

12

డేటా మాయం, నియామకాల్లో అవకతవకల వల్లే!

ఎండీ సిఫారసుకు ప్రభుత్వం ఆమోదం

బోటు ఆపరేషన్‌లో 'కావడి'

ప్రకాశం బ్యారేజీ వద్ద బోటు లాగడానికి కొత్త ప్లాన్

రెండు కార్గో బోట్లకు ఇనుప గడ్డర్ల ఏర్పాటు

నేడు గొల్లపూడి వైపు లాక్కెళ్లే అవకాశం

12

రాహుల్ నెంబర్ వన్ ఉగ్రవాది

» సిక్కులపై రాహుల్ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కన్నెర్ర

» రాహుల్ భారతీయుడే కాదన్న రవ్‌నీత్ సింగ్ బిట్టు



న్యూఢిల్లీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఇటీవలి అమెరికా పర్యటనలో సిక్కులపై చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు మండిపడ్డారు. ఎప్పుడూ విదేశాల్లో గడిపే రాహుల్ అసలు భారతీయుడే కాదన్నారు. రాహుల్ వ్యాఖ్యలను ఉగ్రవాదులు అభినందిస్తున్నారంటే ఆయనకంటే పెద్ద ఉగ్రవాది లేరని బిట్టూ చెప్పారు. రాహుల్‌ను పట్టించిన వారికి రివార్డ్ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. భారత్‌లో సిక్కులను తలపాగా ధరించేందుకు, గురుద్వారాకు వెళ్లేందుకు అనుమతించాలా, వద్దా, అనే అంశంపై పోరాటం జరుగుతోందని రాహుల్ ఇటీవలి అమెరికా పర్యటనలో వ్యాఖ్యానించారు. అన్ని మతస్థులదీ ఇదే పరిస్థితి అని రాహుల్ చెప్పారు. ఈ మాటలను తప్పుబట్టిన కేంద్ర మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు లోక్‌సభ ఎన్నికల ముందు కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరారు.

ప్రజాస్వామ్య సౌధంపై బుల్డోజర్లు: ఖర్గే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: ప్రజాస్వామ్య సౌధాన్ని నాశనం చేసేందుకు, బుల్డోజర్ల తరహాలో వ్యవస్థలను కూల్చివేసేందుకు గత పదేళ్లుగా వ్యూహాత్మక ప్రయత్నాలు జరుగుతున్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు మరింత అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఆయన ట్వీట్ చేశారు. రాజ్యాంగ నిర్మాతలు ఎంతో శ్రమపడి నిర్మించిన వ్యవస్థలను ధ్వంసం చేయకుండా దేశంలోని 140 కోట్ల మంది ప్రజలు ఈ ఏడాది తీర్పు ఇచ్చారని గుర్తుచేశారు. అందువల్ల 2024ను కీలక మలుపు తిరిగిన సంవత్సరంగా గుర్తుంచుకోవాలని అభిప్రాయపడ్డారు.

ఖైదీల విడుదలకు లాయర్ల తప్పుడు సమాచారం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీల ముందస్తు విడుదల కోసం పిటిషన్లలో న్యాయవాదులు తప్పుడు సమాచారం ఇస్తుండడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. కోర్టులోనూ తప్పుడు వివరాలే చెబుతున్నారని పేర్కొంది. ఇది తమ నమ్మకాన్ని సడలింపజేస్తోందని వ్యాఖ్యానించింది. గత మూడు వారాల్లో తప్పుడు వివరాలు ఉన్న ఆరేడు పిటిషన్లు తమ పరిశీలనకు వచ్చాయని చెప్పిన జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్ ధర్మాసనం పై వ్యాఖ్య చేసింది. ప్రతి రోజూ ప్రతి ధర్మాసనమూ 60-80 చిన్నచిన్న కేసులపై విచారణ జరపాల్సి ఉంటుందని తెలిపింది. అన్ని సార్లు పేజీలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించే అవకాశం ఉండకపోవచ్చని తెలిపింది. కొన్నిసార్లు న్యాయవాదుల మీద ఉన్న నమ్మకం ఆధారంగా విచారణ జరుపుతామని చెప్పింది.

డాక్టర్లకు ప్రత్యేక ఐడీలు.. ఎన్ఎంసీ రిజిస్ట్రేషన్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: దేశంలో ప్రాక్టీస్ చేయడానికి అర్హులైన ఎంబీబీఎస్ డాక్టర్లందరి రిజిస్ట్రేషన్ ప్రక్రియను నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) తన పోర్టల్‌లో ప్రారంభించింది. వైద్యులకు ప్రత్యేక గుర్తింపు కార్డు కేటాయింపులో భాగంగా ఇటీవల ఎన్ఎంసీ ఈ పోర్టల్‌ను ఆవిష్కరించింది. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వైద్యులందరూ నేషనల్ మెడికల్ రిజిస్టర్ (ఎన్ఎంఆర్)లో నమోదవుతారు. ఆధార్ కార్డుల ద్వారా వారి ప్రామాణికతను ధ్రువీకరిస్తారు. ఇండియన్ మెడికల్ రిజిస్టర్ (ఐఎంఆర్)లో రిజిస్టర్ అయిన ఎంబీబీఎస్ డాక్టర్లు అందరూ మరోసారి ఎన్ఎంఆర్, ఎన్ఎంసీలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఇటీవల ఓ ప్రకటనలో తెలిపారు.

ఈ నెలలోనే సాహస 'సాగర్ పరిక్రమ'

» ఇద్దరు మహిళా నేవీ అధికారుల ప్రపంచ యాత్ర



రూప, దిల్నా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: భారత నౌకా దళానికి చెందిన ఇద్దరు మహిళా అధికారులు అత్యంత కఠినమైన సాహస యాత్ర 'సాగర్ పరిక్రమ'కు సిద్ధమవుతున్నారు. లెఫ్టినెంట్ కమాండర్లు ఎ. రూపా, కె. దిల్నా త్వరలోనే సవాలుతో కూడిన సముద్ర యాత్రను ప్రారంభించనున్నారు. భారత నౌకాదళ సెయిలింగ్ నౌక (ఐఎన్ఎస్‌వీ) తారిణిలో ఈ ఇద్దరూ భూగోళాన్ని చుట్టే సాహస యాత్ర చేపట్టనున్నారని నేవీ అధికార ప్రతినిధి వివేక్ మధ్వాల్ ఆదివారం తెలిపారు. దీనికోసం వారు మూడేళ్లుగా సిద్ధమవుతున్నారని చెప్పారు. "సాగర్ పరిక్రమకు నైపుణ్యం అవసరం. అత్యంత కఠినమైన ఈ ప్రయాణానికి శారీరక దృఢత్వంతోపాటు మానసిక సంసిద్ధత కూడా కావాలి. ఈ మహిళా అధికారులు దీనికోసం కఠోర శిక్షణ పొందారు. వేల మైళ్ల ప్రయాణించిన అనుభవాన్ని సంపాదించారు" అని మధ్వాల్ పేర్కొన్నారు. ఈ సాహస యాత్ర ఈ నెలలోనే ఉండొచ్చని భావిస్తున్నారు. కాగా, గోల్డెన్ గ్లోబ్ రేస్ హీరో కమాండర్ అభిలాష్ టోమీ (రిటైర్డ్) మార్గదర్శకత్వంలో మహిళా అధికారులు రూప, దిల్నా ప్రస్తుతం శిక్షణ పొందుతున్నారు. ఆరుగురు సభ్యుల బృందంలో భాగంగా వారిద్దరూ గతేడాది గోవా నుంచి దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్ మీదుగా బ్రెజిల్‌లోని రియో డి జనీరో వరకు జరిగిన సముద్ర యాత్రలో పాల్గొన్నారు. ఆ తర్వాత గోవా నుంచి పోర్ట్ బ్లెయిర్ వరకు సెయిలింగ్ యాత్ర చేపట్టి క్షేమంగా తిరిగి వచ్చారు.

'శంకర్ దాదా.. ఎంబీబీఎస్'లు!

బెంగాల్ ఆరోగ్య శాఖలో భారీ కుంభకోణం

» కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలి.. స్థానిక మీడియా కథనం

కోల్‌కతా, సెప్టెంబరు 15: పశ్చిమబెంగాల్‌లో వైద్య విద్యలో భారీ కుంభకోణం జరిగినట్లు స్థానిక మీడియా ఆరోపించింది. పలువురు వైద్యులతో కూడిన ఈ శక్తిమంతమైన లాబీ.. వైద్య విద్యార్థులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంటర్న్‌ల నుంచి భారీగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలిపింది. పరీక్షల్లో మార్కులు బాగా వేయడం, పాస్ చేయించడానికి ముడుపులు తీసుకుంటున్నట్లు, డబ్బులు ఇవ్వనివారిని ఫెయిల్ చేస్తున్నట్లు ఆరోపించింది. నార్త్ బెంగాల్‌కు చెందిన ఓ వైద్యుడి ఆధ్వర్యంలో ఈ పైరవీలు నడుస్తున్నందున.. దీన్ని 'నార్త్ బెంగాల్ లాబీ'గా పేర్కొన్నట్లు తెలిపింది. ఆ వైద్యుడు సీఎం మమతా బెనర్జీకి సన్నిహితుడనీ వెల్లడించింది. గత దశాబ్ద కాలంగా రాష్ట్ర ఆరోగ్య శాఖతో పాటు అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలు, ఆస్పత్రుల్లో ఆయన హవా నడుస్తోందని పేర్కొంది. ఈ దందాలో ఆరోగ్య శాఖకు చెందిన ఉన్నతాధికారులు కూడా ఉన్నట్లు వివరించింది. టీఎంసీ ఎమ్మెల్యేగా ఉన్న వైద్యుడు కూడా ఈ లాబీలో ఉన్నారని, లాబీ సభ్యులు అధికార టీఎంసీకి చెందిన వైద్య విభాగం 'తృణమూల్ ఛాత్ర పరిషత్ (టీఎంసీపీ)'కి చెందిన వారని.. పలువురు జూనియర్ వైద్యులు తెలిపినట్లు కథనం పేర్కొంది. అలాగే వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు కూడా భారీ మొత్తంలో లంచాలు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపింది. అలాగే ప్రభుత్వ ఆస్పత్రులు, వైద్య కళాశాలల్లో పోస్టింగులు, బదిలీల విషయంలోనూ ఈ లాబీదే హవా అని తెలిపింది. మొత్తం మీద ప్రభుత్వ వైద్య కళాశాలల నుంచి పెద్ద సంఖ్యలో గ్రాడ్యుయేట్లు, పీజీలు పాసై వస్తున్న వారిలో అత్యధికులు అనర్హులేనని పేర్కొంది. వారికి వైద్యులయ్యే అర్హత లేదని, కనీస నైపుణ్యాలు కూడా ఉండవని.. లంచాలిచ్చి పరీక్షలు పాసవుతున్నారని తెలిపింది. వారంతా 'శంకర్‌దాదా.. ఎంబీబీఎస్'లేనని ఆ కథనం తెలిపింది. ఈ లాబీ దందాపై స్థానిక అధికారులతో విచారణ జరిపిస్తే ప్రయోజనం ఉండదని.. దీనిపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించింది. మొత్తం వ్యవహారంపై విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైద్య నిపుణులు కోరుకుంటున్నట్లు తెలిపింది.

సీబీఐ కస్టడీకి ఆర్జీ కర్ ఘోష్, అభిజిత్

కోల్‌కతా, సెప్టెంబరు 15: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ఆస్పత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్, తలా పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో అభిజిత్ మండల్‌లను స్థానిక కోర్టు సెప్టెంబరు 17 వరకు సీబీఐ కస్టడీకి పంపిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో వైద్యురాలి అత్యాచారం, హత్యకు సంబంధించి ఈ ఇద్దరిని సీబీఐ ఆ కోర్టులో హాజరుపరిచింది. ఈ కేసులో వారిద్దరిది కీలక పాత్ర అని, కోర్టు తమ కస్టడీకి ఇచ్చినందున ఇద్దరిని కలిపి ప్రశ్నిస్తామని ఓ సీబీఐ అధికారి తెలిపారు. హత్యాచార ఘటన వెనుక పెద్ద కుట్ర ఉండవచ్చని, ఘోష్, మండల్‌లకు అందులో కీలక పాత్ర ఉందని సీబీఐ కోర్టులో వాదించింది.

రాజీనామా చేస్తా

(మొదటి పేజీ తరువాయి)



జైలులోనే ఉన్నారు. వారూ త్వరలో బయటకు వస్తారని భావిస్తున్నాను" అనే ఆశాభావం వ్యక్తం చేశారు. తన రాజీనామా తర్వాత కొత్త సీఎం ఎంపికకు పార్టీ నిర్ణయం తీసుకుంటుందన్నారు. బీజేపీపై ఆయన తీవ్రవ్యాఖ్యలు చేశారు. "ఆప్‌ను ముక్కలు చేసేందుకే బీజేపీ నన్ను జైలుకు పంపింది. ఆప్‌లో చీలికలు తెచ్చి ఢిల్లీలో గద్దెనెక్కాలని కుట్రలు పన్నింది. కానీ పార్టీని విచ్ఛిన్నం చేయలేకపోయింది" అన్నారు. బీజేపీ కుట్రలను ముందే గుర్తించి, రాజ్యాంగాన్ని రక్షించాలనే ఉద్దేశంతోనే తాను ఇంతకాలం రాజీనామా చేయలేదని పేర్కొన్నారు. "జైలు నుంచి ప్రభుత్వాన్ని ఎందుకు నడపకూడదని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అలా సర్కారును నడపవచ్చని వెల్లడించింది. ఫిబ్రవరిలో జరగాల్సిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను నవంబరులో నిర్వహించాలని ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేస్తున్నా. మహారాష్ట్రతోపాటు ఢిల్లీ ఎన్నికలు జరగాలని ఆకాంక్షిస్తున్నా. ఇంటింటికీ వెళ్లి ఓట్లడుగుతాను. నేను నిర్దోషినని నమ్మితేనే ఓట్లు వేయాలని ప్రజలను కోరుతాను. సుప్రీంకోర్టు నాకు బెయిలిచ్చింది. ప్రజాకోర్టులో ప్రజలే తీర్పునిస్తారు. నేను దోషినా? నిర్దోషినా? అనేదాన్ని ప్రజలే నిర్ణయిస్తారు. నేను, మనీశ్ సిసోడియా ప్రజాకోర్టునే ఆశ్రయిస్తాం. నా నిర్దోషిత్వంపై అంతిమన్యాయనిర్ణేతలు ప్రజలే. రాజీనామా నిర్ణయం నాకు నేను విధించుకుంటున్న అగ్నిపరీక్ష" అని ఉద్వేగంగా అన్నారు. బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో బీజేపీ కొత్త ఆటను ప్రారంభించిందని మండిపడ్డారు. కర్ణాటకలో సిద్దరామయ్య, కేరళలో పినరయి విజయన్, పశ్చిమబెంగాల్‌లో మమతాబెనర్జీపై కేసులు నమోదు చేశారన్నారు. "బీజేపీయేతర సీఎంలందరికీ నా విన్నపం ఏమిటంటే కేసులు నమోదుచేస్తే రాజీనామాలుచేయొద్దు" అని అన్నారు.

బ్రిటిషర్లు కూడా ఊహించి ఉండరు

దేశాన్ని రెండొందల ఏళ్లు పాలించిన బ్రిటిషర్లు కూడా భవిష్యత్తును ఊహించి ఉండరని కేజ్రీవాల్ వ్యంగ్యంగా అన్నారు. "బ్రిటిషర్లు భవిష్యత్‌లో తమ కంటే క్రూరమైన పాలకులు భారత్‌లో ఉంటారని అస్సలు అనుకుని ఉండరు. 75ఏళ్ల స్వతంత్ర భారతంలో అది సాధ్యమైంది" అని బీజేపీని ఉద్దేశించి అన్నారు. జైలులో ఎన్నో పుస్తకాలు చదివానని, భగవద్గీతను ఎన్నోసార్లు పఠించానని, భగత్‌సింగ్ పుస్తకం (భగత్‌సింగ్ కీ జైల్ డైరీ)ను చదివానని చెప్పారు. "భగత్‌సింగ్ జైలులో ఉండగా.. తన మిత్రులకు, దేశ యువతకు ఎన్నో లేఖలు రాశారు. బ్రిటిష్ పాలకులు వాటిని సంబంధిత వ్యక్తులకు అందేలా చేశారు. నేను జైలు నుంచి లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఎన్నో లేఖలు రాశాను. నేను జైలులో ఉన్నందున ఢిల్లీ మంత్రి ఆతిషిని జెండావందనం చేసేందుకు అనుమతించాలని ఓ లేఖలో కోరా. స్పందన లేదు. కానీ నాకు హెచ్చరికలు వచ్చాయి. మరోమారు లేఖరాస్తే ములాఖత్‌లో కుటుంబ సభ్యులను కలిసే అవకాశం కూడా దక్కదని బెదిరించారు. నాతో ఒకసారి ములాఖత్ అయిన సందీప్ పాఠక్‌ను బ్లాక్‌లిస్టులో పెట్టారు. ఇంతటి నియంతృత్వం రాబోతుందని బ్రిటిషర్లు అప్పట్లో ఊహించి ఉండరు" అని కేజ్రీవాల్ అన్నారు.

అది గిమ్మిక్కే: కాంగ్రెస్

కేజ్రీవాల్ రాజీనామా నాటకం ఓ గిమ్మిక్కేనని కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్ విమర్శించారు. "కేజ్రీవాల్ రాజీనామాకు మేము ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నాం. ఇప్పుడు గిమ్మిక్కుల్లో భాగంగా రాజీనామా ప్రకటన చేశారు. ఆయన తిరిగి సీఎం అయ్యే సవాలే లేదు. ఓ సీఎం బెయిల్‌పై విడుదలయ్యాక ఆయనను సీఎంవోకు వెళ్లొద్దని, ఫైళ్లపై సంతకాలు చేయొద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇది చరిత్రలోనే మొదటిసారి. అలాంటి బెయిల్ షరతులను ఏ సీఎం కూడా ఎదుర్కోలేదు. ఆయన బయటకు వస్తే లిక్కర్ కేసుల్లో ఆధారాలను మార్చేస్తారని సుప్రీంకోర్టు కూడా ఊహించి ఉండవచ్చు"అని ఆయన అన్నారు.

పబ్లిసిటీ కోసం నాటకం: బీజేపీ

కేజ్రీవాల్ ప్రకటన పబ్లిసిటీ కోసం ఆడుతున్న నాటకమని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారి అన్నారు. సుప్రీంకోర్టు షరతులకు కట్టుబడే ఆయన రాజీనామా చేయాల్సి వస్తోందన్నారు. "ఆప్ అంటేనే అవినీతి పార్టీ అని దేశమంతా తెలుసు. పబ్లిసిటీ స్టంట్‌తో తన ఇమేజ్‌ను తిరిగి పొందాలని కేజ్రీవాల్ ప్రయత్నాలు మొదలుపెట్టారు" అని అన్నారు.

ఆతిషికి అవకాశం?

కేజ్రీవాల్ రాజీనామా చేస్తే ఢిల్లీకి తదుపరి సీఎం ఎవరు? అంటే ఆప్ వర్గాలు ఆతిషి వైపే చూపిస్తున్నాయి. కేజ్రీవాల్, సిసోడియా వంటివారు జైలులో ఉన్నప్పుడు ఆతిషి పార్టీని చీలిపోకుండా కాపాడారనే అభిప్రాయాలున్నాయి. 2013 ఎన్నికల్లో మ్యానిఫెస్టోను రూపొందించి ఆప్ అధికారం చేపట్టడానికి ఆతిషి ప్రధాన కారణం. కేజ్రీవాల్ జైలులో ఉన్నప్పుడు పంద్రాగస్టు సందర్భంగా జెండా ఎగురవేసే అవకాశం ఆతిషికి ఇవ్వాలని ఎల్జీకి లేఖ రాయడం ఆమెకున్న ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది. అయితే, సీఎం రేసులో కేజ్రీవాల్ భార్య సునీత, ఆప్ సీనియర్ నేతలు గోపాల్ రాయ్, సౌరభ్ భరద్వాజ్, కైలాశ్ గెహ్లోత్ పేర్లూ వినిపిస్తున్నాయి.

హరియాణాపై కేజ్రీవాల్ దృష్టి

ఢిల్లీ సీఎం బాధ్యతల నుంచి తప్పుకొన్నాక కేజ్రీవాల్ పూర్తిగా హరియాణా ఎన్నికలపై దృష్టిసారిస్తారని తెలుస్తోంది. రైతు ఉద్యమాల నేపథ్యంలో హరియాణాలో బీజేపీకి గడ్డుకాలమున్నట్లు విశ్లేషణలు వస్తుండగా.. దాన్ని అనుకూలంగా మలచుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నాలు చేస్తోంది. హరియాణాపై తమ పార్టీ జెండా ఎగురవేయాలనుకుంటోంది. అయితే ఫలితాలను తారుమారుచేసి ఆప్‌కు పట్టం కట్టబెట్టే దిశలో కేజ్రీవాల్ పక్కా వ్యూహంతో ఉన్నట్లు సమాచారం. హరియాణాలో పొత్తుపై ఇండియా కూటమితో చర్చలు విఫలమవడంతో ఒంటరిపోరుకు కేజ్రీవాల్ నిర్ణయించారు. "ఆప్ 2013లో అనూహ్యంగా ఢిల్లీ పీఠం చేజిక్కించుకున్న తర్వాత వరుసగా అధికారం చేపట్టింది. పంజాబ్‌లో పాగా వేసి.. గోవాలో ఓట్ల శాతాన్ని పెంచుకుంది. జాతీయ పార్టీగా ఎదిగింది. హరియాణాలో పాగావేసినా.. చెప్పుకోదగ్గ సీట్లు సాధించినా..ఆప్ జాతీయ పార్టీ హోదాకు మరో నాలుగైదేళ్ల ఢోకా ఉండదు. అదే కేజ్రీవాల్ వ్యూహంగా కనిపిస్తోంది"అని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.



అయ్యప్ప భక్తులకు శుభవార్త..!

చెంగనూరు-పంపా రైల్వేలైన్‌కు రైల్వే బోర్డు పచ్చజెండా

» కేంద్ర క్యాబినెట్ ఆమోదమే తరువాయి

తిరువనంతపురం, సెప్టెంబరు 15: అయ్యప్ప భక్తులకు శుభవార్త..! శబరిమలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం చెంగనూరు నుంచి పంపాబేస్ వరకు హైస్పీడ్ రైల్వే లైన్‌ను నిర్మించేందుకు రైల్వే బోర్డు ఆమోదముద్ర వేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలోనే పనులను ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. ఇప్పటి వరకు తెలుగు రాష్ట్రాల భక్తులు కోటాయం, ఎర్నాకుళం లేదా చెంగనూరు వరకు రైళ్లలో వెళ్లి అక్కడి నుంచి ప్రైవేటు వాహనాలు/కేఎస్ఆర్టీసీ బస్సుల్లో పంపాబేస్‌కు చేరుకునేవారు. ఈ ప్రాంతాల నుంచి రోడ్డు మార్గంలో పంపాకు దూరం 100 కిలోమీటర్లలోపే ఉన్నా.. ఘాట్ సెక్షన్ల కారణంగా కనీసం 4గంటల సమయం పడుతుంది. చెంగనూరు నుంచి పంపాకు రైల్వేలైన్ పూర్తయితే తెలుగు రాష్ట్రాల నుంచి నేరుగా పంపాబేస్ వరకు రైళ్లలో వెళ్లవచ్చు. కేంద్ర క్యాబినెట్ ఆమోదముద్ర పడిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు. ఈ రూట్‌లో వందే భారత్ మోడల్ రైళ్లను నడుపుతామన్నారు.

కేరళలో నిఫాతో ఒకరి మృతి

మలప్పురం, సెప్టెంబరు 15: కేరళలో నిఫా వైరస్ కారణంగా ఓ 24 ఏళ్ల వ్యక్తి మృతి చెందారు. మలప్పురానికి చెందిన వ్యక్తి బెంగళూరులో నివసిస్తూ.. ఈ నెల 9వ తేదీన ఇక్కడకు తిరిగొచ్చాడని, జ్వరం తదితర లక్షణాలతో మలప్పురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మరణించాడని కేరళ ఆరోగ్య మంత్రి వీణా జార్జి ఆదివారం వెల్లడించారు. అతని శాంపిళ్లను పరీక్షించగా నిఫా వైరస్ పాజిటివ్ వచ్చినట్లు తెలిపారు. అతడితో సన్నిహితంగా మెలిగిన 151 మందిని ఐసోలేట్ చేశామని, వారిలో ఐదుగురికి జ్వరం లక్షణాలున్నాయని చెప్పారు.

'బీమా జీఎస్టీ'పై సమీక్షకు మంత్రివర్గ ఉపసంఘం

» భట్టి విక్రమార్క, ఏపీ మంత్రి పయ్యావుల కేశవ్‌కు చోటు



న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియాలపై జీఎస్టీని సమీక్షించి, రేట్ల సవరణకు సూచనలు ఇచ్చేందుకు జీఎస్టీ కౌన్సిల్ ఆదివారం 13 మంది సభ్యులతో మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఈ కమిటీకి బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సహా పలు రాష్ట్రాలకు చెందిన 12 మంది ఆర్థిక మంత్రులు/ఆర్థికశాఖను పర్యవేక్షిస్తున్న సీఎం/డిప్యూటీ సీఎంలను సభ్యులుగా నియమించింది. అక్టోబరు 30లోగా తుది నివేదికనివ్వాలని ఈ కమిటీని ఆదేశించింది. ఈ నెల 9న జరిగిన 54వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పశ్చిమబెంగాల్ లాంటి రాష్ట్రాలు జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియాలపై జీఎస్టీని ఎత్తివేయాలని డిమాండ్ చేశాయి. మరికొన్ని రాష్ట్రాలు జీఎస్టీని 5శాతానికి తగ్గించాలని కోరాయి. ఈ నేపథ్యంలోనే మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ఈ కోవలోని బీమా ప్రీమియాలపై 18% జీఎస్టీ ఉంది. కమిటీ.. ఆరోగ్య బీమాపై వ్యక్తిగత, గ్రూప్, కుటుంబ కేటగిరీల వారీగా.. జీవిత బీమా విషయంలోనూ టర్మ్, లైఫ్ ఇన్సూరెన్స్ కేటగిరీల వారీగా.. అధ్యయనం చేయనుంది. ఆ తర్వాత ఎంతమేర జీఎస్టీ నిర్ణయించాలనే అంశంపై సూచనలతో నివేదిక సమర్పించనుంది.

ఝార్ఖండ్‌కు చొరబాట్ల ముప్పు

జెంషెడ్పూర్‌లో బీజేపీ ఎన్నికల సభలో మోదీ



ప్రధాని మోదీతో హేమంత్ సోరెన్

రాంచీ, జంషెడ్పూర్, సెప్టెంబరు 15: ఝార్ఖండ్ ముక్తి మోర్చా కూటమి సర్కారు ఓటు బ్యాంకు రాజకీయాలు, అధికార దాహం కోసం బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసలను.. ఆ దేశం నుంచి రోహింగ్యాల రూపంలో చొరబాట్లను ప్రోత్సహిస్తోందని ప్రధాని మోదీ ఆరోపించారు. ఈ చొరబాటుదారులు ఝార్ఖండ్‌కు పెనుముప్పు అని.. ఫలితంగా ఆ రాష్ట్రంలోని సంతాల్ పరగణాలు, కొల్హాన్ ప్రాంతాల్లో జనాభా సంతులనం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతాల్లోని భూములను రోహింగ్యాలు, బంగ్లాదేశీయులు తమ గుప్పిట్లోకి తెచ్చుకున్నారని, తద్వారా గ్రామాలపై పట్టుసాధించారని ఆడబిడ్డలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. నవంబరులో ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్రంలోని జెంషెడ్పూర్ గోపాల్ మైదానంలో ఆదివారం 'పరివర్తన్ మహార్యాలీ' పేరుతో జరిగిన బహిరంగసభలో మోదీ ప్రసంగించారు. బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసలపై స్వతంత్ర కమిటీతో దర్యాప్తు చేయించాలని హైకోర్టు ఉత్తర్వులిచ్చినా రోహింగ్యాల చొరబాట్లను ఝార్ఖండ్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఆదివాసీ ఓటు బ్యాంకుతో అధికారంలోకొచ్చిన జేఎంఎం.. అడవులను ఆక్రమించుకుంటున్న బడాబాబులకు దన్నుగా నిలుస్తోందన్నారు.

'జమిలి' ఈ టర్మ్‌లోనే!

ఒక దేశం-ఒకే ఎన్నికకు అన్ని పార్టీల మద్దతుపై మోదీ సర్కారు ఆశాభావం

» త్వరలోనే జనాభా లెక్కల సేకరణ

» కులగణనపై ఇంకా నిర్ణయించలేదు

» ప్రభుత్వ వర్గాల వెల్లడి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: లోక్‌సభలో బీజేపీకి సొంతగా సంపూర్ణ మెజారిటీ లేనప్పటికీ జమిలి ఎన్నికలు నిర్వహించాలని గట్టి పట్టుదలగా ఉంది. 'ఒక దేశం-ఒకే ఎన్నిక'కు పార్టీలకతీతంగా మద్దతు లభిస్తుందని మోదీ సర్కారు ఆశాభావంతో ఉంది. మోదీ సారథ్యంలోని ప్రభుత్వం మూడోసారి అధికార పగ్గాలు చేపట్టి వంద రోజులు పూర్తవుతోందని.. పాలక కూటమిలో సమన్వయం అద్భుతంగా ఉందని.. ఈ బంధం ఐదేళ్లూ పటిష్ఠంగా కొనసాగుతుందని గట్టిగా భావిస్తోందని పేరు చెప్పడానికి ఇష్టపడని ప్రభుత్వ వర్గాలు ఆదివారం తెలిపాయి. 'జమిలి ఎన్నికలు ఈ టర్మ్‌లోనే అమలవుతాయి. వాస్తవ రూపం దాల్చబోతోంది' అని వెల్లడించాయి. లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ విడుదల చేసిన మేనిఫెస్టోలో జమిలి ఎన్నికల హామీ కూడా ఉంది. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు సమాంతరంగా ఒకేసారి ఎన్నికలు జరపాలని.. ఇవి పూర్తయిన వంద రోజుల వ్యవధిలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలంటూ.. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సారథ్యంలోని అత్యున్నత స్థాయి కమిటీ ఇప్పటికే సిఫారసు చేసింది. జాతీయ లా కమిషన్ కూడా 2029 నుంచి లోక్‌సభ, అసెంబ్లీలు, పంచాయతీలు/మున్సిపాలిటీలకు ఒకే దఫా ఎన్నికలు జరపాలని.. ఒకవేళ త్రిశంకు సభ ఏర్పడితే లేదా అవిశ్వాస తీర్మానంలో ప్రభుత్వాలు ఓడిపోతే ఐక్య ప్రభుత్వాలు ఏర్పాటుచేయాలన్న నిబంధనతో విడిగా ఓ నివేదిక సమర్పించే అవకాశం ఉంది. తన సిఫారసుల అమలుకు ప్రత్యేక గ్రూపు ఏర్పాటు చేయాలని కోవింద్ కమిటీ ప్రతిపాదించింది. అలాగే జమిలి ఎన్నికలకు 18 రాజ్యాంగ సవరణలను సూచించింది. వీటిలో ఎక్కువ సవరణలకు రాష్ట్రాల అసెంబ్లీల ఆమోదం అక్కర్లేదని వివరించింది.



జమిలి ఎన్నికల నిర్వహణపై తన నేతృత్వంలోని నివేదికను రాష్ట్రపతికి సమర్పిస్తున్న కోవింద్(ఫైల్)

'కులం' కాలమ్ ఉంటుందా?

జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానుంది. అయితే కులాలవారీగా జనగణన చేపట్టడంపై కేంద్రం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. సదరు డాక్యుమెంటుపై 'కులం' కాలమ్ పెట్టాలా.. అక్కర్లేదా అన్న దానిపై నిర్ణయం తీసుకోవలసి ఉందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు, కొన్ని ఎన్డీయే పార్టీలు కూడా కులగణన చేపట్టాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నాయి. జనాభా లెక్కలు వెల్లడైన తర్వాత చట్టసభల నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ జరుగుతుంది. ఇది పూర్తికాగానే లోక్‌సభ, అసెంబ్లీల్లో మహిళలకు మూడో వంతు సీట్ల కేటాయింపు అమల్లోకి వస్తుంది. కాగా, ప్రభుత్వ ఎన్యుమరేటర్ల ద్వారా కాకుండా తమంత తాము జనగణన దరఖాస్తును నింపాలనుకునే పౌరులు ఎన్‌పీఆర్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చు. ఇదిలా ఉండగా, రెండేళ్లలో దేశంలో నక్సలిజం పూర్తిగా కనుమరుగవుతుందని కేంద్ర వర్గాలు అంచనా వేస్తున్నాయి. మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత మొదటి 100 రోజుల కార్యాచరణ జాబితాలోనే నక్సల్స్ సమస్యపై దృష్టి పెట్టింది. ఈ నేపథ్యంలో భద్రతా బలగాల ఆపరేషన్లలో 150 మందికి పైగా మావోయిస్టులు హతమయ్యారు.

చేతబడి నెపంతో 9 మంది హత్య

» ఛత్తీస్‌గఢ్‌లో 4 రోజుల వ్యవధిలో రెండు దారుణాలు.. మృతుల్లో 11 నెలల పసికందు

రాయ్‌పూర్, సెప్టెంబరు 15: చేతబడి చేస్తున్నారనే అనుమానంతో రెండు కుటుంబాలకు చెందిన 9 మందిని ఇరుగుపొరుగు వారే అతి కిరాతకంగా చంపేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో 4 రోజుల వ్యవధిలో ఈ రెండు దారుణాలు చోటు చేసుకున్నాయి.. ఆదివారం సుక్మా జిల్లా ఇట్కల్ గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురిపై గొడళ్లు, కర్రలతో దాడి చేసి హతమార్చారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులున్నారు. మృతులను మౌసం కన్నా (60), బుచ్చా (34), అర్జో (32), బీరి, కర్క లచ్చి (43)గా పోలీసులు గుర్తించారు. మౌసం కన్నా కుటుంబం నిర్వహిస్తున్న క్షుద్రపూజల కారణంగా పలువురు చిన్నారులు అనారోగ్యం బారిన పడ్డారని ఆరోపిస్తూ గ్రామస్థులు ఈ దాడికి ఒడిగట్టినట్లు జిల్లా ఎస్పీ కిరణ్ జి చవాన్ తెలిపారు. అంతకుముందు.. గురువారం(ఈ నెల 12న) ఛార్‌ఛెడ్ గ్రామంలోనూ ఒకే కుటుంబానికి చెందిన నలుగురిని పొరుగింటి వారే చంపేశారు. మృతుల్లో 11 నెలల మగ శిశువు కూడా ఉన్నాడు. మృతులను చైత్రం కైవర్త్య(47), యశోద (30), జమున(28), యశ్ (11 నెలలు)గా గుర్తించారు. చైత్రం కైవర్త్య తల్లి చేస్తున్న క్షుద్రపూజల కారణంగా తమ కూతురి ఆరోగ్యం దెబ్బతిందని ఆరోపిస్తూ పొరుగింట్లో ఉండే రాంనాథ్ పాట్లే కుటుంబం ఈ దాడి చేసిందని పోలీసులు చెప్పారు.

మూడంతస్తుల భవనం కూలి.. ఒకే కుటుంబంలో 10 మంది మృతి



లఖ్‌నవూ, సెప్టెంబరు 15: భారీ వర్షాల కారణంగా యూపీలోని మేరఠ్‌లో శనివారం మూడంతస్తుల భవనం కూలి ఒకే కుటుంబానికి చెందిన 10 మంది మరణించారు. ఐదుగురు గాయపడ్డారు. మరణించిన వారిలో ఐదుగురు మైనర్లు ఉన్నారు. శిథిలాల కింద మరికొంత మంది చిక్కుకున్నట్లు అధికారులు భావిస్తున్నారు. కాగా, యూపీలో కురుస్తున్న భారీ వర్షాలకు 11 జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. భీకర వానలకు ఇప్పటి వరకు 17 మంది మరణించినట్లు సమాచారం.

ప్రధాని మోదీపై పుతిన్ గుర్రు



న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నానాటికీ తీవ్రమవుతుండగా.. ప్రధాని మోదీ ఉక్రెయిన్ వెళ్లి.. ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీతో ముఖాముఖి చర్చలు జరపడంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అసంతృప్తిగా ఉన్నారా..? ఇది తెలిసే ఆయనకు వివరణ ఇచ్చేందుకు మోదీ హుటాహుటిన జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్‌ను మాస్కోకు పంపారా..? తాజా పరిణామాలు ఇవే సూచిస్తున్నాయి. ఈ నెల 12న దోభాల్ రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్ వెళ్లారు. అక్కడ పుతిన్‌తో అంతర్గతంగా చర్చలు జరిపారు. ఆయన అధ్యక్షుడితో మాట్లాడిన వీడియోను అక్కడి వార్తాసంస్థ స్పుత్నిక్ విడుదల చేసింది. ఇది సోషల్ మీడియాలో ఇప్పుడు విస్తృతంగా వైరల్ అవుతోంది. 'తన ఉక్రెయిన్ పర్యటన, జెలెన్‌స్కీతో చర్చల సారాంశాన్ని మీకు వివరించేందుకు ఆసక్తిగా ఉన్నట్లు ఫోన్ చర్చల్లో ప్రధాని (మోదీ) మీకు ఇప్పటికే తెలియజేశారు. ఆ చర్చల గురించి మీకు ప్రత్యేకంగా, వ్యక్తిగతంగా తెలియజేసేందుకు నన్ను ఇక్కడకు పంపారు. జెలెన్‌స్కీతో చర్చలు ఆంతరంగికంగా జరిగాయి. వారిద్దరే మాట్లాడుకున్నారు. జెలెన్‌స్కీ వెంట ఇద్దరు ఉన్నారు. ప్రధాని మోదీతో నేనున్నాను. చర్చలకు నేను ప్రత్యక్ష సాక్షిని' అని దోభాల్ పుతిన్‌కు తెలిపారు. ఆయన ఒక్కో మాట పట్టి పట్టి మాట్లాడడం చూస్తే.. మోదీ ఉక్రెయిన్ అధ్యక్షుడితో ఏం మాట్లాడారో పుతిన్‌కు వివరణ ఇచ్చినట్లుగా ఉందని, వారిద్దరి సమావేశంపై రష్యా అధ్యక్షుడు అసంతృప్తిగా ఉన్నట్లు అర్థమవుతోందని నెటిజన్లు వ్యాఖ్యానిస్తున్నారు. రష్యాలోని కజన్‌లో ఈ నెల 22-24 నడుమ 'బ్రిక్స్' దేశాల సదస్సు జరుగనుంది. ఆ సందర్భంగా 22న మోదీతో ద్వైపాక్షిక భేటీకి పుతిన్ దోభాల్‌కు ప్రతిపాదించారు. వాస్తవానికి పుతిన్‌తో వ్యక్తిగతంగా సన్నిహిత సంబంధాలున్న మోదీ.. ఉక్రెయిన్‌పై యుద్ధం విరమించేలా ఆయనపై ఒత్తిడి తేవాలని అమెరికా, ఐరోపా దేశాలు బహిరంగంగానే కోరుతున్నాయి. ఈ యుద్ధంలో తామెవరి వైపూ నిలబడలేదనడం సరికాదని.. శాంతి వైపు తాము ఉన్నామని మోదీ పదే పదే చెబుతున్నారు. జూలై 8, 9 తేదీల్లో రష్యాను సందర్శించి పుతిన్‌తో చర్చలు జరిపారు. యుద్ధం జరుగుతుండగా ఆయన మాస్కోకు వెళ్లి పుతిన్‌ను కలవడంపై జెలెన్‌స్కీతో పాటు అమెరికా, ఐరోపా దేశాలు ఆక్షేపించాయి. ఇది జరిగిన ఆరు వారాల తర్వాత ప్రధాని ఆకస్మికంగా ఉక్రెయిన్ రాజధాని కీవ్‌కు వెళ్లి జెలెన్‌స్కీతో ప్రత్యేక చర్చలు జరిపారు. యుద్ధానికి స్వస్తి పలికేందుకు ఇరుదేశాల అధినేతలు కూర్చుని చర్చించుకోవాలని సూచించారు. పరిష్కారం కోసం వ్యక్తిగతంగా కృషిచేసేందుకూ సిద్ధమని తెలిపారు. కాగా.. గత వారం పుతిన్ ఓ సమావేశంలో మాట్లాడుతూ.. ఉక్రెయిన్‌తో శాంతి చర్చలకు సిద్ధమని.. అయితే సంక్షోభ పరిష్కారంలో భారత్, బ్రెజిల్, చైనా మధ్యవర్తిత్వం నెరపాలన్నారు.



వినాయక నిమజ్జనం సందర్భంగా కర్నూలు జిల్లా కొండారెడ్డి బురుజు వద్ద వివిధ రూపాల్లోని గణపతుల ఊరేగింపు




తిరుమల ఆలయం ముందు జస్టిస్ కిరణ్మయి, జస్టిస్ మల్లికార్జునరావు

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

తిరుమల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మల్లికార్జునరావు, జస్టిస్ కిరణ్మయి ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకుని, రంగనాయకమండపానికి చేరుకున్న న్యాయమూర్తులను వేదపండితులు ఆశీర్వదించగా అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

మల్లన్న సేవలో జస్టిస్ గోపాలకృష్ణారావు



శ్రీశైలం, సెప్టెంబరు 15: శ్రీశైల మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్లను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు ఆదివారం దర్శించుకున్నారు. తొలుత రత్నగర్భ గణపతిని దర్శించుకుని అనంతరం మల్లికార్జున స్వామికి అభిషేకం నిర్వహించారు. తర్వాత భ్రమరాంబికాదేవిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో జస్టిస్ వి.గోపాలకృష్ణారావుకు వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు.



అంబులెన్స్‌లో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని ప్రశ్నిస్తున్న పోలీసులు

అంబులెన్స్‌లో గంజాయి రవాణా

- రూ.2 కోట్ల విలువైన 4 క్వింటాళ్ల సరుకు పట్టివేత
- టైర్ పంక్చర్ కావడంతో బయటపడ్డ గుట్టు

చుంచుపల్లి, సెప్టెంబరు 15: పోలీసులకు చిక్కకుండా గుట్టుగా గంజాయి రవాణా చేసేందుకు అక్రమార్కులు రకరకాల ఎత్తులు వేస్తున్నారు. ఇందులో భాగంగానే ప్రాణాపాయంలో ఉన్నవారిని ఆస్పత్రికి తరలించే అంబులెన్స్‌ను కూడా గంజాయి రవాణాకు వాడేశారు. అయితే, ఆ వాహన టైరు పంక్చర్ కావడంతో రూ.కోట్లు విలువ చేసే గంజాయి గుట్టురట్టయింది. అంబులెన్స్‌లో గంజాయి తరలిస్తున్న ఘటన కొత్తగూడెంలో వెలుగు చూసింది. ఓ అంబులెన్స్ టైర్ పంక్చర్ కావడంతో కొత్తగూడెంలోని రామవరం ప్రాంతంలో శనివారం అర్ధరాత్రి నిలిచిపోయింది. అంబులెన్స్ ఆగిపోవడంతో గమనించి సాయం చేసేందుకు ముందుకొచ్చిన స్థానిక యువకులు.. వాకబు చేయగా పరిస్థితి అనుమానాస్పదంగా కనిపించింది. దీంతో ఆ యువకులు ఇచ్చిన సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు అంబులెన్స్‌లోని వ్యక్తిని ప్రశ్నించారు. వాహనానికి తమిళనాడు రిజిస్ట్రేషన్ నెంబర్ ప్లేట్ ఉండడంతో ఎక్కడి నుంచి ఎక్కడి వెళుతున్నారని ? లోపల ఎవరున్నారని ? అడిగారు. సదరు వ్యక్తి తడబడడంతో అనుమానించి వాహనంలో తనిఖీ చేయగా... నాలుగు క్వింటాళ్ల గంజాయి దొరికింది. దీంతో నివ్వెరపోయిన పోలీసులు.. అంబులెన్స్, అందులోని వ్యక్తిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.రెండు కోట్ల వరకు ఉంటుందని సమాచారం. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

మేల్‌చాట్ వస్త్రం టికెట్ పేరుతో కుచ్చుటోపీ

- రూ.3 లక్షలు తీసుకుని మోసం చేసిన దళారీ

తిరుమల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి మేల్‌ఛాట్ వస్త్రం టికెట్ ఇస్తానంటూ ఓ దళారీ గుంటూరుకు చెందిన ఓ భక్తుడి నుంచి రూ.3 లక్షలు తీసుకుని మోసగించాడు. గుంటూరు పట్టాభిపురానికి చెందిన నల్లమోతు వేణుమాధవ్ తనకున్న పరిచయాల ద్వారా తిరుపతికి చెందిన మందారపు వంశీకృష్ణ అనే దళారీని ఫోన్ ద్వారా సంప్రదించాడు. తనకు ఏదైనా ఆర్జితసేవ టికెట్ కావాలని కోరగా ఎంతో విలువైన మేల్‌చాట్ వస్త్రం టికెట్ ఇప్పిస్తానని వంశీకృష్ణ నమ్మబలికాడు. అయితే దాదాపు రూ.6 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పినట్టు సమాచారం. ఈ క్రమంలో రూ.3 లక్షలు తీసుకుని ఆ తర్వాత స్పందించకపోవడంతో వేణుమాధవ్‌కు సందేహం వచ్చింది. గత నెల 26న టీటీడీ విజిలెన్స్ అధికారులకు జరిగిన మోసాన్ని వివరించాడు. దీంతో విజిలెన్స్ అధికారులు వివరాలు సేకరించి నివేదికను తిరుమల టూటౌన్ పోలీసులకు ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.40 లక్షల విలువైన బంగారం చోరీ

నరసాపురం, సెప్టెంబరు 15: పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మండలం తూర్పుతాళ్లు గ్రామ శివారులో ఆదివారం భారీ చోరీ వెలుగుచూసింది. శ్రీదుర్గా జ్యూయలరీ, తాకట్టు దుకాణంలో సుమారు రూ.40 లక్షలు విలువైన బంగారు ఆభరణాలను దొంగలు అపహరించారు. పోయిన బంగారంలో ఎక్కువ తాకట్టు పెట్టినవే ఉన్నాయి. దుకాణం వెనుక నుంచి నిచ్చెన ద్వారా పైకప్పునకు కన్నం వేసి లోనికి వచ్చిన దొంగలు సీసీ కెమెరాల్లో ఆధారాలు దొరకకుండా హార్డ్ డిస్క్ ఎత్తుకెళ్లారు. ఆదనపు ఎస్పీ భీమారావ్, డీఎస్పీ మురళీకృష్ణ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. జిల్లా కేంద్రం నుంచి డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీమ్‌లను రప్పించారు.

బై బై గణేశా!

కర్నూలులో వైభవంగా నిమజ్జనం

కర్నూలు (కల్చరల్), సెప్టెంబరు 15: కర్నూలు నగరంలో గణేశ్ నిమజ్జన వేడుకలు ఆదివారం కన్నుల పండువగా జరిగాయి. తొమ్మిది రోజులుగా పూజలు అందుకున్న గణనాథుని భారీ ఊరేగింపు నడుమ వినాయక ఘాట్ వరకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. నగరంలో రెండువేలకు పైగా విగ్రహాలను ప్రతిష్ఠించి నవరాత్రులు పూజలు చేశారు. చివరిగా ఆదివారం సాయంత్రం పాతనగరంలోని రాంభొట్ల దేవాలయం వద్ద విగ్రహాల ఊరేగింపు కార్యక్రమాన్ని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, కర్నూలు, నంద్యాల ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, పాణ్యం, కోడుమూరు, ఆదోని ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరి, పార్థసారథి, జేసీ బి.నవ్య, ఎస్పీ బిందుమాదవ్, నగర మేయర్ బీవై రామయ్య ప్రారంభించారు. నిమజ్జనం సందర్భంగా కేసీ కెనాల్ వద్ద గల వినాయక ఘాట్ వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. దారిపొడవునా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

గణేశ్ నిమజ్జనంలో అపశ్రుతి

- బాణాసంచా పేలి 30 మందికిపైగా గాయాలు
- పలువురి పరిస్థితి విషమం.. దెబ్బతిన్న రెండిళ్లు
- నెల్లూరు జిల్లా మనుబోలులో ఘటన





ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

మనుబోలు, సెప్టెంబరు 15: వినాయకుడి గ్రామోత్సవాన్ని చూసేందుకు జనం తండోపతండాలుగా తరలివచ్చారు. గణేశ్ మండపం వద్ద అందరూ ఆనందోత్సాహంతో ఉన్న తరుణంలో బాణ సంచా పేల్చడం ప్రారంభించారు. ఇలా పేల్చే క్రమంలో జరిగిన తప్పిదంతో ఒక్కసారిగా భీతావహ వాతావరణం నెలకొంది. దీంతో 30 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సంఘటన నెల్లూరు జిల్లా మండల కేంద్రమైన మనుబోలులోని బీసీ కాలనీలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు, కాలనీలో వరసిద్ధి వినాయక ఆలయం ఉంది. ఇక్కడ చవితి నాడు భారీ గణేశ్ విగ్రహాన్ని నెలకొల్పారు. నవరాత్రులు పూజలుచేసి గ్రామోత్సవానికి సిద్ధం చేశారు. గ్రామోత్సవం కోసం రూ.1.5లక్షల విలువైన టపాసులు తీసుకువచ్చి, ఆలయం పక్కనే ఉన్న ఇంట్లో డంప్ చేశారు. ప్రత్యేకంగా బాంబ్‌లు తీసుకురాగా వాటిని కాల్చేందుకు ఇంటిబయట ఖాళీస్థలంలో పెట్టారు. ఔట్‌లు కాలుస్తుండగా నిప్పురవ్వలు ఎగిరి బాంబ్‌లపై పడడంతో ఒక్కసారిగా పేలాయి. దీంతోపాటు ఇంట్లో డంప్ చేసి ఉన్న మిగతా టపాసులకూ మంటలు వ్యాపించడంతో అవి కూడా పేలాయి. భారీ శబ్దానికి జనం పరుగులు తీయగా, ఇంట్లో ఉన్న తారాజువ్వలు, అవుట్‌లు పక్కఇళ్లలోకి దూసుకెళ్లి పేలాయి. టపాసుల పేలుడు ధాటికి రెండు ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు 30మంది వరకు గాయపడ్డారు. గాయపడిన వారిలో ఎక్కువగా మహిళలు, చిన్నారులు ఉన్నారు. వీరిలో ఏడుగురిని 108లో తిరుపతి జిల్లా గూడూరుకు తరలించగా, మిగతావారు ప్రైవేట్ వాహనాల్లో నెల్లూరులోని ఆసుపత్రులకు వెళ్లారు.

పీహెచ్‌సీ వైద్యుల చలో విజయవాడ వాయిదా

- ఆరోగ్యశాఖ కమిషనర్ హామీ మేరకు నిర్ణయం

అమరావతి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశాఖ కమిషనర్ హామీ మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు చలో విజయవాడ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసుకున్నారు. ఆరోగ్యశాఖ మంత్రితో చర్చించిన తర్వాత వైద్యులకు అనుకూల నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ హరికిరణ్ ఇచ్చిన హామీ మేరకు కార్యక్రమాన్ని ఒక్క రోజు వాయిదా వేస్తున్నామని పీహెచ్‌సీల వైద్యులు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తమ సమస్యపై స్పందించి గతంలో మాదిరిగానే సర్వీస్ కోటా అమలు చేయాలని కోరారు.

భార్య మరణాన్ని జీర్ణించుకోలేక భర్త ఆత్మహత్య

- అనాథగా మారిన కుమార్తె

కూడేరు, సెప్టెంబరు, 15: భార్య మరణాన్ని జీర్ణించుకోలేక అనంతపురం జిల్లా కూడేరు మండలం గొట్కూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. కూడేరు పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన శంకరయ్యకు మండలంలోని కరుట్లపల్లి గ్రామానికి చెందిన ఈశ్వరమ్మతో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక్కగానొక్క కూతురు తన్మశ్రీ ఒకటో తరగతి చదువుతోంది. ఈశ్వరమ్మ అంగన్‌వాడీ కార్యకర్త కాగా, శంకరయ్య వ్యవసాయం చేస్తుండేవాడు. అనారోగ్య కారణాలతో ఈశ్వరమ్మ నాలుగు రోజుల క్రితం మృతి చెందింది. శంకరయ్య తీవ్రంగా కుంగిపోయాడు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. కాసేపటికి గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని, మృతదేహాన్ని అనంతపురానికి తరలించారు. తల్లిదండ్రుల మృతితో తన్మశ్రీ అనాథగా మారింది.

ఆరేళ్ల బాలికపై లైంగిక దాడి

- 54 ఏళ్ల వ్యక్తి అఘాయిత్యం, పోక్సో కేసు నమోదు

నల్లజర్ల, సెప్టెంబరు 15: ఆరేళ్ల బాలికపై ఓ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం సుభద్రపాలెం గ్రామానికి చెందిన ఉన్నమట్ల వెంకట నాగేశ్వరరావు(54) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి పూటుగా మద్యం తాగి వచ్చి తన ఇంటి సమీపంలో ఉండే ఓ ఇంట్లోకి ప్రవేశించి తల్లి పక్కనే నిద్రిస్తున్న బాలికపై లైంగిక దాడికి పాల్పడాడు. బాలిక తీవ్రంగా ప్రతిఘటించి తల్లిని అప్రమత్తం చేసింది. ఇద్దరు కలిసి ప్రతిఘటించడంతో అక్కడి నుంచి పారిపోయాడు. ఈ విషయమై బాధితులు గ్రామ పెద్దలకు తెలిపినా న్యాయం జరగకపోవడంతో శనివారం రాత్రి నల్లజర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాస్, ఎస్ఐ శ్రీహరి ఆదివారం ఉదయం గ్రామానికి వెళ్లి విచారించారు. అనంతరం నాగేశ్వరరావుపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ పేర్కొన్నారు.

పోలీసులకు పోస్టింగ్ కష్టాలు!

- 61 మంది డీఎస్పీలు, 36 మంది ఏఎస్పీలు, 24 మంది ఐపీఎస్‌లు వెయిటింగ్‌లోనే...
- సబ్ డివిజనల్ అధికారులకు తీవ్ర కొరత
- వడపోతలతో పోలీసు పెద్దలకు తలనొప్పి
- జగన్‌కు వత్తాసు పలికిన ఖాకీలకు అందలం
- పైరవీలతో పోస్టింగ్ సంపాదించిన కొందరు
- ఆరోపణలు లేకున్నా బుక్కైన మరికొందరు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



మాజీ సీఎం జగన్ సొంత జిల్లా కడపలో టీడీపీ మహిళా ఎమ్మెల్యేపై మాజీ ఉపముఖ్యమంత్రి అనుచరులు వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ రెండు వర్గాల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల నూజివీడులో రోడ్డుపైకి నీళ్లొచ్చి వాహనాలు చిక్కుకుంటే పరిస్థితిని చక్కదిద్దే పోలీసులే కరువయ్యారు. సబ్ డివిజనల్ అధికారి లేకపోవడమే దీనికి కారణం అంటున్నారు. రాష్ట్రంలో చాలా చోట్ల ఇలాంటి పరిస్థితి ఉన్నా డీజీపీ కళ్లముందే పదుల సంఖ్యలో డీఎస్పీలు పనిలేకుండా ఖాళీగా ఉండటం విశేషం.

రాష్ట్ర పోలీసు శాఖలో సబ్ డివిజనల్ అధికారుల కొరత ఏర్పడింది. డీజీపీ కార్యాలయంలో 61 మంది డీఎస్పీలు నిరీక్షణలో ఉన్నా పలు జిల్లాల్లో సబ్ డివిజనల్ అధికారి పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. గత ప్రభుత్వంలో వైసీపీ నేతల కంటే దారుణంగా వ్యవహరించిన పలువురు ఐపీఎస్‌లతో పాటు ఆరోపణలు ఎదుర్కొన్న కొందరు అధికారులు పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో హాజరు వేయించుకొంటున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఒక్క కానిస్టేబుల్ పోస్టు కూడా భర్తీ చేయకపోవడంతో పోలీసు సిబ్బంది సంఖ్య 50 వేలు మాత్రమే ఉంది. వీరితో పని చేయించే బాధ్యత సబ్ డివిజన్ స్థాయిలో డీఎస్పీలు, జిల్లా స్థాయిలో ఎస్పీలు, ఆపై సీనియర్ ఐపీఎస్‌లపై ఉంటుంది. వైసీపీ ప్రభుత్వ పాలనలో పోస్టింగ్స్ కోసం కొందరు.. ఒత్తిడితో మరికొందరు.. ఆ పార్టీ నేతల అన్యాయాలు, అక్రమాలకు వత్తాసు పలికారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రావడంతో గత ఐదేళ్లగా ఐపీసీని పక్కనపెట్టి వైసీపీ చట్టం అమలు చేసిన పోలీసులకు కష్టాలొచ్చాయి.

అప్పుడలా చేసినందుకే ..

టీడీపీ అధినేత చంద్రబాబును సొంత నియోజకవర్గంలోకి అనుమతించకుండా అడ్డుకున్న పోలీసు అధికారులు కొందరు.. మాజీ మంత్రి పెద్దిరెడ్డి సైన్యంలా పని చేసిన వారు ఇంకొందరు... పార్లమెంటు సభ్యుడిపై దేశద్రోహం కేసుపెట్టి థర్డ్ డిగ్రీ ప్రయోగించినవారు, యువగళం యాత్రకు అడుగడుగునా అడ్డంకులు సృష్టించినవారు, రాజధాని రైతులపై ఉక్కుపాదం మోపినవారు.. ఇలా వైసీపీ ప్రభుత్వంలో లెక్కలేనన్ని అక్రమాలకు వంతపాడిన పోలీసులు ఇప్పుడు మథనపడుతున్నారు. 'జగన్‌కు తిరుగుండదని భావించి తప్పు చేశాం.. వైసీపీ నాయకులు ఎన్ని తప్పులు చేసినా చోద్యం చూశాం. ప్రశ్నించిన గొంతుకల్ని బూటుకాలితో తొక్కేశాం.. ఇప్పుడు అనుభవిస్తున్నాం' అని నిర్వేదంతో వ్యాఖ్యానిస్తున్నారు. అయితే కొందరు పోలీసులు తాము గత ప్రభుత్వంలో అన్యాయానికి గురయ్యామని చెప్పుకొని, పైరవీలు చేసుకుని పోస్టింగ్ తెచ్చుకున్నారు. మరికొందరు అక్రమాలకు తావివ్వకపోయినా ఆరోపణలతో అడ్డంగా బుక్కయ్యారు. దీంతో పలు సబ్‌డివిజన్లలో డీఎస్పీలు లేక పోలీసు ఉన్నతాధికారులు ఇబ్బంది పడుతున్నారు. విభజన తర్వాత రాష్ట్రానికి 144మంది ఐపీఎస్ అధికారులను కేటాయించగా కేంద్ర సర్వీసుల్లో 15మంది వరకూ ఉన్నారు. అయితే ఆ సంఖ్య సరిపోదని, 175కు పెంచాలని ఇటీవలే చంద్రబాబు ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఈ పరిస్థితుల్లో కూడా ఏకంగా 24 మంది ఐపీఎస్‌లను ఖాళీగా కూర్చోబెట్టడం పోలీసువర్గాల్లో చర్చనీయాంశమైంది. వెయిటింగ్‌లో ఉన్న ఐపీఎస్‌లు, అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీల జాబితాను మరోమారు వడపోస్తే సగంమందికి పోస్టింగ్స్ ఇవ్వవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వేధించిన వారికి అందలం

- గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడిగా పనిచేసిన ప్రస్తుత వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును శ్రీకాకుళం జిల్లాలో అరెస్టు చేసి జైలుకు పంపిన డీఎస్పీ ప్రస్తుతం అమలాపురం లాంటి కీలక సబ్ డివిజన్ దక్కించుకున్నారు. అంతకుముందు అచ్చెన్నను అరెస్టు చేసినందుకు ప్రతిఫలంగా వైసీపీ ప్రభుత్వం ఆయన్ను రామచంద్రాపురం డీఎస్పీగా నియమించింది.
- టీడీపీ నాయకుడు, ప్రస్తుత స్పీకర్ అయ్యన్నపాత్రుడిని అరెస్టు చేసిన ఇద్దరు డీఎస్పీలు ఆయన దుస్తులు మార్చుకునే సమయంలో రహస్యంగా ఫొటో తీసి నాటి సీఎం జగన్‌కు పంపించారు. ఆయన్ను డ్రాయరుపై నిలబెట్టామని చెప్పుకొని మెప్పుపొందారు. తర్వాత వారిద్దరికీ కోరినచోట వైసీపీ ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. అదే అధికారులకు టీడీపీ ప్రభుత్వం ఇటీవల ఏఎస్పీలుగా పదోన్నతి కల్పించింది.
- ప్రకాశం జిల్లా దర్శిలో డీఎస్పీగా పనిచేసిన అధికారిని వంద మందిలో ఉన్నా జగన్ పేరు పెట్టి పిలిచి నేరుగా మాట్లాడేవారు. ఆయనకు సైతం పదోన్నతి కల్పించిన చంద్రబాబు ప్రభుత్వం ఏకంగా 11మంది వీరభక్త వైసీపీ ఖాకీలను అందలం ఎక్కించింది.
- మాజీ సీఎం పేషీలో కీలక ఐఏఎస్ అధికారి ధనుంజయ్‌రెడ్డి బంధువు, అనంతపురంలో వైసీపీ ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి గెలుపు కోసం ఏకపక్షంగా పనిచేసిన డీఎస్పీకి, వైసీపీ ప్రభుత్వంలో విజయనగరం, నర్సాపురం, నెల్లూరు వంటి కీలక సబ్ డివిజన్లు దక్కించుకున్న అధికారికి, గన్నవరంలో టీడీపీ కార్యాలయంపై దాడికి సహకారం అందించిన మరో డీఎస్పీకి ఏఎస్పీగా పదోన్నతి ఇవ్వడంతో పోలీసు శాఖ నిజంగా పనిచేస్తోందా? గందరగోళంలో ఉందా? అనే వ్యాఖ్యలు సహచర పోలీసుల్లోనే వినిపిస్తున్నాయి.

రాష్ట్రంలో 47 మంది డీఎస్పీల బదిలీ

22 సబ్ డివిజన్లకు కొత్త ఎస్‌డీపీవోలు

అమరావతి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 47 మంది డీఎస్పీలను పోలీసు శాఖ బదిలీ చేసింది. మొత్తం 22 సబ్ డివిజన్లతో పాటు ఏసీబీ, పీటీసీ, ఎస్‌బీ, రెడ్ శాండర్స్ లాంటి విభాగాల్లో పలువురు డీఎస్పీలను నియమించింది. కాశీబుగ్గ, చీపురుపల్లి, పాలకొండ, విశాఖ నార్త్, పెద్దాపురం, కొత్తపేట, తాడేపల్లిగూడెం, విజయవాడ నార్త్, సౌత్, వెస్ట్.. మైలవరం, ఈస్ట్ గుంటూరు, సత్తెనపల్లి, మార్కాపురం, కనిగిరి, కావలి, అనంతపురం రూరల్, చంద్రగిరి, రేణిగుంట, అనంతపురం, కదిరి, ఎమ్మిగనూరు సబ్ డివిజన్లకు లూప్‌లైన్లలో ఉన్న అధికారులను నియమించింది. దీంతోపాటు వెయిటింగ్‌లో ఉన్న 15మందికి పోస్టింగ్స్ ఇస్తూ తక్షణమే విధుల్లో చేరాలని డీజీపీ ద్వారకా తిరుమల రావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

వెంటాడి.. ట్రాక్టర్, డోజర్‌తో ఢీకొట్టి..

ప్రకాశంలో బుసలు కొట్టిన రాజకీయ కక్షలు



గాయపడిన గాజుల ఆదికేశవులు

- జనసేన నాయకుడి కుటుంబాన్ని హతమార్చేందుకు వైసీపీ నేత ప్రయత్నం
- దంపతులు సహా ఐదుగురికి గాయాలు
- గ్రామస్థులు రావడంతో నిందితులు పరార్




గాజుల ఏడుకొండలు, నారాయణమ్మ

పుల్లలచెరువు, సెప్టెంబరు 15: రాజకీయ కక్షల నేపథ్యంలో జనసేన పార్టీ నాయకుడి కుటుంబాన్ని హతమార్చేందుకు వైసీపీ నేతలు ప్రయత్నించారు. పొలానికి వెళ్తున్న వారిని వెంటాడి ట్రాక్టర్‌తోనూ, డోజర్ యంత్రంతోనూ ఢీకొట్టారు. అయితే సరిగ్గా స్థానికులు చూసి పరుగుపరుగున రావడంతో అక్కడి నుంచి నిందితులు పరారయ్యారు. ఈ దాడిలో జనసేన నేత ఏడుకొండలుతోపాటు ఆయన కుటుంబ సభ్యులు నలుగురికి గాయాలయ్యాయి. ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం మర్రివేములలో ఆదివారం ఈ దారుణం చోటుచేసుకుంది. ప్రాథమిక సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన గాజుల ఏడుకొండలు, గాజుల ఆదెయ్య బంధువులు. వారి వ్యవసాయ భూములు పక్కపక్కనే ఉన్నాయి. ఏడుకొండలు గ్రామంలో జనసేన పార్టీని బలోపేతం చేసి పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆదెయ్య వైసీపీలో క్రియాశీలకం ఉన్నారు. దీంతో కొంత కాలంగా వీరి మధ్య రాజకీయ కక్షలు నెలకొన్నాయి. ఏడుకొండలు తన వ్యవసాయ భూమికి ఆదెయ్య పొలంలో మీదుగా వెళ్లాలి. ఏడాది క్రితమే ఆదెయ్య ఆ భూమిని కొనుగోలు చేశాడు. అయితే ఉద్దేశపూర్వకంగా ఏడుకొండలుతో గొడవ పెట్టుకొనేందుకే ఈ భూమి కొనుగోలు చేశారన్న ఆరోపణలున్నాయి. ఏడుకొండలు, ఆయన కుటుంబం పొలానికి వెళ్లే క్రమంలో ఆదెయ్యతోపాటు ఆయన వర్గీయులు తరచూ గొడవ పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం మిరప నాటేందుకు తమ పొలానికి వెళ్తున్న ఏడుకొండలు కుటుంబాన్ని వైసీపీకి చెందిన ఆదెయ్య వర్గీయులు ట్రాక్టరు, డోజర్ యంత్రంతో ఢీకొట్టారు. వారు తప్పించుకునేందుకు ప్రయత్నించినా వాహనాలతో వెంబడించారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు అక్కడికి చేరుకోవడంతో వాహనాలకు అక్కడే వదిలి పారిపోయారు. ఆదెయ్య అన్న గాజుల రామయ్య డోజర్, ఆదెయ్య కుమారుడు గాజుల వెంకటేశ్వర్లు ట్రాక్టర్ నడిపి తమను తొక్కించి చంపేందుకు ప్రయత్నించారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనలో గాజుల ఏడుకొండలు గుండెల్లో బలంగా ఒత్తుకున్నాయి. ఆయన భార్య గాజుల నారాయణమ్మకు నడుము, కుమారుడు గాజుల ఆదికేశవులుకు కాలు విరిగింది. దీంతో వీరిని హుటాహుటిన వినుకొండ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మెరుగైన వైద్యం కోసం నారాయణమ్మను గుంటూరు వైద్యశాలకు తరలించారు. ఏడుకొండలు తండ్రి చెన్నయ్య బాబాయి సీతయ్యలకు గాయాలయ్యాయి. వీరు ఎర్రగొండపాలెంలోని వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. జనసేన మండలాధ్యక్షుడు కొటారి అచ్చెయ్య గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఎస్ఐ బత్తుల బాబూరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అయితే నిందితులను వెంటనే అదుపులోకి తీసుకోకపోవడంతో వారు పరారయ్యారు. బాధితుల వద్దకు సిబ్బందిని పంపి వివరాలు ఆరా తీస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రాడ్లు, కొడవళ్లతో వైసీపీ మూకల దాడి

- ముగ్గురు టీడీపీ నాయకులకు గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం.. పోలీసుల ప్రేక్షకపాత్ర
- అనంతపురం జిల్లాలో ఘటన



గాయపడిన లక్ష్మీనారాయణ

బత్తలపల్లి, సెప్టెంబరు 15: వైసీపీ మూకలు రెచ్చిపోయాయి. పోలీసుల ఎదుటే టీడీపీ నాయకులపై రాడ్లు, కొడవళ్లతో విచక్షణా రహితంగా దాడి చేశాయి. అనంతపురం జిల్లా బత్తలపల్లి మండలం వెంకటగారిపల్లిలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. వెంకటగారిపల్లికి చెందిన టీడీపీ నాయకుడు లక్ష్మీనారాయణ, వైసీపీ వర్గీయుడు శ్రీనివాసులుకు మధ్య పశువుల దొడ్డికి సంబంధించిన స్థల వివాదం ఉంది. ఈ నేపథ్యంలో మూడురోజుల క్రితం లక్ష్మీనారాయణ తన వ్యవసాయ బావి వద్దకు వెళ్తుండగా శ్రీనివాసులు దాడి చేశాడు. అదేరోజు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకెళ్లినా పట్టించుకోలేదని బాధితులు వాపోయారు. ఈ నేపథ్యంలో ఆదివారం లక్ష్మీనారాయణ స్థలంలో శుభ్రం చేసేందుకు ఎక్స్‌కవేటర్‌ను తెప్పించాడు. శ్రీనివాసులు, అతని తమ్ముడు, వైద్యశాఖ ఉద్యోగి అయిన హరి, వెంకటరాముడు, అప్పస్వామి..మరికొందరు రాడ్లు, కొడవళ్లతో అక్కడికి చేరుకున్నారు. పోలీసులకు సమాచారం అందడంతో ముగ్గురు కానిస్టేబుళ్లు కూడా వచ్చారు. అయినా లక్ష్మీనారాయణపై వైసీపీ నాయకులు విచక్షణా రహితంగా దాడి చేశారు. అడ్డుగా వెళ్లిన అతడి కుమారుడు అభిలాష్, సుధాకర్‌పైనా దాడి చేశారు. దీంతో వారు కూడా గాయపడ్డారు. వారిని బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. వీరిలో లక్ష్మీనారాయణ పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. పోలీసుల నిర్లక్ష్యం వల్లే దాడి జరిగిందని టీడీపీ నాయకులు ఆరోపించారు.

అప్పలరాజు నోరు అదుపులో పెట్టుకోవాలి: మంతెన

అమరావతి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పలాస ప్రజలు ఛీ కొట్టినా మాజీ మంత్రి అప్పలరాజుకు బుద్ధి రాలేదని టీడీపీ మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణరాజు మండిపడ్డారు. మెడికల్ కాలేజీ సీట్లు తగ్గిస్తున్నారంటూ అప్పలరాజు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "అప్పలరాజు ఆరోగ్య పరిస్థితి సరిలేక మెడికల్ సీట్లు గురించి తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మంత్రిగా వెలగబెట్టిన అప్పలరాజుకు రాష్ట్రంలో ఎమ్మెల్సీ సీట్ల సంఖ్య ఎంతో తెలీదు. ఆయన మెడికల్ సీట్ల గురించి మాట్లాడటం హాస్యాస్పదం. అప్పలరాజు నోరు తగ్గించుకోకుంటే తిప్పలు తప్పవు" అని ఆదివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. జగన్‌కు ప్రచార ఆర్భాటం తప్ప.. ఐదేళ్లలో ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు.

మరణించిన అధికారికి ప్రధాని పర్యటనలో విధులు!

- ఒడిశాలో విచిత్రం

భువనేశ్వర్, సెప్టెంబరు 15: ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం ఒడిశాలో చేపట్టనున్న పర్యటనను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్లలో పొరపాటు దొర్లింది. ఏడాది క్రితం మరణించిన ఒడిశా అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఓఏఎస్) అధికారికి జనాల సమీకరణ బాధ్యతలను అప్పగించింది. దీనిపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు రావడంతో ఉన్నతాధికారులు ఆ పేరును తొలగించారు. మహిళల బ్యాంకు ఖాతాలకు ప్రతి నెలా నగదు బదిలీ చేసే సుభద్ర యోజన కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ప్రధాని మోదీ రానున్నారు. ఇందుకోసం భువనేశ్వర్‌లోని జనతా మైదాన్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జనాలను సమీకరించి, నిర్వహించే బాధ్యతలను 50 మంది సీనియర్ ఓఏఎస్ అధికారులకు అప్పగిస్తూ శుక్రవారం సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ జాబితాలో ఒడిశా కంప్యూటర్ అప్లికేషన్ సెంటర్ (ఓసీఏసీ) అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రభోద కుమార్ రౌత్ పేరు కూడా ఉంది. నిజానికి ఆయన గత ఏడాది జులైలో మరణించారు. దీనిపై విమర్శలు రావడంతో తగిన సవరణలు చేశారు. మరో అధికారికి బాధ్యతలు అప్పగించామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తెలిపారు.

గురుకులాలకు పౌరసరఫరాల సేవలు

- నిత్యావసర వస్తువుల సరఫరాకు ఏర్పాట్లు
- సంక్షేమ హాస్టళ్లకు కూడా పంపిణీ
- రాష్ట్రవ్యాప్తంగా సరుకుల సేకరణకు టెండర్లు
- జిల్లా నుంచి రాష్ట్రస్థాయి టెండర్లకు మార్పు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ గురుకులాలు, హాస్టళ్లకు నిత్యావసర సరుకులు సరఫరా చేసేందుకుగాను పౌరసరఫరాల శాఖ సేవలు వినియోగించుకునేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఇప్పటి వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ వసతి గృహాలు, హాస్టళ్లకు ప్రొవిజన్స్ సరఫరా స్థానికంగా టెండర్లు పిలవడం ద్వారా చేపట్టేవారు. జిల్లాస్థాయిలో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన కొనుగోలు కమిటీ ఈ టెండర్లు నిర్వహించేది. దీంతో అవసరమైన వస్తువులను హాస్టళ్లు, గురుకులాలు ఎప్పటికప్పుడు స్థానికంగా సమకూర్చుకునేవి. ఏడాదికోసారి టెండర్లు నిర్వహించి సంవత్సరమంతా అదే రేట్లతో సరఫరా చేసేవారు. ప్రభుత్వం ఇప్పుడు టెండర్ల ప్రక్రియలో మార్పులు చేసింది. పౌరసరఫరాల శాఖ ద్వారా రాష్ట్రస్థాయి టెండర్లు పిలిచి ప్రధానమైన ప్రొవిజన్లను సేకరించనుంది. వాటిని పౌరసరఫరాల శాఖ ఎంఎల్ పాయింట్ల ద్వారా గురుకులాలు, హాస్టళ్లకు సరఫరా చేయనుంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రొవిజన్ సరఫరాదారులు ఎక్కువ మంది లేకుండా కార్పొరేట్ స్థాయిలో టెండర్లు ప్రక్రియ చేపట్టారు.

ప్రభుత్వంపై ఆర్థిక భారం: సరఫరాదారులు

పౌరసరఫరాల శాఖ ద్వారా నిత్యావసర సరుకులు సేకరించి సంక్షేమ గురుకులాలకు, హాస్టళ్లకు సరఫరా చేయడం ద్వారా ప్రభుత్వానికి ఆర్థిక భారం పెరుగుతుందని సరఫరాదారులు అంటున్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. పౌరసరఫరాల శాఖ భారీ రేట్లతో సరుకులను సేకరిస్తోందని.. మార్కెట్ రేటుకు, పౌరసరఫరాల శాఖ ఇచ్చే రేట్లకు భారీ వ్యత్యాసముందని చెప్తున్నారు. గతంలో తాము సరుకులు సరఫరా చేసేటప్పుడు 10 శాతం తేడాతో వస్తువులు సరఫరా చేసేవారమని, ఇప్పుడు పౌరసరఫరాల శాఖ ద్వారా 20-30 శాతం వ్యత్యాసముందని పేర్కొంటున్నారు. కార్పొరేట్ సరఫరాదారులకు ప్రయోజనం కలిగించేలా ఈ సేకరణ జరుగుతోందని, ప్రభుత్వం ఈ టెండర్ల ప్రక్రియపై పునరాలోచించాలని కోరుతున్నారు. అంతేకాకుండా సంక్షేమ గురుకులాలు, హాస్టళ్ల సిబ్బంది ఎంఎల్ పాయింట్ల నుంచి సరుకులు తెచ్చుకోవడం కష్టమవుతుందంటున్నారు. ఒక్క బియ్యం సరఫరా విషయంలోనే పౌరసరఫరాల శాఖ విఫలమై, పిల్లలకు సరైన బియ్యం అందించలేకపోతోందని, ఇప్పుడు నిత్యావసర సరుకులు కూడా ఆ శాఖ సరఫరా చేస్తే ఏ మేరకు నాణ్యమైన వస్తువులు సరఫరా చేస్తుందోనంటూ పలువురు ప్రిన్సిపాళ్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నాణ్యమైన వస్తువులు సరఫరా చేస్తే అదే చాలని, ఎవరు సరఫరా చేసినా తమకు కావాల్సింది నాణ్యమైన సరుకులేనని అంటున్నారు.

రేపటి నుంచి 'సేవా పక్వాడా'

అమరావతి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాన సేవకుడి జన్మదినోత్సవం సందర్భంగా ఈ నెల 17 నుంచి అక్టోబరు 2వరకు పక్షం రోజుల పాటు రాష్ట్రంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఏపీ బీజేపీ మీడియా ఇన్‌చార్జి పాతూరి నాగభూషణం తెలిపారు. బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి నేతృత్వంలో 17, 18, 19న రాష్ట్ర వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. సెప్టెంబరు 23న వృద్ధ మహిళలకు ఉచిత ఆరోగ్య శిబిరాలు.. ఆ తర్వాత ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల్లో 24వరకూ పరిశుభ్రత కార్యక్రమం ఉంటుందన్నారు. సెప్టెంబరు 25న పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ జయంతిని పురస్కరించుకుని పార్టీ బలోపేతానికి సభ్యత్వాలు పోలింగ్ బూత్ స్థాయిలో ఉంటాయన్నారు. చివరిగా అక్టోబరు 2న జాతీయ నేతల విగ్రహాలు, దేవాలయాలు, పార్కులు, బహిరంగ ప్రదేశాల్లో స్వచ్ఛతా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని నాగభూషణం వివరించారు.

సోమవారం 16 సెప్టెంబరు 2024


వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

నవలా శిల్పం



తనను తాను 'ఈ నేలకు ఆస్థాన లేఖకుడి'నని ప్రకటించుకున్న రాయలసీమ నవలాకారుడు సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి. ఆ మాటలో లేశమాత్రమైనా అతిశయం లేదు. వారి రచనలన్నీ ఆ పుత్తడి పుడమి చుట్టే తిరుగుతాయి. సగటు మనిషి జీవితాన్ని పట్టిచూపినట్టుగా వారి రచనలు ఉంటాయి. 'తానా' బహుమతి పొందిన 'కొండ పొలం' వంటి నవల రాయడం వేరొకరికి దుస్సాధ్యం. గొల్ల కాపర్లలో ఒక కాపరిగా, మూగజీవాల మనసు చదివే పెద్దకాపరిగా మారిన తరువాతనే అలాంటి మేలైన రచనను ఆయన చేయగలిగారు. తొమ్మిది నవలలు రాసిన సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డితో 'నవలా శిల్పం' శీర్షక కోసం జరిపిన సంభాషణ ఇది.

"నవల వందల ఎకరాల వ్యవసాయ క్షేత్రం లాంటిది"

- సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి

ఒక ఇతివృత్తం గాని, ఐడియా గానీ స్ఫురించినప్పుడు 'ఇది కథ కాదు నవలే అవుతుంది' అని మీరు ఎలా గుర్తు పడతారు?

నేను వ్యవసాయ కుటుంబంలో పుట్టినవాడిని. ఇప్పటికీ రైతుల, రైతు కూలీల మధ్యన బతుకుతూ ఉన్నవాడిని. ఓవైపు రైతుగా విత్తనాల్ని, మరోవైపు రచయితగా అక్షరాల్ని విత్తి పంటలు పండించే సృజనకారుడిని. విత్తనాలు చేతిలోకి తీసుకోగానే అర్థమైపోతుంది– అవి దీర్ఘకాలిక పంటకు సంబంధించినవా, స్వల్పకాలిక పంటకు సంబంధించినవా? అని. ఎదురైన సంఘటన విస్తృతిని బట్టి మనస్సులో ఇంకేటప్పుడే అది కథగానో నవలగానో దాని రూపానికి సంబంధించిన సంకేతాలు ఇస్తుంది.

కవిత, కథ, నవల... మీరు ఈ మూడు ప్రక్రియల్లోనూ రాస్తారు. ఆయా ప్రక్రియల్ని మీరు అప్రోచ్ అయ్యే తీరు ఏ రకంగా భిన్నంగా ఉంటుంది?

ఇన్నేళ్ల సాహిత్య జీవితంలో భిన్న ప్రక్రియలుగా పరిచయమైన సాహిత్యం ఇప్పుడు ఒకే రూపంతో వచ్చి పక్కన కూచుంటోంది. ఏ ప్రక్రియ అయినా చేతుల్లో ఒదుగుతోంది. నాకిప్పటికీ కవిత రాయడమంటే ఇష్టం. కష్టం కూడా. నాకు కవిత ఫ్రేములో బిగించినట్టుండాలి. ఒక పదం ఎక్కువా ఉండకూడదు, తక్కువా ఉండకూడదు. వాక్యం అదిమిపెట్టిన స్ప్రింగ్‌లా ఉండాలి. ఎదురుగా నిలుచుంటే అందులో నేను కనిపించాలి. నేనే కాదు జన సమూహమంతా నిలుచున్నా కనిపించగలగాలి. అంత ఖచ్చితమైన కొలతలు ఉన్నాయి కాబట్టి నేను ఇప్పటిదాకా వందకు మించి కవితలు రాయలేదు. కథకు కూడా హద్దులు ఉన్నాయి. నాలుగు గట్ల మధ్య మడికయ్యలో నాటిన పైరు లాంటిది కథ. దానికి గెట్ల హద్దులుంటాయి. నేలను వృథా కానీని పొదుపరితనం ఉంటుంది. కథ రాయటం కవితంత కష్టం కాదు. కొంత వెసులుబాటు ఉంటుంది.

నవల వందల ఎకరాల వ్యవసాయ క్షేత్రం లాంటిది. ఉద్యానవనాల సాగు లాంటిది. మొక్కల మధ్యన చాళ్ళ వెంట వాహనాల్లో విహరించవచ్చు. తెలిసిన జీవితాల గురించిన నవల రాయటం నాకు కొంత సులభంగా ఉంటుంది. వయస్సుపెరిగేకొద్దీ అనుభవాలు తోడయ్యేకొద్దీ నవల రాయడాన్నే ఎక్కువ ఎంజాయ్ చేస్తాం.

నవలలో భిన్న పాత్రల స్వభావాలను చిత్రించేటప్పుడు మీరు ఎలాంటి ఘర్షణను ఎదుర్కొంటారు? ముఖ్యంగా పురుష రచయితగా స్త్రీ పాత్రల స్వభావాలు చిత్రించటంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారు?

నవలలోని పాత్రలు మనం తయారు చేసినట్టు ఉండకూడదు. జనాల్లోంచి పేజీల మీదకు నడిచి వచ్చినట్లు ఉండాలి. చదివే పాఠకుడు అలాంటి నమూనాను తనలోనో, తన చుట్టుపట్లనో పోల్చుకోగలగాలి. ఆ పాత్ర సాధారణ పాఠకుడిలో అంతర్గతంగా చైతన్యాన్ని ప్రేరేపించేదిగా ఉండాలి. రోజూ వెళుతోన్న దారిలో పాఠకుడు ఏ కారణం వల్లనో తను చూడలేని, ఏ భయం వల్లనో చూసేందుకు ఇష్టపడని, సహాయం చేయవలసి వస్తుందనే ఏ పిరికితనం వల్లనో చూడబుద్ధిగాని దృశ్యాల్ని ఆ పాత్ర చూపించగలగాలి. అలాంటి పాత్రను సృష్టించినపుడు నేను కూడా పాఠకుడిగా మారిపోయి సదరు సంఘటన చదివినప్పుడు నాకు కూడా ఆ సమస్య ఎదురవుతుంది. ఆ చూడలేని తనం, ఆ పిరికితనం, ఆ భయం నాలో కూడా ఉన్నట్లు అర్థమవుతుంది. నన్ను నేను ప్రక్షాళన చేసుకుంటే గాని ముందుకు సాగలేని పరిస్థితి కలుగుతుంది.

నేను ఎన్నుకొన్న అలాంటి పాత్రలవల్ల రచయితగా చాలా సంఘర్షణకు గురయ్యాను. స్త్రీలు, దళితులు, బహుజనులు, కులాలు, మతాల విషయంలో నా రక్తంలో ఇంకివున్న పాత వాసనల నెన్నింటినో నా సాహిత్యం వేలెత్తి చూపించింది. స్త్రీల విషయంలో తరతరాలుగా అనువంశికంగా వెంట వస్తోన్న మగ అహంకారపు అవలక్షణాలు నాలోనూ ఉన్నాయి. వాటి ఉనికిని గురించిన స్పృహ సాహిత్యమే నాకు ఇచ్చింది. నన్ను నేను సంస్కరించుకునే క్రమంలోనే నా చుట్టూ ఉన్న సమాజంలోని మహిళలకు సంబంధించిన ఎన్నో సంఘటనలు అర్థమయి, అవి కథలుగా, నవలల్లోని సంఘటనలుగా రూపొందాయి. అలాగే దళితులు బడుగు బలహీన వర్గాల గురించిన కథలు కూడా.

నవల మనసులో రూపుదిద్దుకునే, రాసే ప్రక్రియ గురించి చెప్పండి? నవల పూర్తి కావటానికి ఎంత కాలం పడుతుంది? రివైజ్ చేసే ప్రక్రియ ఎలా జరుగుతుంది?

నాకైతే నవల రాయడం అనేది ఒక దీర్ఘకాలపు వ్యూహం. అప్పటికప్పుడు ఏదో ఒక విషయాన్ని ఊహించుకొని, కాగితాలు ముందేసుకొని రాయటం మొదలుపెట్టిన పరిస్థితి అయితే ఎప్పుడూ లేదు. చాలాకాలంగా రకరకాల విషయాలు మనసులో రగులుతూ ఉంటాయి. వాటికి సంబంధించిన అనేక సంఘటనలు ఎదురవుతూ ఉంటాయి. అవన్నీ నాలో జ్ఞాపకాలుగా మారిపోతుంటాయి. మనస్సులో నవలకు సంబంధించిన స్వరూపం ఒకటి రూపుదిద్దుకుంటూ ఉంటుంది. అప్పటికీ రాసేందుకు సిద్ధపడను. ప్రారంభమూ, కథా పరిణామమూ, ముగింపుకు సంబంధించిన దృశ్యము మెదడులో ఖాయమైన తర్వాత దానికి అవసరమయ్యే సంఘటనల్ని జ్ఞాపకాల్లోంచి ఏరుకొని నోట్స్ రాసుకొంటాను. ఎప్పుడూ జనాల్లో ఉంటాను కాబట్టి వాళ్ళ జ్ఞాపకాల తేనె తుట్టెలను కూడా కదిలిస్తాను. ఏ చిన్న విషయం దొరికినా దాచుకొంటాను. తర్వాత నవల రాయడానికి కూచుంటాను. నవలకు సంబంధించిన కాలంలోకి, వ్యక్తుల సమూహంలోకి, వాళ్ళ మాండలికాల్లోకి, వాళ్ళ జీవన విధానంలోకి వెళ్లిపోయినప్పుడు బయట ప్రపంచంతో చాలావరకు సంబంధాలు తెంచుకొంటాను. రచనా ప్రపంచంలోనే బతుకుతాను. నిద్రాహార సమయపాలన కూడా గతి తప్పుతుంది. నవల పూర్తయ్యేసరికి మోచేయి లేదా వెన్నెముకనొప్పిని మొదటి పురస్కారంగా అందుకొంటాను. ఈ పనంతా వేసవి సెలవుల్లో పూర్తి చేస్తాను.

ఇంతా చేసి ఇదొక ముడి సరుకు మాత్రమే. ఇప్పుడు నేను పాఠకుడిగా రెండవ రూపంలోకి మారతాను. రచయితగా భావోద్వేగానికి గురై చూపించిన దశ్యాన్ని పాఠకుడిగా అదే స్థాయిలో అనుభూతిస్తున్నానో లేదో పరీక్షించుకొంటాను. నేను తృప్తిపడేదాకా అనవసరతను కత్తిరించుకొంటూ, అవసరాన్ని చేర్చుకొంటూ, రెండవసారి రాస్తాను. అప్పటికీ తృప్తి పడకుంటే, మూడోసారి రాసేందుకు కూడా వెనకాడను. రాసేందుకు సిద్ధం కావడానికి ఏళ్ళు పడుతుంది. రాయడం మొదలు పెట్టిన తర్వాత కొన్ని రోజుల్లోనే పూర్తవుతుంది. నాకు టైప్ చేయడం రాదు. ఇప్పటికీ చేత్తోనే రాస్తుంటాను.

'కొండపొలం' వంటి పరిశోధనాత్మక నవల రాయడంలో మీకు ఎదురైన సవాళ్ళేమిటి?

నాది కాని జీవితం కొండపొలం. గొర్ల కాపర్ల తోటి నాకు జీవితకాలపు పరిచయం వుండొచ్చు. కష్టాలు పంచుకొనేంత దగ్గరితనం వుండొచ్చు. వాళ్ళు వాటితో మాట్లాడే భాష గురించి, చేసే ప్రయాణం గురించి, కలిసి జీవించే సాన్నిహిత్యం గురించి, గొర్లను పోషించేందుకు ఎదుర్కొనే కష్టాల గురించి సంపూర్ణ అవగాహన వుండొచ్చు. కానీ అవన్నీ 'గొర్లకాపరుల' గురించి మంచి వ్యాసం రాసుకోవడానికి పనికొస్తాయి. వాళ్లను పాత్రను చేసి నవల రాయాలంటే గొల్లవాడిగా మారితే తప్ప కుదరదు. నవల రాసే సమయంలో నేను అనుభవించిన మానసిక వేదనంతా గొర్లకాపరిగా మార్పు చెందేటందుకు పడిన యాతనే.

గొర్రెల మంద వెనక బొట్టెకట్టె భుజాల మీద పెట్టుకొని నడుస్తూ వుంటే వాటి కాళ్ల కింద లేచిన దుమ్మును పీల్చుకొని ఊపిరితిత్తులు లబలబలాడ్డం, చీదిన చీమిడి రాల్చిన పెంటికల మదపు వాసనకు ముక్కుపుటాలు కుంచించుక పోవడం, దుమ్ము తెరలు కళ్లనిండా చేరి పుసులు కట్టడం, తక్కువ నీళ్ళతో శరీరం అలవాటు పడక రాత్రిళ్ళు మూత్రం చుక్కలు చుక్కలుగా మండుతూ కారటం, ఈ వెతలన్నీ అనుభవించే గొర్ల కాపరిగా మారితే గాని నవల ముందుకు సాగలేదు. నలభై కిలోమీటర్ల పరిధిలోని కొండలన్నీ తిరిగాను. నీళ్ళ తావులు చూశాను. రాత్రుళ్ళు మంటలు తగిలించి పక్కన పడుకొని భయం భయంగా నిద్ర పోలం చేశాను. మైళ్ళకొద్దీ దూరాన్ని ఏకబిగిన ఎక్కుతూ దిగుతూ ప్రయాణించాను. నల్లమల అడవులతో, గొర్ల కాపరులతో నాకు ప్రత్యక్ష అనుభవాలు లేకుంటే ఆ నవల రాయగలిగి ఉండేవాన్ని కాదు.

కొత్త రచయితలు నవలా రచనను చేపట్టాలంటే... మీరిచ్చే సూచనలు సలహాలేమిటి?

బాగా రాయాలనుకున్న వాళ్లు బాగా చదవాలి. చదవటం అనేది ఒక తీరని దప్పికగా మారాలి. ఒకప్పుడు చదవాలనుకొన్నా పుస్తకాలు దొరికేటివి కాదు. ఇప్పుడు అరుదైన పుస్తకాలు కూడా సులభంగా దొరుకుతున్నాయి. కానీ తీరిక సమయాన్ని చదవడానికి కేటాయించే వాళ్ళు తక్కువయ్యారు.

తొలకరింపుల్లో మా వూరి రైతులు కొందరు కృష్ణాజిల్లాలోని కంచికచెర్ల, కోదాడ సంతలకు పోతారు. వారం పదిరోజులు పల్లెలన్నీ తిరిగి ఎద్దుల్ని బేరంజేసి తెచ్చుకొంటారు. ఆ ప్రయాణాన్ని గురించి చిన్న విషయాన్ని కూడా వదలకుండా వాళ్ళు యేడాది పొడవునా చెబుతూనే వుంటారు. మనం బస్సెక్కి ఢిల్లీకి వెళ్ళి వచ్చినా మన పక్క సీట్లో కూచున్న వాన్ని పలకరించము. రచనలు చేసే వాళ్ళెపుడూ రైతుల్లాగా వుండాలి. మన చుట్టూ వున్న జీవజాలంతోటి సత్సంబంధాలే సాహిత్య సృజనకు ప్రధాన వనరు.

ఇంటర్వ్యూ ■ కమల్



కొండవీరుల చిందు

ఈ రోజు పొలంలో కొన్ని పక్షులు వాలాయి
నల్లమల చివరి దాపులో ఉండే మా ఊళ్లలో
ఏనాడూ అవి కనిపించింది లేదు
వాటినే చూస్తున్న నన్ను
పారతో కాలవ చెక్కుతున్న మా నాన్న
"పెందలాడే పని అయిపుచ్చుకొని పోవా" అన్నాడు.

వాటి రెక్కల మీద మబ్బులు తేలుతూ ఉన్నాయి.
మా నాన్న మాటలు వినకుండా వాటివైపు వెళ్ళాను
"ఎక్కణ్ణుంచి వస్తున్నారని" ఆరా తీశాను.

ఎవరో తమ గూళ్ళలో కత్తులూ, తుపాకులూ ఉంచారని
అవి వాటిని వేటాడుతున్నాయని చెప్పాయి.
ఆ చోటుని వదిలి కొండలు వెతుకుతూ ఇక్కడికొచ్చామన్నాయి
కానీ కొద్దిమందే మిగాలాయంటా.

"మీ గూళ్లలో ఎవరు వాటిని ఉంచారు?"

"మేం ఆ కొండలు పుట్టినప్పుడు పుట్టాం
ఆ కొండలు పెరుగుతుంటే వాటితోపాటూ
ఆటలాడుతూ పెరిగాం.
ఆ మధ్య తట్టున కొండల్లోనే మా నివాసం ఉండేది.
మా చోటుని ఎవరో ఆక్రమించుకుంటుంటే
కాపలాగా మా రెక్కలపై ఈ మబ్బులు వచ్చాయి.

ఈ మబ్బులను తొలగించాలని
ప్రభుత్వం అనేవాళ్ళు వెంటాడారు.
మా పూర్వీకమైన కొండలు
చెల్లాచెదురు దేహాలుగా విరిగిపోయాయి.
మేమంతా వాటికోసం ఏడ్చాం.
కొన్ని నెలలపాటు మేం అలుపులేకుండా
ఎగురుతూ ఏడుస్తూ ఉంటే
మాపై కత్తులూ, తుపాకులూ వచ్చి పడి
చాలా మందిమి చనిపోయాం.

అయినా మా కన్నీళ్లు కొండల్ని బతికిస్తాయని నమ్మాం.
మిగిలిన కొద్దిమందిమి వేరైపోయాం
ఎప్పటికైనా అవి బతికి చిగురేస్తే అక్కడికి వెళ్తాం."

అవి కన్నీళ్లు కారుస్తుంటే,
మా ఊరి చుట్టూ ఉన్న కొండలు రోదించాయి.
"మేం మీతోపాటు ఆ అడవుల్లోకి వస్తాం" అన్నాయి.

కొండలన్నీ ఏకమైనట్టు చుట్టూ మబ్బులు కమ్ముకున్నాయి.
ఆ పక్షులు అందులో తడుస్తూ
"కొండల్ని మింగేవాడి కోరపళ్ళు లాగుతాం
అడవుల్ని నలిపేవాడి చేతుల్ని పెరుకుతాం
మా పూర్వీకుల కొండలపై మళ్లీ మా గూళ్ళను కట్టుతాం
మా కన్నీళ్లు చిగురిస్తాయి
మా కన్నీళ్లు రాళ్లవుతాయి
మా కన్నీళ్లు అడివవుతుంది
తుపాకులనూ, కత్తులనూ మా కొండలు నుజ్జుచేస్తాయి
మేం అడివి లేత ఆకుల మీద వాలి
ఈ పాటలు వినిపిస్తాం
సెలయేరుల మీద ఎగిరి ఈ పాటలను వల్లిస్తాం
మా కన్నీళ్లు చిగురిస్తాయి
మా అడవులు కొండల్ని కంటాయి" అని పాడుతుంటే
మా కొండలన్నీ మెరుపుల్నీ ఉరుముల్నీ
బల్లెములుగా, ఈటెలుగా పట్టుకొని చిందాడాయి.

"వాన పడుతుంది. పోదాం"
అని మా నాన్న ఇంటికి తీసుకొచ్చాక కూడా
రాత్రంతా ఆ పాట వినిపిస్తూనే ఉంది
కొండలు చిందాడుతూనే ఉన్నాయి.

■ గూండ్ల వెంకట నారాయణ
70325 53063

తాటికొండాల సాహిత్య పురస్కారాలు

కథా రచయత, నాటక ప్రయోక్త, పరిశోధకుడు, నంది అవార్డు గ్రహీత తాటికొండాల నరసింహారావు సతీమణి తాటికొండాల భ్రమరాంబ సాహిత్య పురస్కారాల సభ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సెప్టెంబర్ 21 సాయంత్రం 6 గంటలకు దొడ్డి కొమరయ్య హాలు, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్‌లో జరుగుతుంది. 2023కి గాను ఎన్. గోపి, 2024కి గాను ప్రసేన్ పురస్కారాలను స్వీకరిస్తారు. సభలో నందిని సిధారెడ్డి, ఏనుగు నరసింహారెడ్డి, గౌరీశంకర్, సీతారాం, యాకూబ్, ఆనందా చారి, ఎస్. రఘు ప్రసంగిస్తారు. వివరాలకు: 95734 27422

వంశీకృష్ణ

ఉపాధ్యాయులతో జ్ఞాపకాలు

సంగీత సాహిత్య నృత్య నాటక సంస్థ 'సంస్కృతి' (గుంటూరు) ఉపాధ్యాయులపై ఒక ప్రత్యేక సంచికను ప్రచురించబోతున్నది. మీ ఉపాధ్యాయుల గొప్పతనాన్ని, మానవీయ కోణాన్ని తెలియచేసే సంఘటనలు, మీకు వారితో ఉన్న అనుబంధం గురించి రాసి 9440320580 నంబర్‌కి వాట్సాప్ ద్వారా పంపితే, ప్రచురణార్హత ఉన్న వాటిని పుస్తక రూపంలో తెస్తాం.

యస్. బాలచందర్

కాళోజీ పురస్కారం

తెలంగాణ మహిళా సాహిత్య, సాంస్కృతిక సంస్థ ప్రతి ఏటా అందించే కాళోజీ పురస్కారానికి రాయారావు సూర్యప్రకాశ్ రావు ఎంపికయ్యారు. మహబూబ్ నగర్ లోని భారత్ స్కౌట్స్ భవనంలో సెప్టెంబర్ 22న జరిగే సభలో ఆయన ఈ పురస్కారాన్ని స్వీకరిస్తారు.

రావూరి వనజ

నా మొదటి పుస్తకం

ఆనాటి 'మండుతున్న తరా'నికి అంకితమిచ్చాను!

– నిఖిలేశ్వర్



వ్యక్తిగతంగా నా మొదటి కవితా సంపుటి 'మండుతున్న తరం' 1972 అక్టోబర్‌లో వెలువడింది. అంతకు పూర్వమే 1965–68 మధ్య 'దిగంబరకవులు' మూడు సంకలనాల్లోని ఆరుగురు కవులలో ఒకడిగా నా కవితలున్నాయి. వాటిని మినహాయించి, నేను 1969–1972లో రాసిన కవితల్లోంచి ఏరి 24 కవితలను 'మండుతున్న తరం'లో చేర్చాను. ఈ కవితలన్నీ వివిధ పత్రికల్లో ఆ కాలంలో వెలుగు చూసినవే!

అసలు 1960 నుంచి 1965 వరకు కె. యాదవరెడ్డిగా రాసిన కవితలన్నీ ఒక సంపుటిగా ఆనాడే రావలసింది. వచన కవితోద్యమ రోజులవి. స్వంత ఖర్చుతో ఎవరికి వారు పుస్తకం వేసుకోవలసిందే తప్ప పబ్లిషర్స్ లేరు. నేను ఆర్థికంగా వెలుసుబాటు లేనందువల్ల, వడ్డీకి అప్పు చేసి పుస్తకం అచ్చు వేయించాలనే ధైర్యం లేక ప్రచురించలేదు. 1970లో విరసం ఆవిర్భావం తర్వాత, సంస్థాగత నిమగ్నత వల్ల 1972 దాకా ఆగవలసి వచ్చింది.

ఆనాడు అందరి మిత్రులు 'నవయుగ పబ్లిషర్స్' సాంబశివరావు గారు ప్రచురణ పరంగా ఆదరించారు. తెనాలిలోని భారతీప్రెస్‌లో నా 'మండుతున్న తరం' తోపాటు, జ్వాలాముఖి, సి.యస్. రావు రచనలను కూడా ముద్రించారు. 60 పేజీలలో 24 కవితలతో చిత్రకారుడు చంద్ర వేసిన ముఖచిత్రంతో, రెండు రూపాయల వెలతో 1972లో వెలువడింది.



నేను 'విరసం' సంస్థాపక సభ్యుడిగా తర్వాత కార్యదర్శిగావున్న రోజులవి. ఈ మొదటి సంపుటిని– "ఈ దేశంలో రాజుకొన్న/ శ్రామిక విప్లవం కోసం/ మహత్తరమైన మార్పు కోసం/ మండిన – మండుతున్న/ ఈనాటి తరం కోసం" అని అంకితమిచ్చాను. ఈ సంపుటిలోని 'భయం' కవిత వివిధ భాషల్లోకి అనువాదమై ప్రశంసలు పొందింది. 'రక్తాన్ని చిందించిన కత్తి' ఏడు పేజీల దీర్ఘ కవిత– ఇది ఇతివృత్తంతో కూడినది. 'కంటి లోంచి జారిపోతున్న జెర్రిపోతు' కవిత ఆనాటి ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సందర్భంగా విమర్శనాత్మకంగా రాసిన ఖండిక. ఇక ఈ సంపుటిపై వచ్చిన సమీక్షల్లో 'ఆంధ్రజ్యోతి' వీక్లీలో ఇంద్రగంటి శ్రీకాంతశర్మ గారి సమీక్ష పేర్కొనదగినది.

ఈ పుస్తకానికి 'ఈ కవిత్వం ఎందుకు' అని నేనే ముందు మాట రాసి ఆనాటి పరిస్థితులను వివరించాను. 1969–70లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం దారి తప్పి, యువకుల త్యాగాలతో కొందరు నాయకులు గద్దెనెక్కారని ఎండగట్టాను. విప్లవ యువతను మండుతున్న తరంగా (The burning generation) భావించి, విప్లవ కవితా ఝంఝ విస్తృతంగా వీస్తూనే ఉంటుందని– "సమాజం లోంచి ప్రతిధ్వనించి తిరిగి సమాజం లోకి– శాస్త్రీయ మార్క్సిస్టు దర్శనం దిక్కు చూపించగా ఆనాటి యువతరం తిరుగుబాటు, నక్సల్బరీ – శ్రీకాకుళ పోరాటాల ఊపునిచ్చి ముందుకు తోశాయి" అని కవితల నేపథ్యాన్ని స్పష్టం చేశాను.

✆ 91778 81201

'ఆమె' జయించిన అడవి



'ఆమె అడవిని జయించింది' అన్న గీతాంజలి గారి నవల పేరు వినగానే వెంటనే స్ఫురించేది కేశవరెడ్డి గారి 'అతడు అడవిని జయించాడు' నవల. పురుషాధిక్య సమాజాల్లో 'అతడు' జయించడం ఉంటుంది గానీ, 'ఆమె' జయించటం ఉంటుందా?

గీతాంజలి 'ఆమె అడవిని జయించింది' నవల శీర్షికలో 'అడవి' అంటే– విశృంఖలతకూ, బంధనాలకూ, చీకటికీ, అజ్ఞానానికీ, కట్టుబాట్లకూ, యథాతథ స్థితికీ, అమాయకత్వానికి అర్థంపర్థంలేని ప్రేమలకూ, మోహాలకూ ప్రతీక. అడవిని జయించడం అంటే, వెలుగుని కనుక్కోవడం.

సమాజ దాష్టీకాల్ని మార్క్సిస్ట్ జ్ఞానంతో నిలవరించడం నేర్చుకున్న జానకి కథను రంగనాయకమ్మ 'జానకి విముక్తి' నవలలో చెప్పిన తర్వాత, కళా గీత 'వెనుదిరగని వెన్నెల' నవలలో స్త్రీ భావోద్వేగాలనీ, సమస్యల్నీ చిత్రిస్తూ, పరిష్కారాల దిశగా ప్రయత్నం చేసిన తర్వాత, అదేకోవలో గీతాంజలి 'ఆమె అడవిని జయించింది' నవల స్త్రీ భావోద్వేగాల్ని బలంగా ప్రతిఫలిస్తుంది.

సంధ్య వైద్య విద్యార్థినిగా చంద్రంతో రిలేషన్‌లో ఉంటూ ప్రేమా మోహాల్లో మునిగి తేలుతూ ఒక బిడ్డని కనడం, సిద్ధార్థ అనే కొలీగ్‌తో మోహంలో పడటం, ఎలానో బయటపడటం, అత్త మామల, తల్లిదండ్రుల ఫ్యూడల్ ఆచార వ్యవహారాల్ని నిరసిస్తూ బలహీనవర్గ స్త్రీ సామాజికంగా, కుల పరంగా, ఆరోగ్యపరంగా ఎదుర్కొనే ఆరళ్ళకు పరిష్కార మార్గాన్ని అన్వేషించడం... ఇలా ఆమె అడవి నుంచి వెలికి రావడం స్థూలంగా ఈ నవల కథాంశం. కథనం ఉత్తర తెలంగాణ యాసలో సమ్మోహనంగా సాగుతుంది. ఒక్కోసారి చైతన్య స్రవంతి టెక్నిక్‌ని వాడతారు రచయిత్రి. సంధ్యలో కాంట్రాడిక్టరీ ఎలిమెంట్స్‌ను సహజంగా చిత్రీకరించారు గీతాంజలి. ఎక్కడా మాస్కులుండవు, ముసుగులుండవు! సంధ్య, చంద్రం, సిద్ధార్థ– ఈ పాత్రలు కళ్ళ ముందు కనపడే వ్యక్తుల ప్రతీకలు. రియల్ లైఫ్ వ్యక్తిత్వాలు.


స్త్రీ మాంసాన్ని సౌందర్యారాధన పేరుతో కళ్ళతోనే కబళించే తన భర్త చంద్రాన్ని ఒకవైపు చీదరించుకుంటూనే, అవే ఎంగిలి చూపులు తనని తడుముతుంటే సంధ్య దాన్ని రొమాన్స్‌గా ఫీలవడంలోని నేలబారు భావాల్ని వెరపు లేకుండా చిత్రిస్తారు రచయిత్రి. సంధ్య ఒకపక్క భర్త చంద్రం గుండెలపై సేదతీరుతుంది, మరోపక్క మూడేళ్ల నుంచీ "నువ్వు కావాలి" అంటూ వెంటాడే సిద్ధార్థ "అనురాగ వర్షంలో తడిచి"పోతుంది, గుండె కరిగి అతని వైపు ప్రవహిస్తుందేమోనని "వణికి" పోతుంది. ఇలా సంధ్యలోని మీనెస్ట్ కోణాన్నీ, అంతకంటే దిగజారి "నీకు ఇష్టమైతే అతనితో వెళ్ళు, కానీ ఇలా దుఃఖించకు" అంటూ ఓదార్చే చీపెస్ట్ చంద్రం టేస్ట్‌నూ నిర్భయంగా వెల్లడిస్తారు రచయిత్రి.

ఇంత అమాయకంగా, ఇంత రొమాంటిక్‌గా, ప్రేమలకూ మోహాలకూ మొహం వాచిపోయినట్లు ఉండే సంధ్య క్రమంగా మహిళా సమస్యల పట్ల అవగాహన పెంచుకుంటుంది. తర్వాత ఆ అవగాహనతో, "చదువుకుంటూ, తింటో, తిరుగుతో, బట్ట కడుతో, చంద్రంతో సుఖపడుతో, పిల్లల్ని కంటో, వాళ్ళ జంజాటంలో పడి నలిగి, పిగిలి, రంగు మాసి, వ్యక్తిత్వం మారి, జీర్ణ వస్త్రంలా మిగలకుండా," కొత్తిమీర మొక్కంతైనా ఉపయోగపడాలన్న ఉద్దేశంతో, స్త్రీ సమస్యలపై పోరాడే 'మానవి' సంస్థ తలుపు తడుతుంది. అక్కడి చర్చలకు మొహమెత్తి, తేజస్విని అందించిన చైతన్యంతో స్త్రీ విమోచన దిశగా అడుగులు వేస్తుంది.

ప్రేమలూ, మోహాలూ, బాంధవ్యాల కీకారణ్యంలో అల్లుకుపోయిన తీగ వల్లిని ఛేదించుకొని, అజ్ఞానపు చీకటి పొరలని చీల్చుకొని, కుళ్ళిన సమాజానికి స్కాల్పెల్ సరిపోదనీ, 'మానవి' సంస్థ లాంటి బిహేవియరల్ థెరపీలు కూడా చాలవనీ అర్థం చేసుకుని, చివరకు విమోచన మార్గాన్ని ఎంచుకున్న సంధ్య... అడవిని జయిస్తుంది.

■ వి. విజయకుమార్
✆ 85558 02596





బేగంపేట టు సికింద్రాబాద్

సోమాజీగూడ పుల్లారెడ్డి బస్ స్టాప్:
పగలంతా నేతి వాసన తాగీతాగీ
రాత్రిపూట మత్తుగా తూలుతోంది

చివరి సికింద్రాబాద్ బస్సు
చినుకుల మధ్య నుంచి రివ్వున దూసుకొచ్చి
దేహాన్ని వెచ్చగా తాకింది

ఎక్కీఎక్కగానే
పాతికేళ్ల క్రితం
ఆకలితో తిరిగిన రోజులన్నీ
ఖాళీ సీట్ల మీద
చెల్లాచెదురుగా కనిపించాయి

పోలీస్ లైన్ బస్ స్టాప్:
నీరసంగా ఎక్కిన ముసలామె సంచిలో
రేపటి బతుకు తండ్లాట

ఆమె నీరసస్వరంలో ఏదో విశ్వాసం
నా గుండెకింద ధైర్యంగా వినపడింది

రసూల్ పుర బస్ స్టాప్:
ఈదురుగాలికి ముడుచుకొని
కుంటి కుక్కతో కలిసి కునుకు తీస్తోంది
ఆకలేసి ఆర్డర్ క్యాన్సిల్ చేసుకున్న స్విగ్గి కుర్రాడు
వచ్చిన కలెక్షన్ ఎంతో
పోయిన కమిషన్ ఎంతో
లెక్కలేసుకుంటున్నాడు

ప్యారడైజ్:
నాగరికత దుప్పట్లో దూరి
సాయంత్రం అమ్మగా మిగిలిన మల్లెపూలని
వుండగా చుట్టి తలకింద పెట్టుకుని
నిద్ర నటిస్తోంది

ప్యాట్నీ:
ఎంతకీ రద్దీ కట్టని దారుల్లో
హరేక్ మాల్ బండి ఒకటి భంగపడి
టార్పాలిన్ చుట్టుకుని
పక్కకు ఆగిపోయింది
ఆకలి మంటతో బీడీ వెలిగించుకొని
అతడు బెంజ్ కారుకి దారిచ్చి
తొలగిపోయాడు

సికింద్రాబాద్:
బడుగు జీవులను మోసీ మోసీ
అలసిన బస్సు దూరంగా నడుం వాల్చింది
రేపటి కోసం
మెహిదీపట్నం బోర్డును తగిలించుకొని
నిద్రలోకి జారుకుంది

■ రత్నశ్రీ
✆ 98488 48001


కంచలలో దెబ్బతిన్న మల్లెతోట



చింతలపాడులో ఎండిపోయి పనికిరాకుండాపోయిన పత్తి


తొక్కేళ్లపాడులో వరద ఉధృతికి కోతకు గురైన వరి పొలం

విలపించేను!

వరదల విధ్వంసానికి కోల్పోయిన పంటలను చూసి రైతన్నల విలవిల


కంచల గ్రామంలో కుళ్లిపోయి ఉన్న కూరగాయలు


బుడమేరు వరదకు మాడిపోయిన పత్తి పొలం


పొందుగల ఎర్రచెరువు కింద దెబ్బతిన్న వరి పంట

ఆంధ్రజ్యోతి పొలంబాట

ఏ చేను చూసినా ఏమున్నది గర్వకారణం.. సమస్తం సర్వనాశనం అన్నట్టుంది ఎన్టీఆర్ జిల్లాలో వానలు, వరదలతో దెబ్బతిన్న పంట పొలాల పరిస్థితి. బిడ్డలా పెంచుకున్న పంట కళ్లముందే నీటిపాలవడంతో తట్టుకోలేక రైతన్నలు విలవిల్లాడిపోతున్నారు. జరిగిన నష్టాన్ని తలుచుకుని కుమిలిపోతున్నారు. ఎలా కోలుకోవాలో తెలీక తల్లడిల్లిపోతున్నారు. వరద తగ్గాక నామరూపాల్లేకుండా పోయిన పొలంవైపు చూసి కన్నీటిపర్యంతమవుతున్నారు. వరి, పత్తి, మిర్చితోపాటు కూరగాయలు, పూలు, పండ్ల తోటలూ పూర్తిగా ధ్వంసమై బురద కయ్యలుగా మారాయి. ఎక్కడైనా కొద్దోగొప్పో పంట మిగిలినా రోజుల తరబడి నీటిలో ఉండడం వల్ల ఆకులు కుళ్లిపోయాయి. తేమ వల్ల వైరస్ తెగుళ్లు సోకాయి. కళ్లముందు ఉన్నట్టే కనిపిస్తున్నా ఆ పంటలు కూడా చేతికి రాని దుస్థితి నెలకొంది. పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌లు, మోటార్లు వరదకు తుడిచిపెట్టుకు పోయాయి. కొన్ని పొలాలు ఇసుక మేటలు వేశాయి. గట్లు తెగి భారీ గండ్లు పడిన చేలు ఎంత మేరకు దెబ్బతిన్నాయో ఎలా సరి చేసుకోవాలో తెలియక రైతులు తలలు పట్టుకుంటున్నారు. కనీవినీ ఎరుగని ఈ విపత్తు నుంచి తాము కోలుకోవాలంటే ప్రభుత్వం ఉదారంగా ఆదుకోవాలని వేడుకుంటున్నారు. వరదల వల్ల దెబ్బతిన్న మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లోని 9 మండలాల్లో సుమారు 200 కిలోమీటర్లు ఆంధ్రజ్యోతి బృందం తిరిగి ఆదివారం పొలాల్లో పర్యటించి రైతుల బాధలను తెలుసుకుంది.

- బిడ్డలా పెంచుకున్న పంటలన్నీ వరదపాలు
- తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో వరదలోనే వరి
- పత్తి, మిర్చి, కూరగాయలు, పండ్లతోటలకు పెను నష్టం
- కొద్దోగొప్పో మిగిలిన పంటలకు వైరస్ తెగుళ్లు
- కోతకు గురైన పొలాల్లో పైకి తేలిన రాళ్లు..
- చెరువులకు గండ్లుపడి వేల ఎకరాలు నీటమునక

'ఆంధ్రజ్యోతి' పొలంబాటలో రైతులు కన్నీరుమున్నీరు

జిల్లావ్యాప్తంగా 200 కిలోమీటర్లు బృందం పర్యటన

- సాయం కోసం ప్రభుత్వాన్ని వేడుకుంటున్న కర్షక జనం

జీవనాధారం కళ్లముందే కొట్టుకుపోయింది



వరదలకు ఆకుకూరలు, కూరగాయల పంటలు వేళ్లతో సహా కొట్టుకుపోయాయి. తిరిగి సాగు చేయాలంటే ఎకరాకు రూ.25వేలు పెట్టుబడి అవసరం ఉంది. చేతిలో చిల్లిగవ్వలేదు. మళ్లీ సాగు చేయకపోతే కూరగాయాలు కూడా కొనలేం.

- రామిరెడ్డి శ్రీరామమూర్తి, రైతు, కుంచాల

36 ఎకరాల్లో నష్టపోయా



36 ఎకరాలు కౌలు చేస్తున్నాను. పంట మొత్తం నీటిలోనే ఉండి పాడైంది. లక్షల్లో అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టాను. ఈ వరదలు ఎన్నడూ ఎరుగని నష్టాన్ని కలిగించాయి. ఒక్క ఎకరం పంట కూడా మిగల్లేదు. అంతా నీటిలోనే నానుతోంది. ప్రభుత్వం ఆదుకోకుంటే కోలుకోలేనయ్యా.

- ఆర్.వెంకటేశ్వరరావు, రైతు, గొల్లపూడి

వరిపైరు పూర్తిగా నీటిలో మునిగిపోయింది



గల్లచెరువువాగుకు గండి పడి నా మూడు ఎకరాల వరి వరదనీటిలోనే ఉంది. సాగుకు రూ.60 వేలు ఖర్చయ్యింది. వరదలు తగ్గినా నా పొలంలో నీరు పోలేదు. పైరు ఏ మాత్రం పనికిరాదు.

- పెదగౌడ్ల సాయి రైతు, గంపలగూడెం

వరి పూర్తిగా దెబ్బతింది



ఎర్ర చెరువుకు గండి పడటంతో మూడెకరాల వరి పంట పూర్తిగా పాడైంది. రూ.50 వేల వరకు పెట్టుబడి పట్టాను. పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నాం. తుపానుతో పూర్తిగా నష్టపోయిన మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోవాలి.

- పగడాల సత్యనారాయణ, రైతు, నాగులూరు

తర్వాత ఎవరో?

కాదంబరి కేసులో తాజాగా ముగ్గురు ఐపీఎస్‌లపై వేటు

- ఇప్పటికే ఏసీపీ, ఇన్‌స్పెక్టర్‌పై వేటు వేసిన అధికారులు
- కాదంబరి జాబితాలో మరో నలుగురు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : ముంబై నటి కాదంబరి జెత్వాని ఫిర్యాదుతో మొత్తం డొంక కదులుతోంది. కొద్దిరోజుల క్రితమే అప్పటి పశ్చిమ జోన్ ఏసీపీ కె.హనుమంతరావు, ఇబ్రహీంపట్నం ఇన్‌స్పెక్టర్ ఎం.సత్యనారాయణపై ఉన్నతాధికారులు వేటు వేశారు. ఇది జరిగిన రెండు రోజులకు కాదంబరి ఇచ్చిన ఫిర్యాదుపై ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్‌ను ఏ1గా చేర్చారు. అతడితోపాటు మరికొంతమంది అని ఎఫ్ఐఆర్‌లో రాశారు. ఈ ప్రక్రియ పూర్తికాగానే ఐపీఎస్ అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, కాంతిరాణా, విశాల్‌గున్నీలను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. తర్వాతి వంతు ఎవరిదనే దానిపై పోలీసు వర్గాల్లో చర్చసాగుతోంది.

వాళ్లకు వేటు తప్పినట్టేనా?

మొత్తం వ్యవహారానికి బాధ్యులను చేస్తూ ఐపీఎస్ అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, కాంతిరాణా, విశాల్‌గున్నీలను సస్పెండ్ చేసినందున ఇక తమ వంతు ఉందని భావిస్తున్నారు. ఐపీఎస్‌లపై వేటు వేశారు కాబట్టి తమపై ఎలాంటి చర్యలూ ఉండబోవని సన్నిహితుల వద్ద చెప్పుకుంటున్నారు. కాదంబరి ఆరోపణల జాబితాలో ఉన్న అదనపు ఎస్పీ నాడు టాస్క్‌ఫోర్స్ విభాగంలో పనిచేశారు. ఒక ఇన్‌స్పెక్టర్ ఇదే విభాగంలో ఉండేవారు. మరో ఇన్‌స్పెక్టర్ కమిషనరేట్‌లో వ్యవహారాలను చక్కబెట్టేవారు. ఎస్ఐ మాత్రం మొత్తం కమిషనరేట్‌కు షాడోగా వ్యవహరించాడు. ఇటీవలే ఆయన్ను ఏలూరు రేంజ్‌కు సరెండర్ చేశారు. అక్కడి నుంచి కృష్ణా జిల్లాలో రైల్వే విభాగానికి వచ్చినట్టు వినికిడి. ఇప్పటికే కుక్కల విద్యాసాగర్‌పై కేసు నమోదు చేసినందున తర్వాత ఎఫ్ఐఆర్‌లో ఎవరి పేర్లు చేరతాయోనన్న ఆందోళన హద్దులు దాటిన ఖాకీల్లో కనిపిస్తోంది. కాదంబరి జెత్వాని ఇచ్చిన వాంగ్మూలను బేరీజు వేసుకుని మిగిలిన వారిపై చర్యలు తీసుకోవడం ఖాయమన్న వాదన ఆమె తరఫున న్యాయవాదులు చెబుతున్నారు. ఈ ముంబై నటి కేసు వ్యవహారం రోజురోజుకు తీవ్రరూపం దాల్చడంతో ఆమె అరెస్టుతో ప్రమేయం ఉన్న పోలీసులు ఇప్పుడు కొత్త ప్రవచనాలు చెబుతున్నట్టు సమాచారం. కాదంబరిని కస్టడీలోకి తీసుకున్న తర్వాత ఆమెకు అన్ని రకాల సహాయ సహకారాలు తామే అందించామని ప్రచారం చేసుకుంటున్నారు. ఇలా చేసుకోవడం ద్వారా అధికారులు తీసుకునే చర్యల నుంచి తప్పించుకోవచ్చన్న యోచనలో ఉన్నారు. నాడు తనను, కుటుంబాన్ని చిత్రహింసలు చేసిన ప్రతి ఒక్కరి పైనా చర్యలు తీసుకోవాల్సిందేనని కాదంబరి డిమాండ్ చేస్తోంది.

ఒక్కొక్కరికిపై వేటు

కాదంబరిపై కేసు నమోదు చేయడం, ఆమెను అరెస్టు చేయడంలో ఒక అదనపు ఎస్పీ, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఒక ఎస్ఐ కీలకంగా వ్యవహరించినట్టు ఆమె ఆరోపించింది. వారిలో ఒక ఇన్‌స్పెక్టర్, ఎస్ఐ పేరును ఫిర్యాదులో పేర్కొంది. ఈ అదనపు ఎస్పీ ఇప్పుడు గుంటూరు జిల్లాలో పనిచేస్తున్నారు. ఇన్‌స్పెక్టర్లలో ఒకరు విజయవాడలో ఉండగా, మరొకరు ఏలూరు రేంజ్‌లో ఉన్నారు. ఎస్ఐ మాత్రం కృష్ణా జిల్లాలో రైల్వే విభాగంలో పనిచేస్తున్నారు. కాదంబరి నుంచి వాంగ్మూలం ద్వారా తీసుకున్న వివరాలను విచారణాధికారి స్రవంతిరాయ్ పోలీసు కమిషనర్ రాజశేఖరబాబుకు అందజేశారు. ఆ నివేదికను ఆయన డీజీపీకి పంపారు. కాదంబరితోపాటు ఆమె తండ్రి నరేంద్ర కుమార్ జెత్వాని, తల్లి ఆశా జెత్వాని వాంగ్మూలం ఇచ్చారు. ఈ నివేదికను పరిశీలించిన ఉన్నతాధికారులు ఒక్కొక్కరిపై క్రమంగా వేటు వేయడం మొదలుపెట్టారు.

• ఆకలి తీరుస్తూ.. అండగా నిలుస్తూ..



వారు నివసించడానికి ఇల్లు ఉంది. భార్య, భర్త, పిల్లలతో సొంత కుటుంబం ఉంది. పక్షం రోజుల క్రితం వరకూ కష్టార్జితంపై బతికే శక్తి ఉంది. మెరుపులా వచ్చిన బుడమేరు ఉపద్రవం ఆ కుటుంబాలను కకావికలం చేసింది. కట్టుబట్టలతో విగిల్చింది. మీకు మేమున్నాం అంటూ.. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకొచ్చి అండగా నిలిచారు. రోజూ వారి ఆకలి తీరుస్తున్నారు. ఇలా ఆదివారం కండ్రికలో దాతలు ఆహారం అందిస్తున్న సందర్భంగా వరద బాధితులు భారీగా కూడిన దృశ్యమిది.

అయినోళ్లకే ఓడీలు

వైసీపీ హయాంలో రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)లో అయిన వాళ్లకు అడ్డగోలుగా ప్రయోజనాలు కల్పించేశారు. ఆర్టీసీలో అమలులో లేనటువంటి అవుట్ ఆఫ్ డిజిగ్నేషన్ డ్యూటీ (ఓడీ) విధానాన్ని అక్రమ పద్ధతిలో తీసుకువచ్చి పెద్దఎత్తున వైసీపీ మద్దతుదారులకు ప్రయోజనం కల్పించారు. ఎలాంటి అనుమతి లేకుండా కొన్నేళ్లుగా జిల్లాలో అక్రమంగా భారీ సంఖ్యలో ఉద్యోగులు ఓడీలు చేస్తున్నారు. తోటి ఉద్యోగుల నుంచి ఫిర్యాదులు రావటంతో ఆర్టీసీ ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. జిల్లాలోనే 113 మంది ఉద్యోగులు అక్రమంగా ఓడీలు చేస్తున్నట్టు వెలుగు చూసింది. దీంతో ఆర్టీసీ ఆర్ఎం ఎంవై దానం తక్షణం అక్రమంగా ఓడీలు చేస్తున్న వారికి సోమవారం నుంచి సాధారణ డ్యూటీలు వేయాలని ఆదేశించారు. కృష్ణా జిల్లాలో కూడా దాదాపు వంద మందికిపైగా ఇదే పద్ధతిలో అక్రమంగా ఓడీలు చేస్తున్నారని తెలుస్తోంది.



వైసీపీ హయాంలో ఆర్టీసీలో అడ్డగోలు వ్యవహారాలు

- జిల్లాలో కాంపిటెంట్ అథారిటీ శాంక్షన్ లేకుండా భారీ సంఖ్యలో అక్రమంగా ఓడీలు
- అలా చేస్తున్న వారిపై ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఫిర్యాదులతో విచారణ
- మొత్తం 113 మంది ఉద్యోగులు అక్రమంగా ఓడీ ప్రయోజనాలు పొందుతున్నారని గుర్తించిన ఆర్టీసీ
- తక్షణం వారిని సాధారణ డ్యూటీలకు మాత్రమే పంపాలని ఉన్నతాధికారి ఆదేశాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. ఆర్టీసీలో విపరీత పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఆర్టీసీని జేబు సంస్థగా వైసీపీ పెద్దలు మార్చి వేశారు. వైసీపీ పెద్దల ఆదేశాలతో నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి మరీ అయినవాళ్లకు అగ్ర తాంబూలం కల్పించారు. ఎన్టీఆర్ జిల్లాలో ఆటోనగర్ బస్ డిపోకు సంబంధించి నలుగురు, గవర్నర్ పేట - 1 డిపోలో 25 మంది, గవర్నర్‌పేట - 2 డిపో పరిధిలో 19 మంది, ఇబ్రహీంపట్నం డిపో పరిధిలో నలుగురు, తిరువూరు డిపో పరిధిలో ఆరుగురు, విద్యాధరపురం బస్ డిపో పరిధిలో 20, విజయవాడ డిపో పరిధిలో ఏడుగురు చొప్పున 113 మంది ఉద్యోగులు అక్రమంగా ఓడీలు చేస్తున్నారు. ఇలా అక్రమంగా ఓడీ చేస్తున్న వారిలో మొత్తం 30 మంది డ్రైవర్లు ఉండగా.. 83 మంది కండక్టర్లు ఉన్నారు. వీరంతా తమ సాధారణ విధులకు భిన్నమైన డ్యూటీలు చేస్తున్నారు. వీరి ఓడీలు చూస్తే సుఖవంతమైన కార్గో ఆఫీసులు, సీఎం వెహికల్ యూనిట్, హెడ్డాఫీసు, పీఎఫ్ ట్రస్టు, ఆర్టీసీ హౌస్‌లు, ఆర్టీసీ పరిరక్షణ, సిటీ బస్ టెర్మినల్, చీఫ్ మేనేజర్ మార్కెటింగ్, విజయవాడ మెడికల్ వార్డ్, లాజిస్టిక్స్ స్టోర్ సూపర్‌వైజర్, సిస్టమ్ సూపర్ వైజర్, క్యాష్ సెక్షన్, పీఎన్‌బీఎస్ కంట్రోలింగ్, స్క్వాడ్ జీప్, బస్‌పాస్ కౌంటర్లు, పీఎన్‌బీఎస్ కార్గో వంటి చోట్ల కదుపులో చల్లకదలకుండా ఉండే ఉద్యోగాలు చేస్తున్నారు. వాస్తవానికి ఓడీ కల్పించాలంటే.. కాంపిటెంట్ అథారిటీ అనుమతి ఉండాలి. అత్యవసర పరిస్థితుల్లో ఉద్యోగాలు చేసే వారికి ఈ ఓడీ సదుపాయాన్ని కల్పించటంలో తప్పు లేదు. మెడికల్ అన్‌ఫిట్ అయిన డ్రైవర్లు, కండక్టర్లు తిరిగి తమ సాధారణ విధులు నిర్వహించలేరు. తీవ్ర అనారోగ్యం పాలైనవారు, హృద్రోగులు, క్యాన్సర్ పేషంట్లు వంటివారు తమ సాధారణ డ్యూటీలు చేయటంలో ఎంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇలాంటి బాధితులు పెద్ద సంఖ్యలో ఆర్టీసీలో ఉన్నారు. తమ పరిస్థితిని చూసి మానవత్వంతో ఓడీలు కల్పించాల్సిందిగా చేసిన విజ్ఞప్తులను ఆర్టీసీ డిపో మేనేజర్లు ఖాతరు చేయలేదు. కానీ అవయువాలన్నీ బాగున్నవారికి, ఎలాంటి అనారోగ్య సమస్యలు లేనివారికి మాత్రం ఓడీలు కల్పించటం గమనార్హం. ఆయా డిపోలలో డిపో మేనేజర్లకు తాబేదార్లుగా వ్యవహరించే వారికి, వైసీపీ వీర విధేయులకు మాత్రం అడ్డగోలుగా ఓడీలు కల్పించేశారు. ఇలా ఐదేళ్లుగా నిర్విఘ్నంగా ఓడీలు అనుభవిస్తున్నారు.

వందలాది మందికి ఓడీ ప్రయోజనాలు

ఎన్టీఆర్ రీజియన్ పరిధిలో రికార్డు స్థాయిలో 113 మంది ఉద్యోగులు అక్రమంగా ఓడీలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆర్టీసీ విజయవాడ జోన్ పరిధిలోని విగిలిన రీజియన్లలో కూడా వందల సంఖ్యలో అక్రమంగా ఓడీలు నిర్వహిస్తున్నారని తెలుస్తోంది. ఎన్టీఆర్ జిల్లా తరహాలో జోన్ పరిధిలోని మిగిలిన రీజియన్లలో కూడా విచారణకు ఆదేశిస్తే భారీ సంఖ్యలో అక్రమంగా ఓడీలు నిర్వహిస్తున్న వారి జాబితాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

సెక్రటేరియట్‌లోని రవాణా శాఖకు మహిళా ఉద్యోగులు

వైసీపీ అధికారంలో ఉండగా.. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేశారన్న సాకుతో నిబంధనలకు విరుద్ధంగా కొంతమంది మహిళలను సెక్రటేరియట్‌లోని రవాణా శాఖకు బదలాయించారు. ఆర్టీసీ ఉద్యోగులను ఇతర డిపార్ట్‌మెంట్లలోకి పంపించాలంటే కచ్చితంగా సీనియారిటీని ప్రాతిపదికగా తీసుకోవాలి. సీనియారిటీని పక్కన పెట్టి కొందరు మహిళా ఉద్యోగులను రవాణా శాఖకు పంపించారు. ఈ వ్యవహారంలో అప్పటి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి హస్తం కూడా ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఇలాంటి వ్యవహారాలపై తక్షణం ప్రస్తుత ప్రభుత్వం విచారణకు ఆదేశించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



బైబై గణేశా..!

ఈ ఏడాది భారీ ఊరేగింపులు లేవు. ఎప్పటిలాంటి కోలాహలం లేదు. చెవులు మారుమోగేలా డీజే ధ్వనులు లేవు. వరద మిగిల్చిన విషాదంతో నగరంలో ఎక్కువ భాగం వినాయక చవితి ఉత్సవానికి దూరమైనా మైదాన ప్రాంతంలో కొన్నిచోట్ల మాత్రమే గణపతి మహోత్సవం నిరాడంబరంగా సాగింది. ఆదివారం 9వ రోజున భక్తులు కృష్ణానదిలో గణపతి నిమజ్జనం చేసి బైబై చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకు దుర్మరణం

బైక్‌పై వెళ్తుండగా లారీ ఢీకొనడంతో దుర్ఘటన

6లో..

వరద మిగిల్చిన వ్యథ

ఎన్టీఆర్ జిల్లాలో 200 కిలోమీటర్ల మేర ఆంధ్రజ్యోతి పొలంబాట

వరదముంపునకు గురైన పంటను కాపాడుకోలేక నాడు నిస్సహాయంగా నిలిచిన అన్నదాత బురదలో కుళ్లిపోతున్న మొక్కలు చూస్తూ నేడు కుమిలిపోతున్నాడు. భారీవర్షాలతో పొంగిన మునేరు, కృష్ణా నదులు శాంతించినా విధ్వంసానికి గురైన పంటలు చూస్తూ రైతులకు మనఃశ్శాంతి కరువైంది. వరద ఉధృతికి కొన్నిగ్రామాల్లో పంటలు కొట్టుకుపోయిగా, మరికొన్నిచోట్ల అధిక తేమతో నేడు నిలువునా ఎండిపోతున్నాయి. ఎన్టీఆర్ జిల్లాల్లో పంట నష్టపోయిన గ్రామాల్లో ఆంధ్రజ్యోతి బృందం శనివారం పర్యటించి వారి సాధకబాధకాలను తెలుసుకుంది.


ఇసుక మేటల్లో పంట పొలాలు


అన్నవరం - రెడ్డినాయక్ తండా గ్రామాల మధ్య కొట్టుకుపోయిన రోడ్డు


గంపలగూడెంలో నీటమునిగిన వరిపైరు

జి.కొండూరు / రెడ్డిగూడెం / మైలవరం / ఇబ్రహీంపట్నం / గొల్లపూడి / మైలవరం రూరల్ / తిరువూరు / ఎ.కొండూరు / గంపలగూడెం /విస్సన్నపేట: వరదలతో దెబ్బతిన్న పంట పొలాలను ఆంధ్రజ్యోతి టీమ్ శనివారం క్షేత్రస్థాయి పర్యటన చేసింది. మైలవరం, తిరువూరు నియోజకవర్గంలోని 9 మండలాల్లో సుమారు 200 కిలోమీటర్ల మేర పొలాల్లో పర్యటించి రైతుల బాధలను తెలుసుకున్నారు. ఏ రైతును కదిలించినా కన్నీటి కథలే. చరిత్రలో ఎన్నడూ లేనంత వర్షం, 25 నుంచి 30 సెంటీమీటర్ల వర్షంతో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. ముఖ్యంగా మైలవరం నియోజవర్గంలోని ఐదు మండలాలను బుడమేరు, పులివాగు, కోతులవాగుతో పాటు మరికొన్ని వాగులు ముంచేశాయి. ఇబ్రహీంట్నం మండలంలోని ఏటి పట్టు గ్రామాల రైతుల్ని కృష్ణానదికి వచ్చిన వరదలు కోలుకోలేని దెబ్బతిశాయి. బుడమేరు పరివాహక ప్రాంతాలు జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాల్లోని ఈలప్రోలు, గుంటుపల్లి గ్రామాల్లోని వరి ఇప్పటికీ నీటిలోనే నానిపోయి కుళ్లిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి, జక్కంపూడి, షాబాద, గొల్లపూడి, రాయనపాడు, పైడూరుపాడు గ్రామాల్లో వరిపంటలు పూర్తిగా నాశనమై రైతులు కోలుకోలేని దెబ్బతిన్నారు. మైలవరం మండలం చంద్రాలలోని చెరువుకు గండిపడి చంద్రాల, గణపవరం గ్రామాల పరిధిలోని వేల ఎకరాల్లో వరిపంట నీట మునిగింది. పొందుగల ఎర్రచెరువు కింద వరద ఇంకా ప్రవహిస్తుండటంతో వరిపంటలు ఇంకా వరద నీటిలోనే ఉన్నాయి. రెడ్డిగూడెం మండలంలో కొత్త నాగులూరు, పాత నాగులూరు గ్రామాల్లో 4 చెరువులకు గండ్లు పడటంతో 50 ఎకరాల్లో వరి పంట పాడైంది. ఓబులాపురంలో నాగసానిపాటి చెరువు వాగ వరద వారం పాటు ఉంటడంతో వరి చేలు పాడయ్యాయి. పొలాల గట్ల మధ్యలోని వందల కొద్దీ ఆయిలింజన్లు పాడయ్యాయి. ఒక్కో ఇంజన్ మరమ్మతుకు రూ.2వేల వరకు ఖర్చవుతుందని అన్నదాతలు వాపోతున్నారు. తిరువూరు నియోజకవర్గంలో కొన్ని మండలాల్లో వరి పాక్షికంగా, మెట్టపంటలు భారీగానే దెబ్బతిన్నాయి, తిరువూరు, ఎ.కొండూరు, విస్సన్నపేట, గంపలగూడెం మండలాల్లో వగులు, చెరువుల ఆయకట్టులో సాగుభూములు నేటికి నీటిలోనే మునిగిఉన్నాయి. తిరువూరు మండలం చిక్కుళ్లగూడెంలో పత్తిపైరు వరదలకు కొట్టుకుపోగా, పీటీ.కొత్తూరులో సుమారు 200 ఎకరాల్లో పత్తి ఎర్రబడి ఎదుగుదల లేకుండా పోయింది. ఎ.కొండూరు మండలంలో సుమారు 120 ఎకరాల్లో సాగులో ఉన్న మినుము, పెసర వర్షాలకు మొలకలు రావడంతో పంటనష్టం తీవ్రంగా జరిగింది. గంపలగూడెం మండలంలో 60 శాతం వరి, 60 శాతం పత్తిపంటలకు నష్టం వాటిల్లింది. కనుమూరు, వినగడప, అనుముల్లంక, గ్రామాల్లో వాగువడ్డు పొలాల్లో ఇసుక, మట్టి మెటలు వేశాయి. వినగడప రాళ్లచెరువు, గంపలగూడెం నల్లచెరువు వాగుకు, ఊటుకూరు నల్లచెరువు, పెనుగోలను ఊరచెరువులకు గండ్లు పడి వరదనీరు ఆయకట్టు భూముల్ని ముంచేసింది. విస్సన్నపేట మండలంలో కలగర గాజులచెరువుకు గండి పడటంతో సమీపంలోని వరిపైరు నీటీ మునిగిఉంది.

నిస్సహాయతకు కుమిలిపోతున్నరైతు..

నందిగామ: భారీగా పెట్టుబడులు పెట్టి కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన పంటలు వారం రోజుల వ్యవధిలో తుడిచిపెట్టుకుపోయాయి. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు పెట్టుబడులకు డబ్బు లేక ఏమీ పాలుపోని దుస్థితికి చేరారు. ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు. అరకొర సాయం కాకుండా కూటమి ప్రభుత్వం దన్నుగా నిలవాల్సిన సమయం ఇది అని అంటున్నారు. మునేటి వరదకు పలు గ్రామాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రధానంగా మునేటి ఆయకట్టులోని కంచల గ్రామ రైతులు సర్వం కోల్పోయారు. వరద బీభత్సంతో నేడు ఆ గ్రామం భీతిల్లి కనిపిస్తుంది. దశాబ్దాలుగా సుమారు 300 కుటుంబాలు ఆ గ్రామంలో కూరగాయలు, ఆకు కూరలు సాగు చేస్తూ జీవిస్తున్నారు. సుమారు 70ఎకరాల్లో కూరగాయలు, ఆకు కూరల తోటలు నామరూపాలు లేకుండా పోయాయి. సుమారు 500 ఎకరాల్లో వరిపంట పూర్తిగా దెబ్బతిందింది. తిరిగి నాట్లు వేసేందుకు నారు సిద్ధంగా లేకపోవడంతో రైతులు డీలా పడుతున్నారు. చెరకు, మొక్కజొన్న, పండ్ల తోటల్లో నీరు ఇంకా నిలబడే ఉండడం అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తుంది. గోళ్లమూడి, రాఘవాపురం, కొణతమాత్మకూరు గ్రామాల్లోనూ దాదాపుగా ఇదే పరిస్థితి.

గ్రామాలన్నీ కకావికలం

జగ్గయ్యపేట రూరల్: మండలంలోని పాలేరు నదీ పరివాహక గ్రామాల్లో ఇటీవల కురిసిన తుపాన్, ఎగువ నుంచి వచ్చిన వరదతో ఆయా గ్రామాలు కకావికలమయ్యాయి. ప్రధానంగా వరి, పత్తి, విర్చితో పాటు మామిడి తోటలు, ఉద్యాన పంటలు, కూరగాయలు, కోళ్ల ఫారా లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు వరదకు తుడిచిపెట్టుకుపోయా యి. సాగు భూములు కోతకు గురై రాళ్లు తేలాయి. తమ భూములు ఎంత మేరకు దెబ్బతిన్నాయో ఎలా సరి చేసుకోవాలో తెలియక రైతులు తలలు పట్టుకుంటున్నారు. ప్రధానంగా తక్కెళ్లపాడు, బలుసుపాడు, అన్నవరం, బూదవాడ, కె.అగ్రహారం రైతులను వరద ఉధృతి దెబ్బతీసింది. రహదారులు, వంతెనలు కొట్టుకుపోవటంతో రాకపోకలు పునరుద్ధరించలేదు. ప్రభుత్వం సహకారం అందించినా కోలుకునేందుకు కొన్నేళ్లు పడుతుందని రైతులు అంటున్నారు.

వత్సవాయి: మండలంలో 995 హెక్టార్లలో పంటలు నాశనమయ్యా యి. వరి 480 హెక్టార్లు, పత్తి 300 హెక్టార్లు, మొక్కజొన్న 10 హెక్టా ర్లు, పెసర 5 హెక్టార్లు, ఇసుక మేట ద్వారా 200 హెకార్ల పం ట పొలాలు దెబ్బతిన్నాయి. పోలంపల్లి, వేమవరం, లింగాల, పోచవరం, గంగవల్లి చిట్యాల, కన్నెవేడు గ్రామాల పరిధిలోని పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

మూడొంతుల గ్రామాలు అతలాకుతలం..

చందర్లపాడు: కృష్ణా, మునేటి నదులు ఉప్పొంగటంతో మండలంలోని పలు గ్రామాలలో పంటలు తుడిచిపెట్టుకుపోయాయి. దాదాపు మూడొంతుల గ్రామాలు ముంపునకు గురై అతలాకుతలమయ్యాయి. చింతలపాడు, కొడవటికల్లు రైతులకు అతి భారీ నష్టం జరిగింది. చింతలపాడు, తోటరావులపాడు, ఏటూరు గ్రామాల్లో మునేటి వరద వల్ల దాదాపు 1200 ఎకరాల మాగాణీ పంటల పూర్తిగా ధ్వంసమైంది. ఇసుక నేల కావడంతో కోతకు గురై వరి పంట ఆనవాళ్లు లేకుండా పోయింది. వందల ఎకరాల్లో చెరకు, మొక్కజొన్న పంటలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. పత్తి, మిర్చి వంటి వాణిజ్య పంటలు బురదకయ్యలుగా మారాయి. కొడవటికల్లు గ్రామం వాణిజ్య పంటలకు పెట్టింది పేరు. కృష్ణా నది వరదకు ఈ గ్రామంలో సుమారు 250 ఎకరాల్లో మిర్చి పంట పూర్తిగా కొట్టుకుపోయింది. గుడిమెట్ల వద్ద నుంచి ఏటూరు వరకూ ఉస్తేపల్లి, కాసరబాద, పొక్కునూరు, కొడవటికల్లు, పున్నవల్లి, పోపూరు, విభరింతలపాడు, రామచంద్రాపురం గ్రామాల్లో కృష్ణా వరద ప్రభావానికి గురి కాగా, ఏటూరు, చింతలపాడు, తోటరావులపాడు, తుర్లపాడు, కొత్త కంచల గ్రామాలు మునేటి వరదకు బలయ్యాయి. మిగిలిన నాలుగైదు గ్రామాల రైతులు భారీ వర్షాలకు బలయ్యారు. పంట నష్టం ఇప్పటికే 92 శాతం వరకూ అధికారులు నమోదు చేసినట్లు తెలిసింది

కంచికచర్ల మండలంలో..

వరదలు, భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. గనిఆత్కూరు, కొత్తపేట, చెవిటికల్లు గ్రామంలో పంటలకు భారీ నష్టం వాటిల్లింది. సన్న చిన్నకారు రైతులతో కూడిన ఈ గ్రామాలు వర్ష బీభత్సానికి తీవ్రంగా నష్టపోయింది.తో పాటు వాణిజ్య పంటలు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయి. కౌలు రైతుల పరిస్థితి మరీ దయనీయంగా మారింది. కొత్తపేట, గనిఆత్కూరు గ్రామాల్లో పంట పొలాలతో పాటు ఇళ్లలో నిల్వ ఉంచిన పంటలు కూడా నీటమునిగి దెబ్బతిన్నాయి.

వీరులపాడు మండలంలో..

మునేటి ఒడ్డున ఉన్న వీరులపాడు మండలంలోని పలు గ్రామాలను ఏనుగుగడ్డ వాగు ముంచింది. పెద్దాపురం, అల్లూరు, జుజ్జూరు, నరసింహారావుపాలెం, చెన్నారావుపాలెం, గొట్టుముక్కల తదితర గ్రామాల పంటలను ఈ వాగు కబళించింది. ఆయకట్టులోని పంటలను మూడు రోజుల పాటు పూర్తిగా ముంచింది. వరద ఉధృతికి పత్తి, మిర్చి పంటలు కొంత మేర కొట్టుకుపోగా, మరి కొంత పంట ఎండిపోతుంది. వరద తీసిన అనంతరం వేరు కుళ్లు తెగులు వచ్చి పత్తి, మిర్చి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కొందరు రైతులు నిస్సహాయంగా పంటలు వదిలేయగా, మరి కొందరు బ్రతికించుకొనే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వ సాయం కోసం వేచి చూస్తున్నారు.



కోరినంత కాకపోయినా.. కోలుకొనేంతైనా..!

చందర్లపాడు: భారీ వర్షాలు, వరదలకు నష్టపోయిన రైతులు ప్రభు త్వ సాయం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. గతంలో వర్షాలు, వరద లు వచ్చినప్పుడు పంటలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అప్పట్లో ప్రభుత్వా లు అరకొర సాయం ఇస్తూ వచ్చాయి. ఈ దఫా వచ్చిన కష్టం వ్యవసాయ రంగ చరిత్రలో ఎన్నడూ రాలేదు. ప్రభుత్వం తన సాయాన్ని ఏ మేర ప్రకటిస్తుందోనన్న మీమాంసలో అన్నదాతలు కొట్టువిుట్టాడుతున్నారు. విజయ వాడ వరదల్లో ప్రజలకు సీఎం చంద్రబాబు చేసిన సేవ, ఇచ్చిన భరోసా, వరద తరువాత చేస్తున్న సాయం మొత్తాన్ని పరిశీలిస్తున్న అన్నదాతలు ఒకింత ధైర్యంగానే ఉన్నారు. తమను కూడా అదే తీరున ఆదుకోవాలని కోరుతున్నారు. మళ్లీ పంటలు వేయాలంటే ఎకరాకు రూ.15 నుంచి రూ.25వేల వరకూ ఖర్చవుతుంది. ఈ మొత్తం ఖర్చులను అంచనా వేసుకొని ప్రభుత్వం సాయం చేయాలని వేడుకుంటున్నారు. అంతా కాకపోయినా కోలుకొనే మేర సాయమందిస్తే చాలని కోరుతున్నారు.

వరద కష్టాలు.. రైతుల మాటల్లో..

తక్షణం గండ్లు పూడ్చాలి
బొర్రా హనుమంతరావు,రైతు, కవులూరు



చెరువులు, కాలువలకు పడిన గండ్లను తక్షణం పూడ్చకపోతే వరదలకు పోగా విుగిలిన పంటలకు సాగునీరుండదు. ఒక పక్క వరదలతో నష్టపోయాం. మరోపక్క సాగునీరు లేక నష్టపోతాం. ఉన్న పంటలైనా చేతికి రావాలంటే గండ్లు పూడ్చటం ఒక్కటే మార్గం.

పంట నష్టం ప్రకటించాలి
గాదె వెంకటరెడ్డి, రైతు, గణపవరం



రెండున్నర ఎకరాల్లో వరిపంట సాగుచేశా. వరద ధాటికి పంట మొత్తం కుళ్లిపోయింది. ఇప్పటికే పంట సాగుకోసం వేలాది రూపాయలు ఖర్చు చేశా. మళ్లీ పంట వేద్దామన్నా నారు దొరకని పరిస్థితి. ప్రభుత్వం పంట నష్టం ప్రకటించి ఆదుకోవాలి.

ప్రభుత్వం సాయం పెంచాలి.. రైతు, ఈలప్రోలు

ఇబ్రహీంపట్నం మండలంలో పంటలు అన్ని 15 రోజులుగా నీటి ముంపులో ఉన్నాయి. పంట కుళ్లిపోయింది. ఎకరానికి రూ.20 వేలు పెట్టుబడి పెట్టాం. ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేలు ఇస్తే ఎలా సరిపోతుంది. పరిహారం పెంచి ఆదుకోవాలి.

నష్టపరిహారం అందించాలి
బొంతు మాధవరావు, పత్తిరైతు చిట్యాల



ప్రస్తుతం తుపాను ప్రభావంతో నష్టపోయిన పంటలకు నష్టపరిహారం అంచనలు వేస్తున్నట్లే పత్తిపంటలు పరిశీలించిన నష్ట పరిహారం అందించాలి, ఇప్పటికే పెట్టుబడుల రూపంలో వేలాధి రూపాలు ఖర్చుచేశాం,

చేతికొచ్చిన పంట సర్వనాశనమైంది
వడ్డే సాంబశివరావు, రైతు తూర్పు మాధవరం



ఆరుగాలం కష్టించి పండించిన పంట నీటిపాలైంది. ఎకరాకు రూ.20 వేరు ఖర్చయింది. కోతకు సిద్ధం చేస్తున్న తరుణంలో భారీ వర్షాలు, వరదలకు పైరు తడిసి మొలకలెత్తాయి. ప్రభుత్వం ఇబ్బందులు గుర్తించి ఆదుకోవాలి.

ప్రభుత్వం ఆదుకోవాలి
మల్లెంపల్లి సాంబశివరావు, రైతు, వీరరాఘవపురం



వరదలకు పొలం మొత్తం ముంపు బారిన పడింది. ఎకరానికి రూ.20 వేలు ఖర్చు అయ్యింది. తిండి గింజలు పోయాయి. చెరువు అలుగు నీరు చేలోనే ఉంటుంది.

నిలువునా ముంచింది: యానాల గోపీ, రైతు



పాలేటికి వచ్చిన వరద నిలువునా ముంచింది. కొన్ని వ్యవసాయ భూముల్లో ఈ ఏడాది పంట పాక్షికంగా దెబ్బతింది. వరద ఉధృతికి కోతకు గురైన పొలాలు సాగుకు అనుకూలగాఆ మారాలంటే ఏళ్లు పట్టేలా ఉంది.

వందేళ్లలో ఇలాంటి విపత్తు చూడలేదు
రమణయ్య, రైతు జగ్గయ్యపేట రూరల్



ఈ విపత్తు 100 ఏళ్లలో ఎప్పుడూ చూడలేదు. సాదారణంగా పంటలు మునిగినా వరదలతో పాటు ఒండ్రు మట్టితో తదుపరి ఏడాది పంటలు పండేవి. ఒండ్రు లేకపోగా సారవంతమైన మట్టి కొట్టుకుపోయింది. మట్టినెలా నింపాలో అర్థం కావటం లేదు.

రైతులకు కోలుకోలేని దెబ్బ
కస్తుర్తి శ్రీనివాసరావు, రైతు, పేట రూరల్



పాలేటికి వచ్చిన వరద రైతులకు కోలుకోలేని దెబ్బతీసింది. వ్యవసాయం కోసం ఏర్పాటు చేసుకున్న మోటార్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు వరద దాటికి కొట్టుకుపోయాయి. రైతులు శ్రమ ఈ ఏడాది వరద పాలైంది. రైతులు కొలుకోవటం కష్టంతో కూడుకున్న పని.

రూ. 50 నుంచి 70 వేలు ఖర్చైంది
వక్కంతుల నరసింహారావు, రైతు, పేట రూరల్



నారుమడుల నుంచి నాట్లు, ఎరువుల వరకు రూ. 50 నుంచి 70 వేలు ఖర్చు వచ్చింది. పంటలు పోయాయని బాధపడాలో మేటలు తొలగించటం ఆలోచిస్తే భయం వేస్తుంది. రాయితీపై మేటలు తొలగించేందుకు వాహనాలను సరఫరా చేయటంతో పాటు వరద కోతకు గురైన పొలాలలో మేరువ తోలుకునేందుకు కూడా సారవంతమైన మట్టిని అందించాలి.

తమ్మినేని రమేష్, రైతు, పోలంపల్లి

వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టాం. వరదకు పంటలు కోల్పోయాం. ప్రభుత్వం ఆదుకోకకుంటే ఆత్మహత్యలే శరణ్యం.

వరద కష్టాలు.. రైతుల మాటల్లో..

ప్రత్యామ్నాయ పంటలే శరణ్యం
ములకలపల్లి కోటేశ్వరరావు, రైతు, కంచలపత్తి



వ్యవసాయం ప్రారంభించినప్పటి నుంచి ఇంతకష్టం ఎప్పుడూ చూడలేదు. పంటలన్నీ నీటిపాలయ్యాయి. మాగాణీ పూర్తిగా కొట్టుకుపోగా, వాణిజ్య పంటలు వేరుకుళ్లు తెగులతో నేడు దెబ్బతింటున్నాయి. ప్రభుత్వం సహకరిస్తే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని ఉంది.

పూర్తిగా దెబ్బతిన్న మిర్చిపంట
మన్నెం వేణుప్రసాద్, మిర్చి రైతు, చందర్లపాడు



వారంపాటు ఎడతెరిపి లేని భారీ వర్షాలతో మిర్చి పంట పూర్తిగా దెబ్బతింది. కొన్నిచోట్ల కృష్ణా వరదకు పూర్తిగా కొట్టుకుపోగా, మరికొన్నిచోట్ల అధిక తేమతో వేరు, ఆకు కుళ్ల తెగుళ్ల ఆశించి మొక్కలు ఎండిపోతున్నాయి. ప్రభుత్వం సాయం అందిస్తే తప్ప కొలుకొనే స్థితి లేదు.

పూర్తిగా ఎండిపోయిన మాగాణి
మేకపోతుల రాజేశ్వరరావు, చింతలపాడు



వారంపాటు పూర్తిగా నీటిలో ఉండడంతో పాటు వరద ఉధృతి అధికంగా ఉండడంతో మాగాణి పూర్తిగా ఎండిపోయింది. ఇప్పటికే రూ.20వేల వరకూ పెట్టుబడి పెట్టా. ప్రత్యామ్నాయ పంటలకు చేతిలో చిల్లిగవ్వ లేదు. ప్రభుత్వం సాయం అందించాలి.

సర్వం కోల్పోయా
మందా స్వామి, కొత్తపేట గ్రామం



14 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నా. మొక్కజొన్న, పత్తి, మినుము, పుల్లశనగ, పెరసర పంటలు సాగు చేస్తున్నా. వరద నీటిలో మునిగి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రభుత్వం పంటనష్టపరిహారం ఇవ్వాలి

ప్రభుత్వమే ఆదుకోవాలి
గంధం స్వామి, గనిఆత్కూరు గ్రామం



మూడెకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశా. వరదలకు పూర్తిగా దెబ్బతిన్నా. పొలం వెళితే మొక్కలు కుళ్లిపోయాయి. పంట తిప్పుకొనే పరిస్థితి లేదు. ప్రభుత్వం ఆదుకుంటే తప్ప కుటుంబం గడవడం కష్టమే.

కోలుకోలేని దెబ్బతిన్నాం
మేకపోతుల వెంకటదుర్గ, అల్లూరు గ్రామం



ఏనుగుగడ్డ వాగు ఆయకట్టులో రెండున్నర ఎకరాల భూమి ఉంది. పత్తి సాగు చేపట్టా. ఇప్పటికే రూ.50 వేలకు పైగా పెట్టుబడి పెట్టా. పంట పూర్తిగా దెబ్బతిన్నది. ప్రభుత్వమే ఆదుకోవాలి.


ఎమ్మెల్యే తాతయ్యతో మాట్లాడుతున్న జాడాన్, తదితరులు

ఆదుకోవాలని ప్రధానిని కోరుతాం

● తాతయ్యతో పంచాయతీ పరిషత్ ప్రతినిధుల భేటీ

జగ్గయ్యపేట, సెప్టెంబరు 15: ఎన్టీఆర్ జిల్లాలో వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించిన అఖిల భారత పంచాయతీ పరిషత్ అధ్యక్షుడు అ శోక్ జాడాన్, రాష్ట్ర పంచాయతీ పరిషత్ అధ్యక్షుడు, జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముల్లంగి రామకృష్ణారెడ్డి, జాయింట్ సెక్రటరి గొల్ల మాల్యాద్రి నాయుడు ఆదివారం మధ్యా హ్నం ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యతో సమావేశమైయ్యారు. విజయవాడతో పాటు పేటలోని బూదవాడ, అన్నవరం, అగ్రహారాన్ని పరిశీలించారు. తాతయ్య మాట్లాడుతూ వరద ప్రభావంతో జిల్లాకు మునుపెన్న డూ లేని నష్టం జరిగిందని, కేంద్ర సహకరిస్తేనే కోలుకునే పరిస్థితి అన్నారు.

జగ్గయ్యపేట రూరల్: వర్షాలు, వరదల కారణంగా కృష్ణా, మున్నేరు, పాలేరు నదులు, వాగులు మునిగి పంట నష్టపోయిన పంట పొలాల్లోని ఇసుక మేట, పంటల సాగు, తాగునీటి వనరులు, బ్రి డ్జిలు, రహదారులు, స్థంభాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫారాలు, బోర్లు, పంపుసె ట్లు నష్టంతో పాటు కలిగిన అపార నష్టాన్ని కేంద్రం సానుకూలంగా ప రిశీలించి ఎన్ఆర్ఈఎస్ ద్వారా ఆదుకునేలా కృషి చేస్తామని అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు అశోక్‌సింగ్ జోడాన్ హామీ ఇచ్చారు. ఆదివారం మండలంలోని బూదవాడ, రెడ్డినాయక్‌తండ, తక్కెళ్లపాడు గ్రామాల్లో టీడీపీ నేతలతో కలిసి పరిశీలించారు. ముల్లంగి రా మకృష్ణారెడ్డి, కట్టా వెంకట నరసింహారావు, కస్తుర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన పూర్తిచేస్తాం: కలెక్టర్

మచిలీపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈనెలాఖరులోగా జిల్లాలోని ఫ్రీహోల్డ్ భూములకు పరిశీలన ప్రక్రియను పూర్తిచేస్తామని కలెక్టర్ బాలాజీ తెలిపారు. రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా, సీసీఎల్‌ఏ ముఖ్యకార్యద ర్శి జయలక్ష్మీ ఆదివారం జిల్లా కలెక్టర్లు, జేసీలతో ఫ్రీహోల్డ్ భూముల పరిశీలనపై వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ జిల్లా లో 682 ఎకరాలను ఫ్రీహోల్డ్ భూములుగా గుర్తించామన్నారు. ఇప్పటివరకు 11.9 ఎకరాలను రిజిస్ట్రేషన్‌చేశామని, 142 ఎకరాలకు రికార్డులను పరిశీలించామన్నారు. నెలాఖరులోపు ప్రక్రియను పూర్తిచేస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ, కలెక్టరేట్ భూ విభాగం సూపరింటెండెంట్ నెల్సన్‌పాల్ పాల్గొన్నారు.

పారదర్శకంగా నష్టం వివరాల నమోదు

● మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ

విజయవాడ లీగల్, సెప్టెంబరు 15: వరద ముంపు ప్రభావం పడిన ప్రాంతంలో చివరి ఫైలు వరకు న్యాయం చేయాలనేదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి బాధితుడికీ అండగా నిలిచేందుకు చేస్తున్న కృషిలో భాగంగా అత్యంత పారదర్శకంగా నష్ట వివరాల నమోదుతో నివేదికలను రూపొందిస్తున్నట్లు మంత్రి పి.నారాయణ అన్నారు. వార్డు సచివాలయాల పరిధిలో డేటా క్రాస్ చెక్ ప్రక్రియపై మంత్రి నారాయణ అధ్యక్షతన ఆదివారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశాలు జరిగాయి. తొలుత ప్రత్యేక అధికారులతోనూ తర్వాత ఎన్యూమరేషన్ బృందాలతోనూ సమావేశం నిర్వహించారు. పుర పాలక శాఖ డైరక్టర్ ఎం.హరినారాయణన్, విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జేసీ డాక్టర్ నిధి మీనా, వీఎంసీ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర పాల్గొన్నారు.

రీ వెరిఫికేషన్‌కూ ప్రాధాన్యం

ముంపు ప్రభావం పడిన ప్రతి ఇంటినీ సందర్శించి, నష్టం నమోదు చేశామని, అర్బన్ పరిధిలో 4,036 మంది ఎన్యూమరేటర్లతో దాదాపు 1,75,000 గృహాలకు సంబంధించి ఎన్యూమరేషన్ చేయడం జరిగిందని, అయితే ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, ఏ ఒక్కరూ మిగిలిపోకుండా నివేదికలు రూపొందించాలనే ఉద్దేశంతో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో రీ వెరిఫికేషన్ ప్రక్రియకూ ప్రాధాన్యమిస్తున్నట్టు రీ వెరిఫికేషన్, సూపర్‌వైజరీ చెక్ ప్రక్రియలకు అధికారులు, సిబ్బంది సందేహాలను మంత్రి నారాయణతో ఉన్నతాధికారులు నివృత్తి చేశారు. ఆర్డీవో బీహెచ్.భవానీ శంకర్, వీఎంసీ అదనపు కమిషనర్ కేవీ సత్యవతి, వార్డు ప్రత్యేక అధికారులు, ఎన్యూమరేటర్ బృంద సభ్యులు పాల్గొన్నారు.


వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన మంత్రి నారాయణ

ముంపు ప్రాంతాల్లో మంత్రి పరిశీలన

వన్‌టౌన్: నిత్యం వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి పొంగూరు నారాయణ పర్యటిస్తూ బాధితుల బాగోగులను తెలుసుకుంటూ వారిలో ధైర్యాన్ని, స్థైర్యాన్ని కల్పిస్తూ ప్రభుత్వం బాధితులకు అండగా ఉంటుందని భరోసా ఇస్తున్నారు. ఆదివారం కండ్రికలో జరుగుతున్న పారిశుధ్య పనులను స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ విజయవాడ పరిస్థితి మెరుగుపడిందన్నారు. మళ్లీ వరద వస్తుందంటూ ప్రజలను భయభ్రాంతులను చేయటం వెనుక వైసీపీ కుట్ర ఉందని భావిస్తున్నామన్నారు. డీజీపీకి ఫిర్యాదు చేశామన్నారు.

రేషన్ మాఫియా మధ్య వార్..!

● అడ్డుకోబోయిన కారును మరో కారుతో ఢీకొట్టిన డాన్ అనుచరులు

ఎ.కొండూరు, సెప్టెంబరు 15: ప్రభుత్వం మారినా రేషన్ మాఫియా అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతుంది. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఒక వ్యక్తి ఐదేళ్ల నుంచి ఎన్టీఆర్ జిల్లా నందిగామ, జగ్గయ్యపేట, వీరులపాడు గంపలగూడె, తిరువూరు, ఎ.కొండూరు, విస్సన్నపేట మండలాల కేంద్రంగా రేషన్ డాన్ తమ ఏజెంట్ల ద్వారా గ్రామాల్లో ఎండీయూ వాహనాల్లో దగ్గర నుంచి బియ్యం సేకరించారు. తిరువూరులో ఉన్న మరో మాఫియా నకిలీ వాట్సప్ విలేఖర్లకు సమాచారం అందజేశాడు. వీరు కారులో ఎ.కొండూరు మండలంలోని జీళ్లకుంట స్టేజీ వద్ద బియ్యం లారీని అడ్డుకున్నారు. రేషన్ డాన్ అనుచరులు బొలేరో కారుతో లారీకి అడ్డుకొన్న కారు ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కొందరికి స్వల్పగాయాలైయ్యాయి. సమాచారం అందుకొన్న పీడీఎస్ డీటీ శ్వేత, పోలీసుల సహకారంతో బియ్యం లారీని కంచికచర్ల వద్ద పట్టుకున్నారు. మరో లారీని పోలిశెట్టిపాడు పెట్రోల్ బంక్ వద్ద పట్టుకొన్నరు.

సివిల్ సప్లయి డీటీ వివరణ

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై సమాచారం మేరకు రెండు లారీలు, 34 టన్నుల బియ్యం స్వాధీనం చేసుకొనని కేసు నమోదు చేసినట్టు తిరువూరు సివిల్‌సప్లల్ డీటీ శ్వేత తెలిపారు. రేషన్ అక్రమ మార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నారు.

రోడ్డుప్రమాదంలో తల్లీకొడుకు దుర్మరణం

విజయవాడ: రామవరప్పాడు రింగ్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో తల్లీకుమారుడు దుర్మరణం చెందారు. కండ్రికలోని పాత రాజీవ్‌నగర్ చెందిన లింగమనేని కృష్ణకుమారి (63), ప్రభుకుమా ర్ (42) తల్లీకొడుకు. ఇద్దరూ కలిసి బైక్‌పై గుణదలలో ఉంటున్న బం ధువుల ఇంటికి బయలుదేరారు. రామవరప్పాడు రింగ్ వద్ద గుణదల వైపునకు తిరుగుతుండగా ఏలూరు నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తల్లీకొడుకు లారీ చక్రాల కింద పడి ప్రాణాలు కోల్పోయారు. కేసును పటమట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కూటమితోనే కాంట్రాక్టర్ల జీవితాల్లో వెలుగులు

పటమట: ఐదేళ్లుగా ప్రభుత్వం చొరవ తీసుకుని కాంట్రాక్టర్ల సమస్యలపై మాట్లాడిందీ, చర్చిందీ లేదని, ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో ఆర్థిక మంత్రి పయ్యావులు కేశవ్ చొరవ తీసుకుని తమతో చర్చించి, పెండింగ్ బిల్లులు తెలుసుకుంటున్నారని కాంట్రాక్టర్లకు చీకటి రోజులు పోయాయ ని స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్(సబ్కా) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ విజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం సబ్కా కృ ష్ణా జిల్లా నూతన కార్యాలయ ప్రారంభోత్సవం ఆత్మీయ సమావేశం గు రునానక్ కాలనీ సమీపంలోని డైరీ కాలనీలో నిర్వహించారు. బిల్డర్స్ అ సోసియేషన్ ఆఫ్ ఇండియా మాజీ ఉపాధ్యక్షులు వల్లభనేని వెంకటేశ్వరరావు, ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ స్మాల్ అండ్ మీడియం ఇండస్ట్రీస్ అసోసియేషన్ అధ్యక్షులు మురళీకృష్ణ పాల్గొన్నారు.

18న స్కూల్ గేమ్స్ అండర్-19 జట్ల ఎంపిక

విజయవాడ స్పోర్ట్సు: స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఉత్వర్వులు ప్రకారం ఉమ్మడి కృష్ణా జిల్లా క్రీడాజట్ల పోటీలను ప్రారంభిస్తున్నట్టు ఉమ్మడికృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ అండర్-19 సెక్రటరీ వేమూరి రవికాంత ఒక ప్రకటనలో తెలిపారు. 18న కృష్ణలంక ప్రభుత్వ జూనియర్ కళాశాలో ఉదయం 9గంటలకు టేబుల్ టెన్నిస్ బాలబాలికలకు, మధ్యా హ్నం 3 గంటలకు స్టేడియంలో పుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపికలను నిర్వహిస్తున్నామన్నారు. వివరాలకు 944011245లో సంప్రదించాలన్నారు.

18న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ

వన్‌టౌన్: బాధ్రపద శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని ఈనెల 18న బుధవారం ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్టు దుర్గగుడి ఈవో రామారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 5.55 గంటలకు ఘాట్ రోడ్డులోని టోల్‌గేట్ వద్ద నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుంది. కుమ్మరిపాలెం సెంటర్, 4 స్తంభాల సెంటర్, సితా ర, కబేలా రోడ్డు, పాల ఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్త పేట, నెహ్రూబొమ్మ సెం టర్, బ్రాహ్మణవీధి, రథం సెంటర్ మీదుగా తిరిగి ఉదయం 9 గంటల కు మహామండపం వద్ద ప్రదక్షిణ ముగుస్తుంది. భక్తులు విరిగిగా పా ల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ప్రతి నెల పౌర్ణమి రోజు గిరి ప్రదక్షిణ దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	129, 138, 149
చికెన్ విత్ స్కిన్	246
చికెన్ స్కిన్‌లెస్	256

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.35

అపూర్వ కలయిక

మొగల్రాజపురం, సెప్టెంబరు 15: బోయపాటి శివ రామకృష్ణయ్య మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాల 1989-90 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ నాగరాజుకు మైక్‌సెట్‌ను బహూకరించారు. భీమవరపు ప్రతాప్, ఎస్.సురేంద్ర వర్మ, పాండురంగారావు, మురళి, యార్లగడ్డ సుబ్బారావు పాల్గొన్నారు.



ఆత్మీయ కలయికలో భాగంగా కలిసిన బీఎస్ఆర్‌కే పాఠశాల 1989-90 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు



మృతుల కుటుంబ సభ్యులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు



12వ డివిజన్‌లో వరద బాధితులకు దుస్తులు పంపిణీ చేస్తున్న గద్దె దంపతులు



ఇస్రాయిల్ పేటలో కిట్ల పంపిణీని ప్రారంభిస్తున్న గద్దె క్రాంతికుమార్



కండ్రికలో భట్రాజు కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేస్తున్న కూరపాటి కూటంరాజు

వరద బాధితులకు అండగా..

ప్రభుత్వం, స్వచ్ఛంద, వ్యాపార సంస్థలు, కుల సంఘాలు

వన్‌టౌన్, సెప్టెంబరు 15: వరద బాధితులకు టీడీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. వరదల కారణంగా సెంట్రల్ నియోజకవర్గంలో మృతిచెందిన 10 మందికి ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున నష్టపరిహార చెక్కులను ఆదివారం మొగల్రాజపురంలోని తన కార్యాలయంలో మృతుల కుటుంబసభ్యులకు ఆయన అందజేశారు. తహసీల్దార్ చింతా శిరీషాదేవి, గంటా కృష్ణమోహన్ పాల్గొన్నారు.

3 వేల మంది బాధితులకు కుప్పం నుంచి సాయం

వరద బాధితులకు ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కుప్పం నుంచి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కుప్పం నియోజ కవర్గ ఇన్‌చార్జి పి.ఎస్.మునిరత్నం, టీడీపీ కుప్పం మండల అధ్యక్షుడు ప్రేమ కుమార్ ఆధ్వర్యంలో తెచ్చిన బక్కెట్లు, మగ్గులు, ప్లేట్లు, దుప్పట్లు, టవల్స్, లుంగీలు, నైటీలు, బ్రష్‌లు, సబ్బులు, సర్ఫ్ ప్యాకెట్లు, శానిటరీ ప్యాడ్లను సెంట్రల్ నియోజకవర్గంలోని 3వేల మందికి ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు పంపిణీ చేశారు.

గణపతి సచ్చిదానంద ట్రస్ట్ ఆధ్వర్యంలో..

టీడీపీ సెంట్రల్ నియోజకవర్గం కార్యాలయంలో గణపతి సచ్చిదానంద స్వామీజీ ట్రస్ట్ కమిటీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 500 మంది వరద బాధితులకు స్టీల్ బిందెలు, దుప్పట్లు, చీరలు, కిట్లను ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అందజేశారు. ట్రస్ట్ సభ్యులు కేవీ రమణరావు, భాగ్యలక్ష్మి, చింతపల్లి లక్ష్మి, లోకాంబ, మల్లెల శుభప్రభ పాల్గొన్నారు.

కండ్రిక కాలనీలో 2 వేల వస్త్రాల కిట్ల పంపిణీ

సీఎం చంద్రబాబు నాయుడు స్ఫూర్తితో కండ్రిక కాలనీలో టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఆయన మిత్రుడు నాల్‌సాఫ్ట్ కంపెనీ చైర్మన్ నల్లూరి శేషయ్య సమకూర్చిన 2 వేల వస్త్రాల కిట్లను వరద బాధితులకు ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, పట్టాభి రామ్, నాల్‌సాఫ్ట్ కంపెనీ ప్రతినిధులు పంపిణీ చేశారు. కిట్లలో దుప్పటి, చీర, టవల్స్, లుంగీలు అందించారు.

40వ డివిజన్‌లో...

బబ్బూరి గ్రౌండ్ కరకట్ట నార్త్ వద్ద నివసిస్తున్న బాధితులకు టీడీపీ 40వ డివిజన్ అధ్యక్షుడు పొనుగుపాటి సుబ్బయ్య ఆధ్వర్యంలో ఏపీ పంచాయతీ పరిషత్ సంయుక్త కార్యదర్శి గోళ్ల మాల్యాద్రినాయుడు, గుంటూరు బత్తిన ప్రసాద్ 200 దుప్పట్లను పంపిణీ చేశారు. గూడురు కొండయ్య, దనేకుల రత్తయ్య, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు అశోక్ సింగ్ జోడెన్, ఏపీ పంచాయతీరాజ్ పరిషత్ అధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు, వెంకటేశ్వర్లు, గాదు గణేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో...

భవానీపురం పోలీస్‌కాలనీ, రామమోహన ఎన్‌క్లేవ్‌లో పశ్చిమ ఎమ్మెల్యే యలమంచిలి సుజనా చౌదరి ఆదేశాలతో బాధితులకు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది, సుజనా ఫౌండేషన్ సిబ్బంది నిత్యావసరాల కిట్లను పంపిణీ చేశారు.

ఆర్థిక సాయం అందజేత

కండ్రిక ప్రాంతంలోని వరద బాధితులైన 36 భట్రాజు కుటుంబాలకు ఆదివారం ఆంధ్రప్రదేశ్ భట్రాజు సంఘం ఆధ్వర్యంలో కండ్రికలోని పట్టాభి ఇంటి వద్ద రూ.1,45,000 అందజేశారు. తర్వాత రాజరాజేశ్వరిపేట ప్రాంతాన్ని సందర్శించి అక్కడ బాధితుల వివరాలను తెలుసుకున్నారు. కూరపాటి కూటంరాజు, భట్టు మనోహర్‌కుమార్, ఏనుగుదాటి రామరాజు, పోరంకి శ్రీనివాసరాజు, చిన కోటంరాజు, లోలబట్టు శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

200 మందికి చీరలు, దుప్పట్ల పంపిణీ

పాయకాపురంలోని రుషి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సింగ్ నగర్ వదర బాధితులు 200 మందికి కెనరా బ్యాంక్ వర్క్‌మెన్ ఎంప్లాయీస్ యూనియన్, లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మెగాసిటీ ఆధ్వర్యంలో చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. లయన్ 316డీ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరిరావు, సీబీఐటీఈ ఏపీ, టీఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాసరావు, బాబు బొమ్మదేవర, పుష్కరుడు, ప్రసాద్, గనిరాజు, గోపాల్, వి.శివకుమార్, శరబండిరావు, టి.కృష్ణ, డేవిడ్, రవికుమార్, సుదీపాల్ రెడ్డి, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం: ఎమ్మెల్యే గద్దె

పటమట: వరద బాధితులకు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పేర్కొన్నారు. 12వ డివిజన్‌లోని సంజయ్ గాంధీనగర్ కాలనీలో వరద బాధితులకు దాతలు శ్రీనివాసరెడ్డి, వసుంధర డైమండ్స్ అందించిన 600 దుప్పట్లు, లుంగీలు, చీరలను జడ్పీ మాజీ చైర్‌పర్సన్ అనురాధతో కలిసి ఆయన వరద బాధితులకు అందజేశారు. పొట్లూరి సాయిబాబు, శాయన సత్యనారాయణ, ఏకాంబరం, కాకరమెట్ల నారాయణ, కె. లక్ష్మీప్రసాద్, కె.రవి, రాజేశ్వరి పాల్గొన్నారు.

500 నిత్యావసరాల కిట్ల పంపిణీ

మొగల్రాజపురం: 8వ డివిజన్ ఇస్రాయిల్‌పేటలో వరద ముంపు బాధితులకు రౌండ్ టేబుల్ ఇండియా, లేడీస్ సర్కిల్ ఇండియా అనుబంధ సంఘాలైన రౌండ్ టేబుల్ 68, విజయవాడ లేడీస్ సర్కిల్ 52, అమరావతి రౌండ్ టేబుల్ 282, అమరావతి లేడీస్ సర్కిల్ 206 సంస్థల ప్రతినిధులు 500 నిత్యావసరాల కిట్లను అందించారు. ఈ కార్యక్రమాన్ని టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ ప్రారంభించారు. కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, డాక్టర్ గుత్తికొండ శ్రీహర్ష, యండూరి అశ్విన్, డాక్టర్ ఆదిత్య నాదెళ్ల, జాస్తి లక్ష్మీపతి, మన్హర్ సేథీ, అలేఖ్య, సమీక్ష పాల్గొన్నారు.

చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ..

వన్‌టౌన్: కండ్రిక ప్రాంతంలో వరద ముంపు బాధితులకు 64వ డివిజన్ టీడీపీ నాయకులు కె.రవి కుమార్, వరలక్ష్మి దంపతులు సొంత నిధులతో 15 రోజుల పాటు భోజనం, తాగునీరు, మందులు అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. కండ్రికలో పారిశుధ్య పనులు, ఇతర అభివృద్ధి పనులు శరవేగంగా జరిపించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు చెబుతూ కండ్రిక సెంటర్ వద్ద ఎమ్మెల్యే ఆధ్వర్యంలో రవికుమార్, వరలక్ష్మి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. వరదల్లో విధులు నిర్వహించి, బాధితులకు అండగా నిలిచిన అన్ని ప్రభుత్వ శాఖల సిబ్బందిని, రవికుమార్, వరలక్ష్మిని ఉమా సత్కరించారు. బాధితులతో పాటు సిబ్బందికి కూడా భోజనాలు ఏర్పాటు చేశారు.



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బొండా ఉమా

ఆటోడ్రైవర్‌కు ఆర్థిక సాయం

వన్‌టౌన్: ఊర్మిళానగర్‌కు చెందిన టీడీపీ 43వ డివిజన్ అధ్యక్షుడు కొనికి కొండయ్య ఆటో వరదల్లో మునిగిపోవడంతో మరమ్మతులు చేయించుకోవడానికి రూ.20వేలను టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న సతీమణి భూలక్ష్మి అందజేశారు. కాంగ్రేగుల రవీంద్ర, ఈగల సాంబ పాల్గొన్నారు.

శిష్టకరణం సాధికార సమితి ఆధ్వర్యంలో..

టీడీపీ శిష్టకరణం సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ అక్కుమహంతి రాజా ఆధ్వర్యంలో సమితి నాయకుడు వీణం శ్రీనివాస్ ఆదివారం 12 కిలోల కూరగాయలు, బియ్యం కిట్లను బాధితుల నివాసాలకు వెళ్లి అందజేశారు. డీఎస్పీ బలివాడ నాగేశ్వరరావు, శివకుమార్ పట్నాయక్, విశాఖపట్నం, గాజువాక, విశాఖ తూర్పు నియోజకవర్గం, పెదన, తుమ్మలపాలెం ప్రాంతాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్‌కు రూ.20 వేలు అందిస్తున్న బుద్దా భూలక్ష్మి



కెనరా బ్యాంక్ వర్క్‌మెన్ ఎంప్లాయీస్ యూనియన్, లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మెగాసిటీ ఆధ్వర్యంలో చీరలు, దుప్పట్ల పంపిణీ



బస్సులు చిట్టినగర్ వైపు వెళ్లకుండా సొరంగం డౌన్‌లో బారికేడ్లు అడ్డుగా పెట్టిన ట్రాఫిక్ పోలీసులు

బస్సుల దారి మళ్లింపు

- ప్రయాణికుల అవస్థలు

భవానీపురం, సెప్టెంబరు 15: విద్యాధరపురం డిపో వైపు నుంచి వచ్చే బస్సులను సొరంగం వైపు రాకుండా చనుమోలు ప్లై ఓవర్‌బ్రిడ్జి మీదుగా పాల ఫ్యాక్టరీ, కలరా ఆస్పత్రి, చిట్టినగర్ మీదుగా మళ్లిస్తున్నారు. దీంతో పశ్చిమ నియోజకవర్గంలోని గట్టు వెనుక ఎనిమిది డివిజన్ల ప్రజలు, గొల్లపూడి పరిసర గ్రామాల ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. సొరంగం డౌన్‌లో చిట్టినగర్ పోలీస్ బీట్ వద్ద 3, 5జే, హెచ్, జీ నంబరు బస్సులు చిట్టినగర్‌వైపు వెళ్లకుండా ట్రాఫిక్ పోలీసులు తాడు కట్టి, బారికేడ్లు అడ్డుగా పెట్టారు. వరద ముంపు తగ్గాక ఇలా చేశారు. బస్సులు చుట్టూ తిరిగి రావడంతో విద్యార్థులకు, సత్యనారాయణపురం, రామకృష్ణాపురం, బస్టాండ్, రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులకు సమయం వృథా అవుతోంది. సొరంగం వైపు నుంచి చిట్టినగర్ వద్ద ట్రాఫిక్‌ను నిలువరించలేక పోలీసులు ఇలా అడ్డంకులు సృష్టించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు, విద్యాధరపురం డిపో అధికారులు మధ్య సమన్వయ లోపం ప్రజలకు శాపంగా పరిణమించిందంటున్నారు. కేబీఎన్, పొట్టి శ్రీరాములు కాలేజీలతో పాటు మార్కెట్, పంజా, గొల్లపాలెం గట్టు, బ్రాహ్మణ వీధి, ఇతర ప్రాంతాలకు వివిధ పనుల నిమిత్తం గట్టెనక ప్రజలు బస్సుల్లో ఇటువైపుగా వెళుతుంటారు. వరదలొచ్చాక విద్యాధరపురం డిపోలో బస్సుల సంఖ్య రూట్లలో తిరగడం తగ్గిపోవడంతో తిరిగే అరకొర బస్సుల కోసమూ ప్రయాణికులు, విద్యార్థులు గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. ట్రాఫిక్ ఉన్నతాధికారులు చిట్టినగర్ వైపు సొరంగం నుంచి వచ్చే బస్సులను నడపాలని కోరుతున్నారు.

కార్ల అద్దాలకు బ్లాక్‌ఫిల్మ్ తొలగింపు

సత్యనారాయణపురం, సెప్టెంబరు 15: వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మూడవ ట్రాఫిక్ సీఐ కె.కిషోర్ బాబు అన్నారు. మూడవ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం కార్ల అద్దాలకు ఉన్న బ్లాక్‌ఫిల్మ్‌ను పోలీసులు తొలిగించారు. కార్ల అద్దాలకు బ్లాక్ ఫిల్మ్ అంటించిన 12 కార్ల ఫిల్మ్ తొలగించామని సీఐ తెలిపారు. కారు నడిపేటప్పుడు సీటు బెల్ట్‌ను ధరించడం అలవాటుగా చేసుకోవాలన్నారు. హెల్మెట్, సీటుబెల్టును వినియోగించడం వల్ల ప్రమాదాల సమయంలో ప్రాణాపాయం నుంచి తప్పించుకునే అవకాశం 90శాతం పెరుగుతుందన్నారు. వాహనాలు నడిపేటప్పుడు రికార్డులు దగ్గర ఉంచుకోవాలన్నారు. ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలకు ప్రభుత్వం నిర్దేశించిన నంబర్‌ప్లేట్లనే వినియోగించాలన్నారు. మూడవ ట్రాఫిక్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



మస్క్యులర్ డిస్ట్రోఫీతో బాధపడుతున్న చిన్నారులకు వీల్‌చైర్లు అందజేస్తున్న ఎస్ఎల్వీ గ్రూప్ సభ్యులు

ఎలక్ట్రికల్ బ్యాటరీ వీల్‌చైర్ల పంపిణీ

గవర్నర్‌పేట, సెప్టెంబరు 15: ఇంజనీర్స్ డేను పురస్కరించుకుని ఆదివారం ఎస్ఎల్వీ గ్రూప్ ఆధ్వర్యంలో మస్క్యులర్ డిస్ట్రోఫీ బాధితులకు ఎలక్ట్రికల్ బ్యాటరీ వీల్ చైర్లను అందజేశారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పెన్మత్స శ్రీనివాసరాజు నేతృత్వంలో సంస్థ కార్యాలయంలో మస్క్యులర్ డిస్ట్రోఫితో బాధపడే పిల్లలకు ఒక్కొక్కటి రూ.50 వేలు విలువైన 5 వీల్ చైర్లను అందజేశారు. అమరావతి రేర్ డిసీజెస్ ఆర్గనైజేషన్ ఫౌండర్ సుంకర శోభారాణి, ఐకాన్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ కొండిశెట్టి రాజేంద్ర, డాక్టర్ దేవరబోయిన అనిల్‌కుమార్, ఫిజియోథెరపీ డాక్టర్ కలపాల ప్రవీణ్, సంస్థ సభ్యులు ఎంవీ పవన్ కల్యాణ్, ముల్పూరి సుందర్ రాజకుమార్, ఎస్. లక్ష్మయ్య, కోట కృష్ణమోహన్, రాఘవ పాల్గొన్నారు.

నెలాఖరులోగా పన్నులు చెల్లించాలి

చిట్టినగర్, సెప్టెంబరు 15: నగర ప్రజలు ఈ అర్ధ సంవత్సరానికి ఆస్తి, ఖాళీ స్థలం, కుళాయి పన్నులను ఈనెల 30వ తేదీలోగా చెల్లించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు. వీఎంసీ, సర్కిల్-3 కార్యాలయాల్లో పన్నుల చెల్లింపు కౌంటర్లు ఏర్పాటు చేశామని, అవి సెలవు రోజుల్లోనూ పని చేస్తాయని ఆయన తెలిపారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

భవానీపురం, సెప్టెంబరు 15: 44వ డివిజన్ చెరువు సెంటర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదును ఆ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ ఆదివారం ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 350 మంది సభ్యులుగా నమోదయ్యారని శ్రీరామ్ తెలిపారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాల రమేష్, బోగవల్లి శ్రీధర్, పచ్చిపులుసు శివప్రసాద్, దుర్గాసి మీరావలి, రెడ్డిపల్లి రాజులు పాల్గొన్నారు.

ఉచితంగా బైక్ మరమ్మతులు

వన్‌టౌన్, సెప్టెంబరు 15: నవ్యాంధ్ర టూ వీలర్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవ్ విజయవాడ పేరుతో సింగ్‌నగర్ గంగానమ్మ గుడి సెంటర్‌లో ఉచిత బైక్ రిపేర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట నుంచి 15 మంది మెకానిక్‌లను రప్పించి ద్విచక్ర వాహనాలకు మరమ్మతులు చేయించారు. వరదలకు పాడైపోయిన వాహనాలతో పెద్ద సంఖ్యలో వాహన యజమానులు తరలివచ్చారు. విజయవాడలో వరద బాధితులకు సాయం చేయాలని 15 మంది మెకానిక్‌లను జగ్గయ్యపేట నుంచి తీసుకొచ్చామని, రాష్ట్ర నాయకుడు సుభానీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని జగ్గయ్యపేట మెకానిక్‌ల సంఘం అధ్యక్షుడు గొల్లపూడి ముక్కు టేశ్వరరావు తెలిపారు.



సింగ్‌నగర్ గంగానమ్మ గుడి వద్ద బైక్‌లను రిపేర్ చేస్తున్న మెకానిక్‌లు

400 కుటుంబాలకు గాండ్ల తెలికుల సంఘం చేయూత

ధర్నాచౌక్: అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో వరద బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీని ఆదివారం గాంధీనగర్‌లోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో నిర్వహించారు. గాండ్ల తెలికుల సంఘానికి చెందిన 400 వరద బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొర్రా మధుసూదన్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవరపల్లి శ్రీనివాసరావు, దేవ తిలకుల రాష్ట్ర సమాఖ్య రాష్ట్ర గౌరవాధ్యక్షుడు చిట్యాల సూర్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

110 కుటుంబాలకు వస్త్రాలు, వంట సామగ్రి

విజయవాడ, రైల్వేస్టేషన్: జ్వలిత డాట్ కామ్ నిర్మాత డాక్టర్ దుట్టా శమంతకమణి ఆధ్వర్యంలో మిత్రుల సహకారంతో 110 వరద బాధిత కుటుంబాలకు వస్త్రాలు, వంటసామగ్రిని పంపిణీ చేశారు. ఆదివారం దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ భవనంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలవరపు సాంస్కృతిక సమితి బాధ్యుడు గోళ్ల నారాయణరావు, మీసాల రాజేశ్వరరావు, తుపాకుల శ్రీనివాస్, దామా హరిబాబు పాల్గొన్నారు.

ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

సత్యనారాయణపురం: సిటీ వైడ్ ప్రభాస్‌ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో వరద బాధితులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. పదిరోజులకు సరిపడా కిట్‌ను బుడమేరు మధ్యకట్ట, విజయదుర్గానగర్ వాసులకు అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపుతో వారం రోజులుగా వరదబాధితులకు సహాయం అందిస్తున్నామని సిటీవైడ్ ప్రభాస్‌ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీకృష్ణంరాజు తెలిపారు. కృష్ణాజిల్లా ప్రభాస్ ఫ్యాన్స్ వీర్ల పవన్‌కుమార్ పాల్గొన్నారు.

వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో వెయ్యిమందికి..

గవర్నర్‌పేట: ఎస్ఎన్ పురం, భవానీపురం ప్రాంతాల్లోని వెయ్యి మంది వరద బాధితులకు భారత వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఆదామి ఇండియా లిమిటెడ్ సహకారంతో సభ్యులు నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు. భారత వికాస్ పరిషత్ అమరావతి ప్రాంత నాయకులు రూప్‌చంద్, కమల్ నయన్, ఎంవీ రామచంద్రావు పాల్గొన్నారు.

500 కుటుంబాలకు నల్గొండ సామాజిక సంస్థల వితరణ

భవానీపురం: అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురంలో 500 వరద బాధిత కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాలు, దుస్తులను ఉమ్మడి నల్గొండ జిల్లాలోని పలు స్వచ్ఛంద సామాజిక సేవా సంస్థలు, రక్తదాతలు పంపిణీ చేశారు. ఫ్రెండ్స్ ఫౌండేషన్, జనమైత్రి, మేధ, సేవా, మదర్‌థెరిస్సా, వసంత హెల్పింగ్ హ్యాండ్స్, ఎస్ఎస్ లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ సంస్థలు పాల్గొన్నాయి.

దుప్పట్ల పంపిణీ..

ఊర్మిళానగర్‌లోని ఉరుముల ట్యాంక్ రోడ్డులోని 300 మంది వరద బాధితులకు న్యాయవాది బెవర ఉమామహేశ్వరరావు సమకూర్చిన దుప్పట్లను చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు ఆర్.మాధవ పంపిణీ చేశారు. టీడీపీ నాయకుడు ఇందుకూరి యువరాజు పాల్గొన్నారు.



శ్రీరామ చంద్రనగర్ కాలనీలో నిమజ్జనానికి ఊరేగింపుగా తరలివెళుతున్న వినాయకుడు



పటమటలంకలో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

ఘనంగా గణపతి నవరాత్రులు

విజయవాడ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పటమటలంకలో తెలుగుయువత ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు వినాయకుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు ప్రారంభించారు. 2వేల మంది భక్తులు అన్నదానంలో పాల్గొన్నారు. ఈనెల 17వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు లడ్డూ వేలం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. అదే రోజున గణనాథుడిని కృష్ణానదిలో నిమజ్జనం చేస్తామని తెలిపారు. ఉత్సవ కమిటీ నేతలు నర్రా కిషోర్, చెరుకూరి సాంబయ్య, బెల్లంకొండ రజని, చెన్నుపాటి గాంధీ, యలమంచిలి దేవేంద్ర, అన్నాబత్తుల అరవింద్, గరికపాటి బద్రీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నిమజ్జనాలు

భారతీనగర్: మూడో డివిజన్‌లో శ్రీరామచంద్రనగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీరామ ధ్యాన మందిరంలో నిర్వహిస్తున్న వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఆదివారం గణేష్ నిమజ్జనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామిని మేళతాళాలతో, తీన్‌మార్ వాయిద్యాలతో కాలనీ పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లారు.

గణపతికి పూలాభిషేకం

గవర్నర్‌పేట: లెనిన్ సెంటర్‌లోని షిరిడి నాగసాయిబాబా, నాగమానసాదేవి మందిరంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహ నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి మందిరంలో గణపతికి లక్షలాది పూలతో అభిషేకం నిర్వహించారు. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో స్వామికి హారతి కార్యక్రమం నిర్వహించారు. అన్నప్రసాద వితరణ చేశారు.

సిద్ధి, బుద్ధి సమేత కల్యాణ గణపతిగా బాలగణపతి

వన్‌టౌన్: పూలబావి వీధిలోని బాలగణపతిస్వామి ఆలయంలో స్వామి సిద్ధి, బుద్ధి సమేత కల్యాణ గణపతి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం సిద్ధి, బుద్ధి అమ్మవార్లతో స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. సహస్రమోదక పూజ నిర్వహించారు. రాత్రి స్వామికి ఊయల సేవ నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రెసిడెంట్ గ్రంధి శ్రీనివాసరావు, సెక్రటరీ మామిడి కృష్ణారావు, జాయింట్ సెక్రటరీ ఆతుకూరి రామనరసింహారావు, ట్రెజరర్ మండేపూడి వేణుగోపాలరావు పాల్గొన్నారు.



ప్రియదర్శినీ కాలనీలో వేడుకలు

భవానీపురం ప్రియదర్శినీ కాలనీలో విఘ్నేశ్వర సేవాసమితి ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అన్నసమారాధన నిర్వహించారు. జనసేన పార్టీ 42వ డివిజన్ అధ్యక్షురాలు తిరుపతి అనూష, తిరుపతి సురేష్, పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయం పీఎస్ పత్తిపాటి శ్రీధర్, పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ పిలుపుతో మట్టి విగ్రహాలు

భవానీపురం: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఆయన పిలుపుమేరకు ఈ ఏడాది వినాయక చవితి ఉత్సవాల్లో పర్యావరణ హితం కోరుతూ అధిక సంఖ్యలో మట్టి విగ్రహాల ఏర్పాటు శుభ పరిణామమని జనసేన రాష్ట్ర కార్యదర్శి మండలి రాజేష్ అన్నారు. డూండీ గణేశ్ సేవా సమితి ఉత్సవాల్లో భాగంగా విద్యాధరపురం లేబర్‌కాలనీ స్టేడియం గ్రౌండ్స్‌లో 72 అడుగుల మట్టి విజయ మహాగణపతిని రాజేష్ దర్శించుకుని పూజలు చేశారు. తిరుపతి సురేష్, రాజేష్, శనివారపు శివ పాల్గొన్నారు.

వెల్లివిరిసిన మత సామరస్యం

- వేలంలో గణపతి లడ్డూను పాడుకున్న ముస్లిం

భవానీపురం: వినాయక చవితి ఉత్సవాల్లో మత సామరస్యం వెల్లివిరిసింది. విద్యాధరపురం చెరువు సెంటర్‌లో ఏర్పాటు చేసిన విగ్రహం ముందు పెట్టిన లడ్డూను లాయర్ షేక్ అన్వర్ రూ.71వేలకు వేలంలో పాడుకున్నారు. టీడీపీ మాజీ కార్పొరేటర్ వెణుతురుమిల్లి హరనాథ్‌స్వామి, స్థానిక పెద్దలు లడ్డూను షేక్ అన్వర్‌కు అందించారు.



షేక్ అన్వర్‌కు లడ్డూ అందజేస్తున్న హరనాథస్వామి

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్

లెటర్ రిపీటెడ్ సిరీస్



వివిధ రకాలైన సిరీస్ పద్ధతులు:

1. abc/bca/cab/abc.
మొదటి సమూహంలో చివరి రెండు అక్షరాలు రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, మొదటి సమూహంలో మొదటి అక్షరం రెండో సమూహంలో చివరి అక్షరంగా ఉన్నది. రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలు మూడో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, రెండో సమూహంలో మొదటి అక్షరం మూడో సమూహంలో చివరి అక్షరంగా ఉన్నది. ఈ విధంగా ఒక క్రమపద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.

2. aaa/bbb/ccc/aaa
ప్రతి సమూహంలో ఒక అక్షరమే మూడుసార్లు ఉన్నది.

3. acac/abab/acac/abab
acac/abab అనే అక్షరాల సమూహాలు రెండుసార్లు రిపీట్ అయ్యాయి.

4. ab/aab/aaab/aaaab
రెండో సమూహాన్ని పరిశీలిస్తే రెండో సమూహం నుంచి ప్రతి సమూహంలోను దాని ముందు సమూహంలోని అక్షరాలతోపాటు ఒక 'a' అదనంగా చేరుతున్నది.

5. abca/abcb/abcc/abca
ప్రతి సమూహంలోను మొదటి మూడు అక్షరాలుగా abcలే రిపీట్ అయ్యాయి. మొదటి సమూహంలో చివరి అక్షరంగా a, రెండో సమూహంలో చివరి అక్షరంగా b, మూడో సమూహంలో చివరి అక్షరంగా c ఉన్నది. ఈ విధంగా కచ్చితమైన పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.

6. abcd/bcda/cdab/dabc/adcb.
మొదటి సమూహంలో చివరి మూడు అక్షరాలు రెండో సమూహంలో మొదటి మూడు అక్షరాలుగా, మొదటి సమూహంలో ఒకటో అక్షరం రెండో సమూహంలో చివరి అక్షరంగా ఉన్నది. రెండో సమూహంలో చివరి మూడు అక్షరాలు మూడో సమూహంలో మొదటి మూడు అక్షరాలుగా, రెండో సమూహంలో మొదటి అక్షరం మూడో సమూహంలో చివరి అక్షరంగా ఉన్నది. ఈ విధంగా ఒక సక్రమమైన చెయిన్ పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.

7. PQQ/QRR/RPP/PQQ
ప్రతి సమూహంలో చివరి రెండు అక్షరాలు ఒకటే.

8. aab/bbc/cca/aab
ప్రతి సమూహంలో మొదటి రెండు అక్షరాలు ఒకటే.

9. ab/abb/abbb/abbbb
రెండో సమూహాన్ని పరిశీలిస్తే రెండో సమూహం నుంచి ప్రతి సమూహంలోను దాని ముందు సమూహంలోని అక్షరాలతో పాటు ఒక 'b' అదనంగా చేరుతున్నది.

ప్రతి సమూహంలో ఒకే విధమైన అక్షరాలు రిపీట్ అవుతున్నాయి. ఇలాంటి సందర్భాలలో ప్రశ్నలకు సమాధానం రాబట్టడానికి కింద తెలిపిన విధానాన్ని అనుసరించవచ్చు.

ఉదా: P - R - Q - P Q - - Q R

ఎ) QPRPR బి) QPRRP

సి) QRPQP డి) ఏదీకాదు

పై ఉదాహరణలో అక్షరాలు, ఖాళీలు మొత్తం 12 ఉన్నాయి. 12 ఉంటే 3 లేదా 4 స్థానాలను ఒక సమూహంగా విభజించాలని తెలియపరచడం జరిగింది గమనించండి.

ముందుగా తక్కువ స్థానాలుగా అంటే 3 స్థానాలుగా విభజించాలి. సరిచూసిన తదుపరి కచ్చితమైన సమాధానం రావడానికి అవకాశం లేనప్పుడు ఎక్కువ స్థానాలుగా అంటే 4 స్థానాలుగా విభజించుకోవాలి.

మొదట మూడేసి అక్షరాలను ఒక్కొక్క సమూహంగా విభజిస్తే P - R / - Q - / PQ - / - QR.

విభజించిన తరవాత గమనించిన మొదటి, మూడో సమూహంలో మొదటి అక్షరం P ఉన్నది. అందువల్ల రెండు, నాలుగు సమూహంలో మొదటి అక్షరం 'P' అవుతుంది. ఇప్పుడు రెండు, నాలుగు సమూహాల్లో మొదటి అక్షరంగా 'P' ఉంచినప్పుడు పై అక్షర క్రమం (లెటర్) కింది విధంగా ఏర్పడుతుంది.

P - R / PQ - / PQ - / PQR

ఇప్పుడు మళ్లీ గమనిస్తే రెండు, మూడు, నాలుగు సమూహాల్లో రెండో అక్షరంగా 'Q' ఉన్నది. కాబట్టి మొదటి సమూహంలో కూడా రెండో అక్షరం 'Q' అవుతుంది. ఇప్పుడు మొదటి సమూహంలో 'Q'ను ఉంచితే పై అక్షర క్రమం(లెటర్ సిరీస్) కింది విధంగా ఏర్పడుతుంది.

PQR /PQ - / PQ - / PQR

ఇప్పుడు మళ్లీ గమనిస్తే మొదటి, నాలుగు అక్షర సమూహంలో మూడో అక్షరంగా R ఉన్నది. అందువల్ల రెండు, మూడో సమూహంలో కూడా మూడో అక్షరం R అవుతుంది. ఇప్పుడు రెండు, మూడో సమూహంలో మూడో అక్షరంగా R ఉంచితే పై అక్షర క్రమం (లెటర్ సిరీస్) కింది విధంగా ఏర్పడుతుంది.

PQR / PQR / PQR /PQR

ఇప్పుడు అక్షర క్రమం పూర్తి అయింది. పైన ఖాళీలలో గల అక్షరాలు QPRRP ఇది సమాధానం అవుతుంది. ఆప్షన్స్‌లో QPRRP అనేది (బి)లో ఉన్నది. సమాధానం (బి) అవుతుంది.

మిగిలిన 6 నుంచి 18 వరకు ఉన్న పద్ధతుల్లో ఐచ్ఛికాల్లో ఇచ్చిన అక్షరాలను ఖాళీల్లో పెట్టుకొని జాగ్రత్తగా పరిశీలించి సమాధానాన్ని కనుగొనాలి. కాబట్టి ఇచ్చిన వివిధ రకాలైన సిరీస్ పద్ధతులను వీలైనన్ని ఎక్కువసార్లు గమనించి దాని కింద ఇచ్చిన వివరణల ఆధారంగా అవి ఏర్పడే విధానాలను అవగాహన చేసుకొని ఈ చాప్టర్‌లోని ప్రశ్నలకు సమర్థవంతంగా సమాధానాలు గుర్తించండి.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

దిక్సూచి
DIKSUCHI

గ్రూప్-1 మెయిన్స్ ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ

ఇండియా వర్సెస్ భారత్
ఒక దేశం రెండు పేర్లు



భారత్ అనే పేరును రాజ్యాంగంలో చేర్చాలని 1949 సెప్టెంబరు 18న నిర్వహించిన రాజ్యాంగ పరిషత్ సమావేశంలో కొందరు సభ్యులు కోరారు. 74 సంవత్సరాలు గడిచిన తరవాత కూడా ఆ చర్చ కొనసాగుతూనే ఉంది. 2023లో భారతదేశంలో కీలకమైన జీ-20 శిఖరాగ్ర సమావేశాల ప్రారంభ సన్నాహాల సందర్భంగా జరిగిన సంఘటనలు/ చర్చలతో ఈ డిమాండ్ మళ్లీ తెరపైకి వచ్చింది.

అయితే ఈసారి చర్చను పరిష్కరించే అంబేద్కర్ లేరు. 2023 సెప్టెంబరులో జీ-20 సమావేశాల సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీ-20 అతిథులకు పంపిన అధికారిక విందు ఆహ్వానంలో 'ద ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా'కు బదులు 'ద ప్రెసిడెంట్ ఆఫ్ భారత్' అని ముద్రించారు. సమావేశాలు నిర్వహించిన ప్రదేశానికి 'భారత మండపం' అని పేరు పెట్టారు. సమావేశాల్లో ప్రధాని ముందున్న నేమ్‌ప్లేట్‌పై భారత్ అని పేర్కొన్నారు. దీంతో 2023 సెప్టెంబరు 18న ప్రారంభమైన పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ఇండియా పేరును భారత్‌గా అధికారికంగా రాజ్యాంగ సవరణ ద్వారా మార్చగలరనే ఊహాగానాలకు దారితీసింది. దీంతో ఒక్కసారిగా ఇండియా/భారత్ అనే పదాలపై ఒకింత ఆసక్తికరమైన చర్చ ప్రజాబాహుళ్యంలోకి వచ్చింది.

గతంలో ఈ అంశంపై మూడు సార్లు సుప్రీంకోర్టులో కేసులు దాఖలైనప్పటికీ, రాజ్యాంగ పరిషత్‌లో తప్ప మళ్లీ ఇంత పెద్ద ఎత్తున ప్రజాబాహుళ్యంలో ఎప్పుడూ చర్చకు రాలేదు. అయితే అందరూ ఊహించినట్లుగా పార్లమెంటులో ఈ అంశంపై ఎలాంటి తీర్మానం ప్రవేశపెట్టకపోవడం గమనార్హం. ఈ సందర్భంగా ఈ అంశంపై రాజ్యాంగ పరిషత్‌లో జరిగిన చర్చల నుంచి నేటివరకు జరిగిన పరిణామాలను ఒకసారి పరిశీలిద్దాం.

రాజ్యాంగ పరిషత్ 1946 డిసెంబరు 9న మొట్టమొదటిసారిగా సమావేశమైనప్పటికీ 1949 సెప్టెంబరు 18 వరకు దేశానికి ఒక 'పేరు'ను ఖరారు చేయలేకపోయింది. దేశానికి పేరుపెట్టే అంశాన్ని కేంద్ర (యూనియన్) రాజ్యాంగ కమిటీకి ఇచ్చింది. ఈ కమిటీ 1947 జూలై 4న జారీ చేసిన నివేదిక ప్రకారం 'ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' పేరును నిర్ణయించారు.

రాజ్యాంగ రచన విధానం

రాజ్యాంగాన్ని రూపొందించడం చాలా క్లిష్టమైన పని. సంక్షిప్తంగా చెప్పాలంటే రాజ్యాంగ పరిషత్ సభ్యులు ముందుగా రాజ్యాంగంలో ఏయే నిబంధనలను రూపొందించాలనే విషయాలను పరిశీలించి నివేదించడానికి అనేక కమిటీలను ఏర్పాటు చేశారు. తదనంతరం ఈ కమిటీలు తమ నివేదికలను సమర్పించాయి. వీటి ఆధారంగా వివిధ నిబంధనలను రూపొందించారు. వీటిని ఉపయోగించి రాజ్యాంగ సలహాదారు సర్ బి.ఎన్.రావు రాజ్యాంగ ముసాయిదాను సిద్ధం చేశారు. ఆ తరవాత ముసాయిదాను డ్రాఫ్టింగ్ కమిటీకి పంపారు. అది దానిపై చర్చించి అవసరమైన మార్పులు, చేర్పులను చేసింది. సవరించిన ముసాయిదాను అసెంబ్లీ, ప్రొవిన్షియల్ లెజిస్లేచర్లు, ప్రొవిన్షియల్ ప్రభుత్వాలు, మంత్రిత్వశాఖలు, ఫెడరల్ కోర్టు, హైకోర్టు సభ్యులకు పంపడంతోపాటు ప్రజల నుంచి విన్నపాలు స్వీకరించడానికి అందుబాటులో ఉంచారు. వారు తమ సూచనలను సమర్పించారు. ఆ తరవాత ముసాయిదా కమిటీ ఛైర్మన్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ దీనిని రాజ్యాంగ పరిషత్ అధ్యక్షునికి సమర్పించారు. ముసాయిదా రాజ్యాంగంపై సుదీర్ఘంగా చర్చించి, దానికి మార్పులు, చేర్పులు చేశారు. ఈ సవరణల ఫలితంగా భారత రాజ్యాంగం రూపుదిద్దుకుంది.

'భారత రాజ్యాంగంలో రాష్ట్రాల యూనియన్' అనే భావన కెనడియన్(బ్రిటిష్ నార్త్-అమెరికన్) చట్టం నుంచి స్వీకరించారు. బలమైన కేంద్రంతో కూడిన సమాఖ్యను ఏర్పర్చడానికి రాజ్యాంగంలో 'రాష్ట్రాల యూనియన్' అనే పదాలను పొందుపరిచారు.

రాజ్యాంగ పరిషత్ 1946 డిసెంబరు 9న మొట్టమొదటిసారిగా సమావేశమైనప్పటికీ 1949 సెప్టెంబరు 18 వరకు దేశానికి ఒక 'పేరు'ను ఖరారు చేయలేకపోయింది. దేశానికి పేరుపెట్టే అంశాన్ని కేంద్ర(యూనియన్) రాజ్యాంగ కమిటీకి ఇచ్చింది. ఈ కమిటీ 1947 జూలై 4న జారీ చేసిన నివేదిక ప్రకారం 'ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' పేరును నిర్ణయించారు.

'భారత రాజ్యాంగంలో రాష్ట్రాల యూనియన్' అనే భావన కెనడియన్(బ్రిటిష్ నార్త్-అమెరికన్) చట్టం నుంచి స్వీకరించారు. బలమైన కేంద్రంతో కూడిన సమాఖ్యను ఏర్పర్చడానికి రాజ్యాంగంలో 'రాష్ట్రాల యూనియన్' అనే పదాలను పొందుపరిచారు.

భరత్‌వర్ష్ అని పేర్కొనాలి

ఆర్టికల్-1(1) కింద ఈ రాజ్యాంగం ప్రారంభమైన తేదీ నుంచి ఇండియా ఒక సమాఖ్యగా ఉంటుందని సలహాదారు సర్ బి.ఎన్.రావు పేర్కొన్నారు. అయితే బి.ఎన్.రావు ముసాయిదా పంపిణీ చేసినప్పుడు ఈ రాజ్యాంగం ప్రారంభం నుంచి భారతదేశం రాష్ట్రాల యూనియన్‌గా ఉంటుందన్న వివరణను చేర్చాలని కేంద్ర రాజ్యాంగ కమిటీ సిఫార్సు చేసింది. ఈ సిఫార్సును చివరికి ముసాయిదా కమిటీ రూపొందించిన రాజ్యాంగ ముసాయిదాలో చేర్చారు. ఈ ముసాయిదాను సభ్యులకు సర్క్యులేట్ చేసినప్పుడు ఉపేంద్రనాథ్ బర్మన్ ఇండియాకు బదులుగా 'భరత్‌వవర్ష్' అనే పదాన్ని డ్రాఫ్ట్ అంతటా ఉపయోగించాలని కోరారు. ఈ సూచనను ముసాయిదా కమిటీ తిరస్కరించింది. కారణం ఇండియా అనే పదం ప్రస్తుతం ఒకటిన్నర శతాబ్దాలకు పైగా వాడుకలో ఉండటమే కాకుండా అంతర్జాతీయంగా కూడా ప్రసిద్ధి చెందింది. కాబట్టి ముసాయిదా అంతటా దానిని భరత్‌వర్ష్‌గా మార్చడం మంచిది కాదని రాజ్యాంగ పరిషత్‌కు సమర్పించిన చివరి ముసాయిదాలో ఇండియా అనే పదాన్ని ఉపయోగించారు.

ఆర్టికల్-1 : ఇండియా అది భారత్: ఆర్టికల్-1పై రాజ్యాంగ పరిషత్‌లో సుదీర్ఘంగా చర్చ జరిగింది. శిబ్బన్‌లాల్ సక్సేనా ఇండియాను భరత్‌వర్ష్ అని సంబోధించేలా అనేక సవరణలను ప్రవేశపెట్టారు. ఉదాహరణకు 1948 నవంబరు 15న 'యూనియన్ పేరు భారత్' అని ఒక సవరణను ప్రవేశపెట్టారు. అలాగే రాజ్యాంగ అధికారులను కాన్‌స్టిట్యూషనల్ ఆఫీసర్స్ ఆఫ్ ఇండియాగా కాకుండా, కాన్‌స్టిట్యూషనల్ ఆఫీసర్స్ ఆఫ్ భారత్‌గా సంబోధించాలని కోరారు. అదేవిధంగా చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియాను చీఫ్ జస్టిస్ ఆఫ్ భారత్‌గా సంబోధించాలని సవరణలను ప్రవేశపెట్టారు. అయితే ఆయన ప్రవేశపెట్టిన సవరణ తీర్మానాలన్నింటినీ రాజ్యాంగ పరిషత్ తిరస్కరించింది.

- 1949 సెప్టెంబరు 17న రాజ్యాంగ పరిషత్ సభా సమావేశం ముగియడానికి అరగంట మాత్రమే మిగిలి ఉంది. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఇండియా అనే పేరును తాను ఇష్టపడతానని స్థిరంగా పేర్కొన్నాడు. చరిత్ర అంతటా, గత సంవత్సరాల్లో భారతదేశాన్ని ఇండియాగా పిలిచేవారు. 'యుఎన్'లో సభ్యునిగా మన దేశం పేరు ఇండియా అని అనేక అంతర్జాతీయ ఒప్పందాలపై ఇండియా అనే పేరుతోనే సంతకం చేసిందని పేర్కొన్నాడు. అయితే ఆశ్చర్యకరంగా 1949 సెప్టెంబరు 17న ఆర్టికల్ '1'ని సవరిస్తూ 'ఇండియా అది భారత్' అని సవరణను ప్రవేశపెట్టారు. ఈ మార్పుపై డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఎలాంటి వివరణను ఇవ్వలేదు.



డాక్టర్ సుంకర రమాదేవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్

వైభవంగా జైనుల శోభాయాత్ర



వన్‌టౌన్‌లో జైనుల శోభాయాత్ర

వన్‌టౌన్, సెప్టెంబరు 15: పర్యూషన్ పర్వదినాలను పురస్కరించుకుని నగరంలోని జైనులు ఆదివారం కన్నులపండువగా శోభాయాత్రను నిర్వహించారు. సంభవనాథ్ జైన్, శ్వేతాంబర్ మూర్తి పూజక్ సంఘ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గుర్రపు బగ్గీపై పూలతో అలంకరించిన వేదికపై మహావీర్ విగ్రహాన్ని ఉంచి ఊరేగించారు. అలాగే పర్యూషన్ పర్వదిన సందర్భంగా ఎక్కువ రోజులు ఉపవాస దీక్షలు చేసిన జైను కుటుంబ సభ్యులను కూడా గుర్రపు బగ్గీలలో ఊరేగించారు. సంకీర్తనలతో జైన భక్తులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ఆయా వీధుల్లో నివాసం ఉంటున్న జైనులు సంప్రదాయ పద్ధతిలో నేలపై పీఠాన్ని ఉంచి బియ్యంతో మహావీరుని మంత్రాన్ని రాస్తూ ఊరేగింపులో ఉన్న గుర్రపు బగ్గీపై చల్లుతూ స్వాగతం పలికారు. జైనులు మహావీర్ భగవానుడు నామాన్ని స్మరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా జైన గురువు పన్యాస్ ప్రవర్ భక్తిరత్న, భాగ్యచంద్ర, భక్తిదర్శన్ విజయాజీలు మాట్లాడుతూ జైన ఉపవాస దీక్షలు చేసిన వారిని సన్మార్గంలోకి తీసుకువెళతాయన్నారు. ఆకలిదప్పికల విలువను తెలుసుకోవటంతోపాటు భగవంతునిపై మనస్సును లగ్నం చేయటం ఇందులో విశేషం అన్నారు. ఊరేగింపు వివిధ ప్రాంతాల్లో తిరిగి మార్వాడీ గుడి సందులోని ఆరాధనా భవన్‌కు చేరుకుంది. ఈ కార్యక్రమంలో సాధ్వి హితదర్శనాశ్రీజి ట్రస్ట్ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ బోడోతరియా, ఉపాధ్యక్షులు అశోక్ జైన్, జయంతిలాల్ జైన్, కార్యదర్శి పన్నాలాల్ జైన్, సహాయ కార్యదర్శి భోగిలాల్ జైన్, కోశాధికారి డుంగర్‌మన్ జైన్, సహకోశాధికారి రాహుల్ జైన్, అధికార ప్రతినిధి ప్రవీణ్ రాజా తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఘనంగా ఇంజనీర్ల దినోత్సవం



విశ్వేశ్వరయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నీటి పారుదల శాఖ ఇంజనీర్లు, సిబ్బంది

గవర్నర్‌పేట, సెప్టెంబరు 15: మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని నీటి పారుదల కార్యాలయం ప్రాంగణంలోని రైతుల శిక్షణా కేంద్రంలో ఇంజనీర్ల దినోత్సవ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏపీ ఇంజనీర్స్ అసోసియేషన్, ఏపీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ అసోసియేషన్, ఏపీ అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇంజనీర్-ఇన్-చీఫ్ (నీటి పారుదల) ఎం.వెంకటేశ్వరరావు, ఇంజనీర్- ఇన్-చీఫ్ (పరిపాలన) కె.శ్రీనివాస్, నేతలు తిరుమలరావు, శివప్రసాద్ రెడ్డి, వీవీ ప్రవీణ్ రాజు, పి.శ్రీనివాసరావు, అపెక్స్ కమిటీ మాజీ సభ్యుడు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణ పాల్గొన్నారు.

కమిషనరేట్‌కు కొత్త ఏసీపీలు

విజయవాడ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌కు కొత్త ఏసీపీలు రాబోతున్నారు. రాష్ట్రంలో పలువురు డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ ద్వారకాతిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు సీసీఎస్ ఏసీపీగా ఉన్న స్రవంతిరాయ్‌ను ఉత్తర మండలానికి, ఏసీబీ డీఎస్పీగా ఉన్న యు.బంగార్రాజును దక్షిణ మండలం ఏసీపీగా బదిలీ చేశారు. ఇంటెలిజెన్స్‌లో పనిచేస్తున్న ఎస్ఎస్‌వీకే దుర్గారావును పశ్చిమ మండలం ఏసీపీగా నియమించారు. దుర్గారావు ఇదే జోన్‌లో కొత్తపేట ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. ఇంటెలిజెన్స్‌లో ఉన్న వై.ప్రసాదరావును మైలవరం ఏసీపీగా నియమించారు. వెయిటింగ్‌లో ఉన్న వీవీ అప్పారావును సిటీ స్పెషల్‌బ్రాంచ్ 2 ఏసీపీగా నియమించారు.

ముఠా కార్మికుడి మృతదేహం లభ్యం



పోలినాయుడు (ఫైల్)

వన్‌టౌన్, సెప్టెంబరు 15: బుడమేరు వరద నీటిలో కొట్టుకుపోయిన న్యూరాజ రాజేశ్వరి పేటకు చెందిన ముఠా కార్మికుడు కె.పోలినాయుడు మృతదేహం ఆదివారం లభించింది. పోలినాయుడు రాజీవ్ గాంధీ కూరగాయల మార్కెట్‌లో ముఠా కూలీగా పనిచేస్తున్నాడు. ఈ నెల 1వ తేదీన స్నేహితుడితో కలిసి పనులు ముగించుకుని ఇంటికి వస్తూ వరదలో కొట్టుకుపోయాడు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు పోలినాయుడు కోసం వెతుకుతూనే ఉన్నారు. ఎట్టకేలకు ఆదివారం ఇంటి సమీపంలోని చెట్టు కొమ్మకు ఇరుక్కున్న పోలినాయుడు మృతదేహం బయట పడింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని సీపీఎం నేత సిహెచ్.బాబూరావు సందర్శించి నివాళులర్పించారు.

జాతీయ వాటర్ పోలో చాంపియన్‌షిప్‌కు స్విమ్మర్లు

విజయవాడ స్పోర్ట్సు, సెప్టెంబరు 15 : కేరళ రాష్ట్రం త్రివేండ్రంలో ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు జరిగే 77వ సీనియర్ వాటర్ పోలో చాంపియన్‌షిప్‌లో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల నుంచి 10 మంది ఎంపికయ్యారని ఎన్టీఆర్ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ సెక్రటరీ ఐ.రమేష్ తెలిపారు. బాలుర విభాగంలో కె.కె.జార్జ్, కె.జాన్సన్, వి.గిరిష్, బి.జిష్ణేష్, బాలికల విభాగంలో వి.శృతి శిరీషా, ఎం.దేవి దుర్గా సుధీషా, డి.మానస, బి.హర్షిత, బి.హర్షశ్రీ, ఎం.లక్ష్మి పావని ఎంపికైనవారిలో ఉన్నారని పేర్కొన్నారు. వీరిని గాంధీనగర్ వీఎంసీ స్విమ్మింగ్ పూల్ ఇన్‌చార్జి ఎం.రాంబాబు, కోచ్‌లు మాల్యాద్రి, రఫీ, లక్ష్మణరావు అభినందించారు.

జనద్రోహి జగన్ : టీడీపీ రాష్ట్ర నేత గన్నే

వన్‌టౌన్, సెప్టెంబరు 15: నవ్యాంధ్రప్రదేశ్‌కు గత ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలన వల్లే వరద విపత్తు వచ్చిందని, జగన్ జనద్రోహి అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాలను గాలికి వదిలిపెట్టి అడ్డగోలుగా సంపాదించుకున్నారని ఆరోపించారు. సాగునీటి ప్రాజెక్టులను ఏమాత్రం పట్టించుకోకుండా బుడమేరును కబ్జా చేశారన్నారు. రివర్స్ టెండరింగ్‌తో ఏలేరు రిజర్వాయర్ పనులను నిలిపివేయడమే నేటి విపత్తులకు కారణమైందన్నారు. చంద్రబాబు నాయకత్వంలో అధికార యంత్రాంగం కష్టపడి పని చేయడంతో పెనుప్రమాదాలు తప్పాయన్నారు.

సీఎం సహాయ నిధికి విరాళాలు

వన్‌టౌన్, సెప్టెంబరు 15: బుడమేరు వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి నున్న గ్రామానికి చెందిన సాదం శ్రీనాథ్ రూ.3,51,000, భీమవరపు సంపత్ రెడ్డి రూ.3,51,000 రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి కొలుసు పార్థసారధికి ఆదివారం అందజేశారు. నున్న ఎన్‌టీపీసీ సమీపంలో సాదం శ్రీనాథ్ ఆధ్వర్యంలో జరిగిన వినాయక చవితి వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి పార్థసారధి దాతలను అభినందించారు.

ప్రభుత్వం మారినా పెత్తనం మాదే

- ఎక్సైజ్‌లో వైసీపీ అధికారుల పైరవీలు
- గత ప్రభుత్వంలో కీలక స్థానాలతో హవా
- నాడు విశాఖలో ఓ అధికారిపై తీవ్ర ఆరోపణలు
- విజయసాయి ద్వారా సంక్షేమశాఖలోకి డిప్యుటేషన్
- ఇప్పుడు ఎక్సైజ్‌లో మళ్లీ విశాఖ కావాలని పైరవీ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం మారినా కీలక స్థానాలు మాకే కావాలని ఎక్సైజ్ శాఖలో కొందరు వైసీపీ అధికారులు పట్టుబడుతున్నారు. గత ప్రభుత్వంలో ఎంపీ విజయసాయిరెడ్డి, బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డిలతో అంటకాగిన వీరు... ఇప్పుడు మళ్లీ చక్రం తిప్పాలని ప్రయత్నిస్తున్నారు. విచిత్రంగా వైసీపీ అధికారుల్లో కొందరికి టీడీపీ ఎమ్మెల్యేలు మద్దతిస్తున్నారు. దీంతో ఎక్సైజ్ శాఖలో గందరగోళ వాతావరణం నెలకొంది. గత ప్రభుత్వంలో ఓ అధికారి విశాఖపట్నంలో హల్‌చల్ చేశారు. విజయసాయిరెడ్డి ద్వారా పైరవీ చేసుకుని సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందారు. ఆ తర్వాత నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ వ్యవహారంలో తలదూర్చారు. ఈ వ్యవహారంలో ఆయనను సస్పెండ్ చేయాలని ఉన్నతాధికారులు ప్రయత్నించగా, విజయసాయిరెడ్డి అండదండలతో బదిలీపై వెళ్లిపోయారు. మళ్లీ ఆయన ద్వారానే సంక్షేమ శాఖలోకి డిప్యుటేషన్‌పై విశాఖ చేరారు. ఇప్పుడు మళ్లీ ఎక్సైజ్‌లో తనకు విశాఖపట్నం పోస్టింగ్ కావాలని పైరవీ చేస్తున్నారు. విశాఖలోని ఓ సీనియర్ ఎమ్మెల్యే ద్వారా చక్రం తిప్పుతున్నారు. గతంలోనూ ఈ అధికారిపై అనేక అవినీతి ఆరోపణలున్నాయి. ఏసీబీ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. అలాంటి అధికారికి ప్రస్తుత ఎమ్మెల్యే మద్దతివ్వడంపై ఎక్సైజ్‌లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

నేను విశాఖకు వస్తా...

ఉత్తరాంధ్రలో అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న మరో వైసీపీ అధికారి కూడా విశాఖపట్నంపైనే కన్నేశారు. గతంలో ఆ అధికారి విశాఖపట్నంలో పనిచేసి విజయసాయిరెడ్డికి అత్యంత సన్నిహిత వ్యక్తిగా ముద్రపడ్డారు. బార్ పాలసీ సమయంలో విశాఖపట్నం నగరంలో ఎవరు దరఖాస్తు చేసుకోవాలనేది కూడా ఆయన నిర్ణయించారు. టీడీపీకి చెందిన వారిని దరఖాస్తులు చేయకుండా అడ్డుకున్నారు. ఓ దశలో ఉన్నతాధికారులను కూడా లెక్క చేయకుండా, ఆ శాఖపై పెత్తనం చేశారు. చివరికి పదోన్నతి రావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో విశాఖపట్నం వదిలేసి వెళ్లారు. ఇప్పుడు మళ్లీ అక్కడకు వచ్చేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

వాసుదేవరెడ్డి సన్నిహితులు

ఉమ్మడి గుంటూరు జిల్లా, నెల్లూరు, ఇతర కోస్తా జిల్లాల్లో పనిచేస్తున్న నలుగురు ఎక్సైజ్ సూపరింటెండెంట్ స్థాయి అధికారులు బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డికి అత్యంత సన్నిహితులుగా వ్యవహరించారు. వీరిలో ఒకరు వాసుదేవరెడ్డి అవినీతి సొమ్ముకు బినామీగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికీ ఆయనతో ఆర్థిక లావాదేవీలు కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ అధికారి గుంటూరు పోస్టింగ్ కావాలని ప్రయత్నిస్తున్నారు. గత ప్రభుత్వంలో కీలక స్థానాల కోసం ఓ ఎంపీ ద్వారా ఆర్థిక లావాదేవీలు చేసిన అధికారులు ఇప్పుడు కోస్తాలో కీలకమైన జిల్లాలపై కన్నేశారు. ప్రభుత్వం మారినా మీకు అనుకూలంగా పనిచేస్తామని, గత ప్రభుత్వంలో తరహాలోనే అన్ని విధాలుగా మేలు చేస్తామంటూ పైరవీలు చేస్తున్నారు. వీరికీ కొందరు టీడీపీ ఎమ్మెల్యేలు మద్దతిస్తున్నట్లు సమాచారం. ఇక గుంటూరు పోస్టింగ్ కోసం అన్ని స్థాయిల్లోనూ పైరవీలు పెరిగాయి. డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మూడు పోస్టులకూ అనేక మంది పోటీ పడుతున్నారు.



అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం ంరాచపల్లి కూడలి వద్ద ఏలేరు కాలువ గండి పూడ్చివేత పనులు

ఏలేరు కాలువకు గండి

వెంటనే స్పందించిన జీవీఎంసీ అధికారులు.. గండి పూడ్చివేత

మాకవరపాలెం (అనకాపల్లి జిల్లా), సెప్టెంబరు 15: కాకినాడ జిల్లా ఏలేరు రిజర్వాయర్ నుంచి విశాఖ నగరానికి తాగునీరు సరఫరా చేసే కాలువకు గండి పడింది. అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం రాచపల్లి కూడలికి సమీపంలో 99.6 కిలోమీటరు వద్ద ఆదివారం ఉదయం సుమారు పది మీటర్ల వెడల్పున భారీ గండిపడింది. అయితే పక్కనే జాగారాల గెడ్డ ఉండడంతో, నీరంతా దానిలోకి ప్రవహించడంతో పంట పొలాలు ముంపుబారిన పడలేదు. సమాచారం అందుకున్న మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) అధికారులు వెంటనే స్పందించారు. హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఎక్స్‌కవేటర్లను రప్పించి ఇసుక బస్తాలు, సరుగుడు కర్రలతో గండి పూడ్చివేత పనులు చేపట్టారు. కాగా, ఈ ప్రదేశంలో గతంలో కూడా పలుమార్లు గండ్లు పడినట్టు స్థానికులు చెబుతున్నారు. మాకవరపాలెం మండలంలో పలుచోట్ల ఏలేరు కాలువ గట్లు బలహీనంగా ఉన్నాయని, గండ్లు పడే ప్రమాదం ఉన్నందున వీటిని పటిష్ఠం చేయాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
సోమవారం ● 16 సెప్టెంబరు 2024
features@andhrajyothy.com



ఆకలి తీర్చడానికి చానెల్ ఈదింది!

పేద పిల్లల ఆకలి తీర్చాలి, తనలాంటి మరికొం దరికి స్ఫూర్తిగా నిలవాలి.. ఇవీ ప్రిషా తప్రే కలలు. వాటిని ఒకేసారి నెరవేర్చుకుంది పదహారేళ్ల ఈ బ్రిటిష్-ఇండియన్. గజ ఈతగాళ్లకే సవాల్ విసిరే ఇంగ్లీష్ ఛానెల్‌ని ఈదిన ఈ ధీశాలి... తన సాహస యాత్రను ఇలా కొనసాగిస్తానంటోంది.



"కల్లోలంగా ఉన్న నీరు, చుట్టూ చీకటి.. 'గమ్యం వరకూ చేరగలనా?' అనే సందేహం... కానీ ఎలాగైనా సాధించాలనే పట్టుదల... ఇంగ్లీష్ ఛానెల్‌ను ఈదుతున్నప్పుడు మొదటి రెండు గంటలు నేను ఎదుర్కొన్న పరిస్థితులివి. స్విమ్మింగ్‌లో ఇప్పటివరకూ నాకు అత్యంత దుర్భరమైన అనుభవం ఇది" అంటోంది ప్రిషా తప్రే. ఈ నెల నాలుగో తేదీన... బ్రిటన్‌లోని డోవర్ నుంచి క్యాప్ గ్రిస్ నెజ్ వరకూ... ఇంగ్లీష్ ఛానెల్‌లో 34 కిలోమీటర్లు ఈత కొట్టిన ఆమె ఒడ్డుకు చేరగానే... అక్కడ ఉన్న జనసందోహం కేరింతలతో స్వాగతం పలికింది. ఆ హర్షాతిరేకాలు ఆమె సాహసానికి మాత్రమే కాదు, ఔదార్యానికి కూడా.

> "నేను ఇంగ్లీష్ ఛానెల్ ఈదానంటే ఇంకా నమ్మలేకపోతున్నా. చదువును, స్విమ్మింగ్ శిక్షణను జాగ్రత్తగా బ్యాలెన్స్ చేసుకోవడం వల్లే ఇది సాధ్యమయింది. కొన్నిసార్లు ఆరు నుంచి పది గంటలు శిక్షణలోనే ఉండేదాన్ని. నాకు మా అమ్మ స్ఫూర్తి. నా వయసులో ఆమె మంచి అథ్లెట్. ఏదైనా అనుకుంటే సాధించే వరకూ విశ్రమించవద్దని ఎప్పుడూ చెబుతూ ఉంటుంది. నన్ను నేను నిరూపించుకోవడానికి ఏదైనా పెద్ద పని చెయ్యాలనుకున్నాను. ఏదైనా భిన్నంగా చెయ్యాలనుకున్నాను. నన్ను నేను సవాల్ చేసుకోవాలనుకున్నాను. జీవితంలో ఈ రోజు కోసం చాలా కష్టపడ్డాను. ఇప్పుడు అందరూ అభినందిస్తూ ఉంటే... సంతోషంగా అనిపిస్తోంది. నా జర్నీలో ఇది ఆరంభం మాత్రమే."

ప్రిషాది కొన్నేళ్ల క్రితం బ్రిటన్‌లో స్థిరపడిన మహారాష్ట్రియన్ కుటుంబం. అక్కడే పుట్టిన ప్రిషా ప్రస్తుతం లండన్‌లోని బుషే మీడ్స్ స్కూల్‌లో చదువుతోంది. ఆమెకు చిన్న వయసులోనే స్విమ్మింగ్‌ను పరిచయం చేశారు తల్లితండ్రులు." మా ఇంటికి దగ్గరలో ఒక చెరువు ఉంది. అక్కడ చాలామంది ఈత కొడుతూ ఉంటారు. సాయంత్రం కాసేపు స్విమ్మింగ్ ప్రాక్టీస్ చెయ్యడం నా దినచర్యలో భాగమైపోయింది" అని చెబుతోంది ప్రిషా. ఆమె ఆసక్తిని గమనించిన తల్లితండ్రులు స్థానికంగా ఉన్న వాట్‌ఫోర్డ్ స్విమ్మింగ్ క్లబ్‌లో చేర్పించారు. క్రమంగా ఆమె ప్రావీణ్యాన్ని సంపాదించుకుంది. కానీ.. గజ ఈతగాళ్లకు సైతం సవాల్‌గా నిలుస్తూ, ఈదడానికి సంకోచించేలా చేసే ఇంగ్లీష్ ఛానెల్‌ను ఒంటరిగా దాటాలనే ఆలోచన ఆమెకు ఎలా కలిగింది?

అప్పుడే నిర్ణయించుకున్నా...

నాలుగేళ్ల క్రితం మా కుటుంబ సభ్యులందరూ కూర్చొని మాట్లాడుతూ ఉండగా... ఇంగ్లీష్ ఛానెల్ గురించి చర్చ వచ్చింది. ప్రతి సంవత్సరం వందలాది మంది ఈతగాళ్ళు ఇంగ్లీష్ ఛానెల్ ఈదడానికి వస్తారనీ, వారిలో కొందరు ప్రాణాలు కోల్పోతూ ఉంటారనీ తెలిసింది. అది వినగానే... ఎప్పటికైనా దాన్ని ఈదాలని నిర్ణయించుకున్నాను. అయితే దానికి ప్రేరణ మాత్రం... నేను వివిధ మాధ్యమాల ద్వారా తెలుసుకున్న ఆవేదనాభరితమైన విషయాలు. ప్రపంచంలోని చాలా దేశాల్లో పేదరికం, ఆకలి కారణంగా ఎందరో పిల్లలు ప్రతిరోజూ మరణిస్తున్నారు. వారికి నేను ఏ విధంగా సాయపడగలనని ఆలోచించేదాన్ని. నావంతుగా నిధులు సేకరించాలనుకున్నాను. ఇంగ్లీష్ ఛానెల్‌ను ఈది... ఆ సందర్భాన్ని విరాళాల కోసం ఉపయోగించుకోవాలని నిర్ణయించుకున్నాను" అని వివరించింది ప్రిషా. ఆగకుండా అంత దూరం ఈదాలంటే ఎంతో దారుఢ్యం, మనోనిబ్బరం ఉండాలి. రెండు, మూడు గంటలతో ప్రారంభించి... ఎనిమిది, తొమ్మిది... చివరిగా పన్నెండు, పదమూడు గంటలు ఈదడం సాధన చేసింది. దీనికి ఆమె కోచ్‌లు ఎంతో సహకరించారు. చివరకు ఆ రోజు రానేవచ్చింది.

నిద్రపోతానేమో అనిపించింది...

ప్రిషా ప్రయత్నం గురించి తెలుసుకున్న క్రీడాభిమానులు, స్థానికులు డోవర్ దగ్గరకు వచ్చి శుభాకాంక్షలు చెబుతూండగా... ఆమె ఇంగ్లీష్ ఛానెల్‌లో దూకింది. కానీ పరిస్థితులతో సర్దుకోడానికి రెండుగంటలు పట్టింది. "ఈత కొట్టేటప్పుడు మొదటి రెండు గంటలూ ఎప్పుడూ కష్టంగానే ఉంటుంది. ఎందుకంటే రాబోయే కొన్ని గంటలు అక్కడే ఉండాలనే నిజం మీ ఆలోచనల్ని నిలవనివ్వకుండా చేస్తుంది. నేను ఈత కొడుతున్న సమయంలో నిద్రవచ్చినట్లనిపించింది. నా కళ్ళు మూసుకొని, నిద్రలోకి జారిపోతానేమో అనిపించింది. ఎందుకంటే నేను చీకట్లో మొదలుపెట్టాను. కానీ కొద్ది సేపటికి ఆకాశంలోకి సూర్యుడు వచ్చాడు. నా నిద్ర ఎగిరిపోయింది. తొలి రెండు గంటల తరువాత... వాతావరణ పరిస్థితులు మారిపోయాయి. గాలి తీవ్రత, నీటిలో కల్లోలం తగ్గిపోయాయి. నేను కోరుకున్నదీ అలాంటి వాతావరణాన్నే" అంటోందామె. 11 గంటల 48 నిమిషాలు ఈది... గమ్యానికి చేరుకున్న ప్రిషా... ఇంగ్లీష్ ఛానెల్‌ను ఈదిన అతి పిన్నవయస్కురాలైన బ్రిటిష్-ఇండియన్‌గా గుర్తింపు పొందింది. తన సాహసంతో 3,700 పౌండ్లు (దాదాపు నాలుగు లక్షల రూపాయలకు పైగా) సేకరించింది. దాన్ని బ్రిటన్‌లో, ఇండియాలో పేద పిల్లల ఆకలి తీర్చడం కోసం 'అక్షయపాత్ర ఫౌండేషన్'కు విరాళంగా ఇచ్చింది. నేను దీన్ని సీరియస్‌గా తీసుకోవడానికి మరో ప్రధాన కారణం... ఇక్కడున్న ఆసియన్ కమ్యూనిటీని క్రీడల దిశగా ప్రోత్సహించడం. ఆసియన్ అమ్మాయిల్లాంటి జాతిపరమైన మైనారిటీలు స్విమ్మింగ్ లాంటి పోటీ క్రీడల్లో ఎక్కువగా నాకు కనిపించలేదు. వాళ్ళకు నా ప్రయత్నం ప్రేరణ కలిగించాలని కోరుకుంటున్నాను" అని చెబుతున్న ప్రిషా భవిష్యత్ ప్రణాళికలేమిటి? "వైద్యరంగంలోకి వెళ్ళాలనేది నా కోరిక. కానీ స్విమ్మింగ్‌ను కొనసాగిస్తాను. ఇరవై నాలుగు గంటల పాటు స్విమ్మింగ్ చెయ్యాలనేది నా తరువాతి లక్ష్యం. అది త్వరలోనే నెరవేరుతుందని ఆశిస్తున్నాను" అని అంటోంది ప్రిషా.



కఠోర పరిశ్రమ ఎక్కడుంటుందో విజయం అక్కడే ఉంటుంది. సెలబ్రిటీ ఫిట్‌నెస్ ట్రైనర్ యాస్మిన్ కరాచీవాలా జీవితమే ఇందుకు ఉదాహరణ. ఒకప్పుడు బద్ధకంగా రోజులు వెళ్లదీసిన ఆమె... నిబద్ధతతో కష్టపడి లక్ష్యాన్ని చేరుకుంది. నేడు సామాన్యులకే కాదు... వెండితెర వేల్పులకూ స్ఫూర్తిమంత్రమైంది.

ఆమెకు తారలే అభిమానులు

> నా శరీరాకృతిని చూసి 'మగరాయుడిలా ఉంది' అంటూ అవహేళనగా మాట్లాడేవారు. 'నాకంటూ ఒక రోజు వస్తుంది' అని వారికి సమాధానం ఇచ్చేదాన్ని. అందుకే సవాలుగా తీసుకుని ముందు నా శరీరాన్ని నాజూగ్గా తయారు చేసుకున్నా.

"నా బాల్యం చాలా విచిత్రంగా గడిచిపోయింది. ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకొంటే నన్ను నేనే నమ్మలేనంతగా మారిపోయింది నా శరీరం... జీవితం. చిన్నప్పుడు నేను చాలా బద్ధకస్తురాలిని. ఆడుకోవడం, తినడం, టీవీ చూడటం, పడుకోవడం ఇదే నా దినచర్య. నా బాల్యమే కాదు, యుక్తవయసు కూడా అలాగే సాగిపోయింది. ఎంత బద్ధకస్తురాలినంటే... కొన్నిసార్లు స్కూల్ నుంచి వచ్చాక యూనిఫామ్ మార్చకుండా పడుకునేదాన్ని. పిజ్జాలు, బిర్యానీలంటే పిచ్చి. బర్గర్లు, నూడుల్స్‌లాంటి ఫాస్ట్ ఫుడ్‌తోనే కడుపు నిండిపోయేది. నన్ను, నా అలవాట్లు చూసి మా అమ్మ ఎంతో ఆందోళన చెందేది. నా బద్ధకం ఎలా వదిలించాలో తెలియక బాధపడేది. అలాంటి నేను ఇవాళ యాభై నాలుగేళ్ల వయసులోనూ ఇంత ఫిట్‌గా, క్రమశిక్షణగా ఉన్నానంటే ఎదుటివారికే కాదు, నాకూ ఆశ్చర్యంగా అనిపిస్తుంది. ఒక సంకల్పంతో నిబద్ధతగా కష్టపడితే అసాధ్యమైన లక్ష్యం ఏదీ ఉండదనేది నా నమ్మకం. ఆ నమ్మకమే నన్ను మీ ముందు ఇలా నిలబెట్టింది.

టామ్‌బాయ్‌లా...

నేను పుట్టింది అమెరికాలో. అక్కడే పాఠశాల విద్యాభ్యాసం పూర్తయింది. తరువాత ముంబయికి వచ్చాం. సెయింట్ జేవియర్ కాలేజీలో చదివాను. నా స్నేహితుల్లో ఎక్కువ మగపిల్లలు ఉండేవారు. దాని కోసమే అమ్మను అడిగాను... కోఎడ్యుకేషన్ కాలేజీలో చేర్పమని. అప్పుడైతే వారితో కలిసి ఆడుకోవచ్చనేది నా ఉద్దేశం. నాకు నచ్చినట్టు జడ వేయడానికి అమ్మకు గంటకు పైగా పట్టేది. ఒక రోజు విసిగిపోయి సెలూన్‌కు తీసుకువెళ్లి నా జుట్టు కట్ చేయించింది. షార్ట్ హెయిర్‌తో అప్పటి నుంచి నా ఆహార్యం కూడా టామ్‌బాయ్‌లా మారిపోయింది. ఇక కళాశాలలో నేను ఆడినవి రెండే ఆటలు. షార్ట్‌పుట్, జావెలిన్ త్రో. మన బలం చూపించుకొనే క్రీడలు కదా అవి. అందుకే వాటిని ఎంచుకున్నా. టీనేజీలో రెబల్‌గా ఉండేదాన్ని. ఎవరైనా ఇది చేయమని చెబితే నాకు అస్సలు నచ్చేది కాదు.

స్నేహితురాలితో వెళ్లి...

నా ఫిట్‌నెస్ ప్రయాణం అనుకోకుండా మొదలైంది. ఒక రోజు నా స్నేహితురాలు మా ఇంటికి వచ్చింది. అప్పటికే తను ఓ అబ్బాయితో ప్రేమలో ఉంది. అందుకే బరువు తగ్గాలని అనుకొంటున్నానని, దాని కోసం జిమ్‌కు వెళ్లాలని, నన్ను తోడు రమ్మని అడిగింది. అప్పుడు నా వయసు పద్ధెనిమిదేళ్లు. స్నేహితురాలు అడగడంతో కాదనలేకపోయాను. కొన్నిసార్లు మన జీవితంపై ఎదుటివారి ఒత్తిడి అనేక విధాలుగా పని చేస్తుంది. అయిష్టంగానే తన వెంట జిమ్‌కు వెళ్లి, నేనూ ఫిట్‌నెస్ క్లాస్‌లో చేరాను. ఏరోబిక్స్ సెషన్‌తో నా ఫిట్‌నెస్ జర్నీ మొదలైంది. డ్యాన్స్ మూమెంట్స్‌లా ఉండే ఆ వ్యాయామాలు నాకు బాగా నచ్చాయి. జిమ్‌కు వెళ్లేవరకు అందరు అమ్మాయిల్లా నేనూ బాగా డ్యాన్స్ చేయగలననే నమ్మకం ఉండేది. ఏరోబిక్స్ మొదలుపెట్టాకే తెలిసింది... నాకు అసలు డ్యాన్స్ రాదని. నా కదలికలు మిగిలినవారికి భిన్నంగా ఉండేవి. అందరూ నన్ను వింతగా చూసేవారు. అది నాకు అవమానంగా అనిపించింది. దాంతో పట్టుదల పెరిగింది. ఒక్కరోజు కూడా మానకుండా జిమ్‌కు వెళ్లాను. ఎంతో శ్రమించాను. బాగా మెరుగయ్యాను.

టీచర్ సలహాతో...

నాలోని పట్టుదల, నైపుణ్యం చూసిన మా ఏరోబిక్స్ టీచర్.. అమెరికాలో ఫిట్‌నెస్ కోర్సు చేయమని చెప్పారు. ఆమె సలహాతో 'అమెరికన్ కాలేజీ ఆఫ్ ఎక్సర్‌సైజ్'లో చేరి, ఫిట్‌నెస్ శిక్షణ తీసుకున్నాను. అలా ఒక ఫిట్‌నెస్ కోర్సులో సర్టిఫికెట్ పొందిన తొలి భారతీయురాలిని నేనే. అదే సమయంలో కిండర్‌గార్డెన్ టీచర్ ట్రైనింగ్ కూడా తీసుకున్నాను. ముంబయికి తిరిగి వచ్చాక ఫిట్‌నెస్ పాఠాలు మొదలుపెట్టాను. ఉదయం టీచింగ్, సాయంత్రం ఫిట్‌నెస్ క్లాస్‌లు. రోజూ నగరంలో ఈ చివర నుంచి... ఆ చివరకు ప్రయాణం. కొన్ని నెలలు గడిచాయి. 'ఫ్రెంచ్ ఇంటర్నేషనల్ స్కూల్'లో ఇంగ్లీష్ టీచర్‌గా ఉద్యోగం వచ్చింది. తరువాత మినాజ్ కరాచీవాలతో పెళ్లయింది. మా అబ్బాయి పుట్టాక ఫిట్‌నెస్ తరగతులు కుదించుకున్నా.

అవహేళన చేసినా...

మా బాబు కాస్త పెరిగే వరకు నా అవసరం ఉంటుంది కదా. దాని కోసం చాలా అవకాశాలు వదులుకున్నా. కుదిరిన సమయంలోనే శిక్షణ ఇచ్చేదాన్ని. అయితే అందరిలా కాకుండా... నాకంటూ ఒక గుర్తింపు కావాలనిపించింది. దాంతో మరింత నైపుణ్యం పెంచుకొనేందుకు పర్సనల్ ట్రైనర్ కోర్సు చేశాను. ఆ సమయంలో నా శరీరాకృతిని చూసి 'మగరాయుడిలా ఉంది' అంటూ అవహేళనగా మాట్లాడేవారు. 'నాకంటూ ఒక రోజు వస్తుంది' అని వారికి సమాధానం ఇచ్చేదాన్ని. అందుకే సవాలుగా తీసుకుని ముందు నా శరీరాన్ని నాజూగ్గా తయారు చేసుకున్నా. దీన్ని గమనించిన కొందరు తమకు కూడా అలాంటి ఆకృతి కావాలంటూ అడిగారు. తరువాత వారందరూ నా శిష్యులు అయ్యారు.

స్టూడియోకు శ్రీకారం...

ఫిట్‌నెస్ పాఠాల కోసం నా దగ్గరకు వచ్చేవారు క్రమంగా



పెరిగారు. దాంతో మా గెస్ట్ రూమ్‌ను ఫిట్‌నెస్ స్టూడియోగా మార్చాను. కొన్నాళ్లకు అది సరిపోక స్టూడియో... లివింగ్ రూమ్‌కు, తరువాత టెర్రస్‌కు, అక్కడి నుంచి బాంద్రాలోని పెద్ద హాల్‌కు మారింది. ఇంట్లో నేను తరగతులు చెప్పినంతసేపూ మావారు నాకు తోడుగా ఉండేవారు. ఇంకా ఏదో చేయాలన్న తపనతో అమెరికా వెళ్లి పిలేట్స్ ట్రైనింగ్ తీసుకున్నా. తద్వారా భారత్‌లో తొలి బీఏఎస్ఐ (బాడీ ఆర్ట్స్ అండ్ సైన్స్ ఇంటర్నేషనల్) సర్టిఫైడ్ పిలేట్స్ ఇన్‌స్ట్రక్టర్‌ను అయ్యాను.

తారల ట్రైనర్‌గా...

ఇక అప్పటి నుంచి నా జీవితమ అనూహ్య మలుపు తీసుకుంది. బాలీవుడ్ తారల నుంచి పిలుపు వచ్చింది. కత్రినా కైఫ్, దీపికా పదుకొనే, కరీనా కపూర్, అలియా భట్... దాదాపు ప్రముఖ హీరోయిన్లు అందరితో కలిసి పని చేశాను. వారికి వ్యక్తిగత ట్రైనర్‌గా కూడా ఉన్నాను. 'యాస్మిన్ బాడీ ఇమేజ్' పేరిట ముంబయిలో అతిపెద్ద పిలేట్స్ స్టూడియో నెలకొల్పాను. దాంతోపాటు నగరంలోనే మరో రెండు, ఢిల్లీ, దుబాయ్, ఢాకాల్లోనూ ఫ్రాంచైజీలు ప్రారంభించాను. రెండున్నర దశాబ్దాలకు పైబడిన నా ఈ ప్రయాణంలో... ఎన్నో ప్రతిష్టాత్మక అవార్డులు అందుకున్నాను. భారత్‌లో ఫిట్‌నెస్‌ను ఒక పరిశ్రమ స్థాయికి తీసుకువెళ్లానని ప్రముఖులు ఎందరో కొనియాడారు. అందుకు ఎంతో గర్వంగా ఉంది."

హాట్ హిట్స్



ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...

1. ఆజ్ కీ రాత్ (స్త్రీ-2)
2. తౌబా తౌబా (బ్యాడ్ న్యూజ్)
3. సాజ్‌నీ రే (లాపతా లేడీస్)
4. ఆయీ నై (స్త్రీ-2)
5. అఖియా గులాబ్ (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్ఝా జియా)
6. తైనూ ఖబర్ నహీ (ముంజ్యా)
7. చలేయా (జవాన్)
8. దేఖా తేనూ (మిస్టర్ అండ్ మిసెస్ మహీ)
9. అపనా బనాలే (భేడియా)
10. తేరీ బాతోమే (తేరీ బాతోమే ఐసా ఉల్ఝా జియా)

ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్: నా రోజా నువ్వే (ఖుషి)

ఘనంగా సైమా అవార్డుల వేడుక





సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ (సైమా) 2024 వేడుక దుబాయిలో ఘనంగా జరిగింది. ఈ వేడుకలో దక్షిణాదికి చెందిన పలువురు తారలు సందడి చేశారు. రెండు రోజుల పాటు సాగే ఈ వేడుకలో.. తొలి రోజున తెలుగు, కన్నడ చిత్రాలకు సంబంధించి 2023లో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన నటీనటులకు, చిత్రాలకు అవార్డులు అందజేశారు. ఫరియా అబ్దుల్లా, నేహా శెట్టి, శాన్వీ తమ ప్రదర్శనతో వేడుకకు విచ్చేసిన వారిని అలరించారు.

2024 సంవత్సరానికి గాను 'దసరా' చిత్రానికి ఉత్తమ నటుడిగా నాని, ఉత్తమ నటిగా కీర్తి సురేశ్ ఎంపికయ్యారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో బాలకృష్ణ నటించిన 'భగవంత్ కేసరి' ఉత్తమ చిత్రంగా నిలిచింది. కన్నడ పరిశ్రమ నుంచి 'సప్త సాగరాలు దాటి సైడ్ ఏ' చిత్రానికి ఉత్తమ నటుడిగా రక్షిత్ శెట్టి.. ఉత్తమ దర్శకుడిగా హేమంత్ రావు ఎంపికయ్యారు. 'టోబీ' చిత్రానికి గాను ఉత్తమ నటిగా చైత్ర ఆర్చర్ ఎంపికయ్యారు. కన్నడ స్టార్ నటుడు దర్శన్ నటించిన 'కాటేరా' ఉత్తమ చిత్రంగా అవార్డును అందుకుంది.





విజేతలు వీరే

- ఉత్తమ చిత్రం: భగవంత్ కేసరి
- ఉత్తమ నటుడు : నాని (దసరా)
- ఉత్తమ నటి : కీర్తి సురేష్ (దసరా)
- ఉత్తమ నటి (క్రిటిక్స్): మృణాల్ ఠాకూర్ (హాయ్ నాన్నా)
- ఉత్తమ దర్శకుడు : శ్రీకాంత్ ఓదెల (దసరా)
- ఉత్తమ నటుడు (క్రిటిక్స్): ఆనంద్ దేవరకొండ (బేబీ)
- సెన్సేషన్ ఆఫ్ ది ఇయర్: సందీప్‌రెడ్డి వంగా
- ఉత్తమ దర్శకుడు (క్రిటిక్స్): సాయి రాజేష్ (బేబీ)
- ఉత్తమ హాస్యనటుడు: విష్ణు(మ్యాడ్)
- ఉత్తమ ప్రతినాయకుడు: దునియా విజయ్ (వీర సింహారెడ్డి)
- ఉత్తమ సహాయ నటి: బేబీ కియారా (హాయ్ నాన్న)
- ఉత్తమ సహాయ నటుడు: దీక్షిత్ శెట్టి (దసరా)
- బెస్ట్ డెబ్యూ డైరెక్టర్: శౌర్యువ్ (హాయ్ నాన్న)
- ఉత్తమ డెబ్యూ ప్రొడ్యూసర్స్ : వైర ఎంటర్‌టైన్‌మెంట్స్, విజయేందర్ రెడ్డి తీగల (హాయ్ నాన్న)
- ఎమర్జింగ్ యాక్టర్: సుమంత్ ప్రభాస్ (మేమ్ ఫేమస్)
- ఉత్తమ డెబ్యూ నటి: వైష్ణవి చైతన్య (బేబీ)
- ఉత్తమ డెబ్యూ నటుడు: సంగీత్ శోభన్ (మ్యాడ్)
- ఉత్తమ సంగీత దర్శకుడు: హేషామ్ అబ్దుల్ వహాబ్ (హాయ్ నాన్న)
- ఉత్తమ నేపథ్య గాయని: శక్తిశ్రీ గోపాలన్ (హాయ్ నాన్న)
- ఉత్తమ గాయకుడు: రామ్ మిరియాల (బలగం)
- ఉత్తమ లిరిక్స్ రైటర్: అనంత శ్రీరామ్ (బేబీ)
- ఉత్తమ సినిమాటోగ్రాఫర్: భువన్ గౌడ (సలార్)







ప్రియుడితో ఏడడుగులు



నటి మేఘా ఆకాశ్ తన ప్రియుడు విష్ణుసాయిని పెళ్లి చేసుకున్నారు. ఆదివారం చెన్నైలో జరిగిన ఈ వివాహానికి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సినీ తారలు, రాజకీయవేత్తలు హాజరయ్యారు. వరుడు సాయివిష్ణు తమిళ రాజకీయవేత్త తిరునవుకారసు కుమారుడు.

ప్రయాణం మొదలైంది



సెన్సిబుల్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్న క్రాంతి మాధవ్ తన కొత్త సినిమా వివరాలు వెల్లడించారు. వాస్తవ సంఘటనల నేపథ్యంలో రూపుదిద్దుకొనే ఈ సినిమాకు 'డీజీఎల్' అని పేరు పెట్టారు. గంటా కార్తీక్ రెడ్డి ఈ సినిమాకు నిర్మాత. ఈ సందర్భంగా రెండు పోస్టర్లు విడుదల చేశారు. కాజీపేట జంక్షన్‌లోని రైల్వే ట్రాక్‌పై హీరో నిలబడి ఉండగా, అతని చుట్టూ వివిధ ట్రాక్స్ పై రైళ్లు వెళుతున్నాయి. ఆ పోస్టర్‌లో 'జర్నీ బిగిన్స్' అని రాసుంది. నవంబర్‌లో షూటింగ్ మొదలవుతుందనీ, నటీనటులు, ఇతర వివరాలను త్వరలో వెల్లడిస్తామని నిర్మాత చెప్పారు. ఈ సినిమాకు జ్ఞానశేఖర్ వీఎస్ ఛాయాగ్రాహకుడు.



'కళింగ' చిత్రం ఇటీవలే విడుదలై హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ఆదివారం సక్సెస్ మీట్ నిర్వహించింది. చిత్ర దర్శకుడు ... హీరో ధ్రువ వాయు, హీరోయిన్ ప్రగ్యా నయన్, నిర్మాతలు దీప్తి కొండవీటి, పృథ్వీ యాదవ్ పాల్గొన్నారు.

నవ్య | చిత్రజ్యోతి

కార్తి కొత్త చిత్రం

కొత్తగా..



కార్తి కథానాయకుడిగా నటించబోయే తదుపరి చిత్రం ఖరారైంది. 'కార్తి 29' అనేది వర్కింగ్ టైటిల్. 'తానక్కరన్' చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న తమిళ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ విషయాన్ని చిత్రబృందం ఆదివారం తెలిపింది. ఎస్. ఆర్ ప్రకాశ్ బాబు, ఎస్.ఆర్ ప్రభు నిర్మిస్తున్నారు. పీరియాడికల్ కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. త్వరలో చిత్రీకరణ ప్రారంభించి, వచ్చే ఏడాది సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.

అక్టోబర్‌లో లగ్గం



సాయి రోనక్, ప్రగ్యా నగ్రా జంటగా నటించిన చిత్రం 'లగ్గం'. రాజేంద్రప్రసాద్, రోహిణి, ఎల్బీ శ్రీరామ్ కీలకపాత్రలు పోషించారు. రమేశ్ చెప్పాల దర్శకత్వంలో వేణుగోపాల్ రెడ్డి నిర్మించారు. 'లగ్గం' విడుదల తేదీ ఖరారైంది. అక్టోబర్ 18న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ఆదివారం తెలిపారు. కుటుంబంతో కలసి చూడదగ్గ చిత్రం 'లగ్గం' అని రాజేంద్రప్రసాద్ తెలిపారు. కుటుంబ విలువల గొప్పదనాన్ని ఈ తరానికి తెలియజెప్పే చిత్రమిదని వేణుగోపాల్ రెడ్డి అన్నారు. సంగీతం: మణిశర్మ, సినిమాటోగ్రఫీ: బాల్‌రెడ్డి

హాట్ ఫేవరెట్ భారత్

కొరియాతో సెమీస్ పోరు నేడు
ఆసియా చాంపియన్స్ హాకీ



హులున్‌బుయిర్ (చైనా): ఆసియా చాంపియన్స్ ట్రోఫీ లీగ్ దశలో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ నెగ్గి, ఊపులో ఉన్న భారత హాకీ జట్టు సెమీఫైనల్లో హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. సోమవారం కొరియాతో డిఫెండింగ్ చాంపియన్ భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. లీగ్ మ్యాచ్‌ల్లో కొరియాతో సహా ఆతిథ్య చైనా, జపాన్, మలేసియా, పాకిస్థాన్‌ను భారత్ ఓడించి, సత్తా చాటింది. ఫార్వర్డ్‌లైన్, మిడ్‌ఫీల్డ్, డిఫెన్స్‌తో సహా అన్ని విభాగాల్లోనూ అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తోండడంతో భారత్‌పై అంచనాలు పెరిగాయి. యువ స్ట్రయికర్లు సుఖ్‌జీత్ సింగ్, అభిషేక్, ఉత్తమ్ సింగ్, గుర్జోత్ సింగ్ మంచి ఫామ్‌లో ఉండగా మన్‌ప్రీత్ సింగ్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కూడా స్థాయికి తగినట్టుగా ఆడుతుండడం భారత్‌ను బలీయంగా తయారు చేసింది. ప్రత్యర్థి కొరియా లీగ్ దశలో టీమిండియా చేతిలో ఓడినా నాకౌట్ పోటీల్లో అంచనాలను తలకిందులు చేయగల సత్తా ఆ జట్టుకు ఉండడంతో సెమీస్ పోరు రసవత్తరంగా సాగే అవకాశముంది. కాగా, సోమవారమే జరిగే మరో సెమీఫైనల్లో పాకిస్థాన్‌తో చైనా తలపడనుంది.

విరిగిన చేయితో బరిలో దిగి
సెంటీ మీటర్ తేడాతో..



టైటిల్ మిస్సయిన నీరజ్ చోప్రా
డైమండ్ లీగ్ ఫైనల్లో రన్నరప్‌తో సరి



బ్రసెల్స్: గత టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణంతో చరిత్రకెక్కి, ఈ ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకంతో డబుల్ ధమాకా సృష్టించిన స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా.. ప్రతిష్ఠాత్మక డైమండ్ లీగ్ ఫైనల్లోనూ తనదైన ప్రదర్శనతో మెరిపించి ఈ సీజన్‌ను బాగానే ముగించాడు. శనివారం అర్ధరాత్రి ఇక్కడ జరిగిన లీగ్ సీజన్ ఫైనల్లో నీరజ్ రన్నరప్‌గా నిలిచాడు. 2022లో తొలిసారి డైమండ్ లీగ్ విజేతగా నిలిచిన నీరజ్.. ఈమారు కేవలం సెంటీమీటర్ తేడాతో టైటిల్ మిస్సయ్యాడు. ఈ బల్లెం వీరుడు మూడో ప్రయత్నంలో ఈటెను 87.86 మీటర్లు త్రో చేసి వరుసగా రెండో ఏడాది రెండోస్థానంలో నిలిచాడు. గ్రెనెడాకు చెందిన రెండుసార్లు వరల్డ్ చాంపియన్ అండర్సన్ పీటర్స్ 87.87 మీటర్లు త్రో చేసి టైటిల్ విజేతగా నిలిచాడు. జర్మనీ త్రోయర్ జులియన్ వెబర్ 85.97 మీటర్ల త్రోతో మూడోస్థానంలో నిలిచాడు. పీటర్స్ తొలి ప్రయత్నంలోనే ఈటెను అత్యధిక దూరం విసరగా.. ఆ తర్వాత ఎవరూ అతడిని అందుకోలేకపోయారు. కాగా, కొద్దిలో విజయాన్ని దూరం చేసుకున్న నీరజ్ ఈ పోటీలకు గాయంతోనే బరిలోకి దిగడం గమనార్హం. ఫ్రాక్చర్ (విరిగిన) చేతితోనే ఫైనల్లో పోటీపడ్డ నీరజ్, నొప్పిని భరిస్తూనే ఈటెను విసిరాడు. గాయం విషయాన్ని అతడు పోటీలు ముగిశాక వెల్లడించాడు. విరిగిన తన ఎడమ చేతి ఎక్స్‌రే ఫొటోను కూడా సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. 'ఈ టోర్నీకోసం ప్రాక్టీస్ చేస్తున్నప్పుడు చేతి గాయానికి గురయ్యా. ఎక్స్‌రే తీయిస్తే, ఎడమ చేతి నాలుగో వేలి దగ్గర ఎముక విరిగినట్టు బయటపడింది. అయినా, నా టీమ్ సహాయంతో బ్రసెల్స్‌లో పోటీపడ్డా. ఈ ఏడాదికి ఇదే నా చివరి పోటీ. నా అంచనాలను అందుకోలేకపోయినా, ఈ సీజన్‌లో ఎన్నో పాఠాలు నేర్చుకున్నా. మరింత పట్టుదలగా పోరాడతా, పూర్తి ఫిట్‌గా మీ ముందుకొస్తా. మళ్లీ 2025లో కలుద్దాం' అని 26 ఏళ్ల నీరజ్ ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. నీరజ్.. సాధారణంగా కుడిచేతితో ఈటెను విసిరిన వెంటనే ఫాలోత్రూ యాక్షన్‌లో తన ఎడమ అరచేతిని బలంగా నేలపై ఉంచుతాడు. కానీ, ఈసారి పోటీలకు ఎడమ అరచేతికి కట్టుతో దర్శనమిచ్చిన నీరజ్.. భరించరాని నొప్పి కారణంగా తన ఆరు ప్రయత్నాల్లోనూ అరచేతిని నేలపై ఉంచలేదు.


పీటర్స్

పట్టుదలకు సలాం..

కొన్నాళ్లుగా గాయంతోనే బాధపడుతున్న నీరజ్.. ఇటీవలి ఒలింపిక్స్ మినహాయిస్తే ఈ సీజన్‌లో ఒకేఒక్క అంతర్జాతీయ ఈవెంట్‌ను గెలిచాడు. జూన్‌లో ఫిన్లాండ్ వేదికగా జరిగిన పావో నుర్మి గేమ్స్‌లో స్వర్ణం సాధించాడు. ఆ తర్వాత గజ్జల్లో కండరాల సమస్యతో బాధపడ్డ నీరజ్.. గాయంతోనే పారిస్ ఒలింపిక్స్ బరిలో దిగాడు. ఈ క్రమంలో ప్రాక్టీస్ సరిగా లేకున్నా కూడా విశ్వక్రీడల్లో పాల్గొన్నాడు. పారిస్‌లో ఈటెను ఏకంగా 89.45 మీటర్లు విసిరిన నీరజ్.. రెండోస్థానంలో నిలిచి వరుసగా రెండో ఒలింపిక్ పతకంతో చరిత్ర సృష్టించాడు. మళ్లీ ఇప్పుడు డైమండ్ లీగ్ ఫైనల్లోనూ గాయంతోనే పోటీపడి కేవలం సెంటీ మీటర్ తేడాతో టైటిల్‌ను చేజార్చుకున్న నీరజ్ పట్టుదలకు సలాం కొట్టకుండా ఉండలేం.



భారీ భద్రత నడుమ భారత్ చేరిన బంగ్లా జట్టు

చెన్నై: టీమిండియాతో రెండు టెస్టులు, మూడు టీ20 మ్యాచ్‌ల సిరీస్ ఆడేందుకు బంగ్లాదేశ్ జట్టు భారత్‌కు చేరుకుంది. ఈనెల 19 నుంచి తొలి టెస్టు ఆరంభం కానుంది. ఆదివారం మధ్యాహ్నం ఆటగాళ్లంతా ఢాకా నుంచి చెన్నైలో అడుగుపెట్టారు. అయితే బంగ్లాలో ఇటీవల చోటుచేసుకున్న పరిస్థితుల నేపథ్యంలో అక్కడి మైనార్టీ హిందువులపై దాడులకు నిరసనగా ఈ సిరీస్‌ను రద్దు చేయాలనే డిమాండ్ ఎక్కువగా వినిపిస్తోంది. దీంతో బంగ్లా టీమ్‌కు పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ఎయిర్‌పోర్టు నుంచి వీరు బస చేసే హోటల్ వరకు రెండు పోలీస్ వ్యాన్లతో ఎస్కార్ట్‌ను ఏర్పాటు చేశారు. హోటల్‌లో అక్కడి స్టాఫ్ నుంచి సాదర ఆహ్వానం లభించింది. అందరినీ ఒకే ఫ్లోర్‌లో ఉంచడంతో పాటు ఆయుధాలు కలిగిన అధికారులు వారికి కాపలాగా ఉండనున్నారు.

మూడో టీ20 వర్షార్పణం

1-1తో సిరీస్ సమం

మాంచెస్టర్: ఇంగ్లండ్-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరగాల్సిన మూడో టీ20 మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. మధ్యాహ్నం ఆట ప్రారంభానికి ముందే వర్షం మొదలైంది. ఫలితంగా కనీసం టాస్ కూడా వీలు పడలేదు. దీంతో అంపైర్లు మ్యాచ్ రద్దుకే మొగ్గుచూపారు. ఈ మూడు టీ20ల సిరీస్‌లో ఇరు జట్లు చెరో మ్యాచ్ గెలిచాయి. దీంతో ఈ సిరీస్ 1-1తో డ్రాగా ముగిసింది. ఇక, ఇరుజట్ల మధ్య ఈనెల 19 నుంచి ఐదు వన్డేల సిరీస్ మొదలవనుంది.

పరాజయం పరిపూర్ణం

డేవిస్‌కప్‌లో స్వీడన్ చేతిలో భారత్ ఓటమి

స్టాక్‌హోమ్: డేవిస్ కప్‌లో చావో రేవో తేల్చుకోవాల్సిన మ్యాచ్‌లో భారత్ చేతులెత్తేసింది. డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్-1లో భాగంగా శనివారం స్వీడన్‌తో ముగిసిన రెండు సింగిల్స్ మ్యాచ్‌ల్లో ఓడిన భారత్ ఆదివారం జరిగిన నిర్ణయాత్మక డబుల్స్ పోరులోను చతికిలపడింది. దీంతో స్వీడన్ 3-0తో విజేతగా నిలిచింది. డేవిస్‌కప్‌లో భారత్‌పై స్వీడన్ గెలవడం ఇది ఆరోసారి. డబుల్స్ మ్యాచ్‌లో భారీ అంచనాలతో బరిలోకి దిగిన రామ్‌కుమార్ రామనాథన్-శ్రీరామ్ బాలాజీ ద్వయం 3-6, 4-6తో ఆంద్రీ గోరాన్సన్-ఫిలిప్ బెర్గివి చేతిలో ఓటమి పాలైంది.



గిల్‌కు విశ్రాంతి!

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌తో జరుగబోయే మూడు టీ20ల సిరీస్‌కు ఓపెనర్ శుభ్‌మన్ గిల్‌కు విశ్రాంతి కల్పించే అవకాశం ఉంది. త్వరలో కివీస్‌తో జరిగే టెస్టు సిరీస్ కోసం పని ఒత్తిడి కారణంగా గిల్‌తో పాటు పలువురు ఆటగాళ్లను కూడా తప్పించనున్నట్టు సమాచారం. టెస్టు ఫార్మాట్‌లో వన్‌డౌన్ బ్యాటర్‌గా గిల్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఈ సీజన్‌లో జరుగబోయే పది టెస్టుల్లోనూ అతడిని ఆడించాలనే ఆలోచనలో టీమ్ మేనేజ్‌మెంట్ ఉంది.

రికీ శతకబాదినా..
ఇండియా 'ఏ'దే విజయం

చిత్తుగా ఓడిన ఇండియా 'డి'



అనంతపురం క్లాక్‌టవర్ (ఆంధ్రజ్యోతి) : ఇండియా 'డి' బ్యాటర్ రికీ భుయ్ (113) శతకం బాదినా తమ జట్టు ఓటమిని అడ్డుకోలేకపోయాడు. మిగతా బ్యాటర్ల నుంచి అతడికి పెద్దగా సహకారం అందలేదు. దీంతో దులీప్ ట్రోఫీలో భాగంగా ఆదివారం ముగిసిన ఈ మ్యాచ్‌లో ఇండియా 'ఏ' 186 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ విజయంతో ఇండియా 'ఏ' 6 పాయింట్లతో టైటిల్ రేసులో ఉండగా, వరుసగా రెండు మ్యాచ్‌లు ఓడిన ఇండియా 'డి' పోటీ నుంచి వైదొలిగింది. 488 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇండియా 'డి' 301 పరుగుల వద్ద ఆలౌటైంది. తనుష్ కోటియన్‌కు నాలుగు, ములానికి మూడు వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో ఇండియా 'ఏ' 290, ఇండియా 'డి' 183 పరుగులు చేయగా రెండో ఇన్నింగ్స్‌లో ఇండియా 'ఏ' 380/3 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది.

అన్షుల్‌కు 8 వికెట్లు..: ఇండియా 'సి' యువ పేసర్ అన్షుల్ కాంబోజ్ ఎనిమిది వికెట్లతో చెలరేగాడు. దీంతో ఇండియా 'బి' రెండో ఇన్నింగ్స్‌లో 332 పరుగులకు ఆలౌటైంది. అభిమన్యు ఈశ్వరన్ (157 నాటౌట్) అజేయ శతకంతో నిలిచాడు. ఆ తర్వాత ఇండియా 'సి' రెండో ఇన్నింగ్స్‌లో 128/4 వద్ద డిక్లేర్ చేసింది. రుతురాజ్ గైక్వాడ్ (62), రజత్ పటీదార్ (42) రాణించారు. అయితే చివరి సెషన్ ఆట ఉన్నప్పటికీ మ్యాచ్‌లో ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో ఇరు జట్లు డ్రాకు అంగీకరించాయి. తొలి ఇన్నింగ్స్‌లో 525 పరుగులు చేసిన ఇండియా 'సి'కి 193 పరుగుల ఆధిక్యం లభించింది. దీంతో మూడు పాయింట్లు దక్కించుకున్న ఈ జట్టు ప్రస్తుతం టేబుల్ టాపర్ (9)గా ఉంది.


అర్జున్

మనోళ్లు తగ్గేదేలె..

భారత జట్లకు వరుసగా ఐదో గెలుపు
చెస్ ఒలింపియాడ్

బుడాపెస్ట్: చెస్ ఒలింపియాడ్‌లో భారత జట్ల జైత్రయాత్ర కొనసాగుతోంది. అటు పురుషులు, ఇటు మహిళలు వరుసగా ఐదో రౌండ్లోనూ గెలుపొందారు. ఆదివారం జరిగిన పురుషుల విభాగంలో భారత్ 3-1తో అజర్‌బైజాన్‌ను చిత్తుచేయగా.. మహిళల బృందం 2.5-1.5తో కజకిస్థాన్‌పై గెలిచింది. టోర్నీలో ఓటమన్నదే లేకుండా దూసుకెళుతున్న తెలుగు గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి వరుసగా ఐదో విజయాన్ని నమోదు చేశాడు. తెల్లపావులతో ఆడిన అర్జున్ 54 ఎత్తుల్లో రౌఫ్ మమెదోవ్ ఆట కట్టించగా, గుకేష్ 47 ఎత్తుల్లో అదిల్ సులేమన్లిపై గెలిచాడు. మరో గేమ్‌లో నిజత్ అబసోవ్‌తో ప్రజ్ఞానంద డ్రా చేసుకున్నాడు. ఇక ఆఖర్లో మమెదో షఖిర్యార్‌తో గేమ్‌ను విదిత్ సంతోష్ గుజరాతి డ్రాగా ముగించాడు. ఇక..కజకిస్థాన్‌తో పోరులో భాగంగా అసుబయేవా బిబిసార చేతిలో తెలుగమ్మాయి ద్రోణవల్లి హారిక ఓటమిపాలైంది. ఆ తర్వాత నుర్మాన్‌పై వంతికా అగర్వాల్ నెగ్గగా.. బలబయేవాతో గేమ్‌ను దివ్యా దేశ్‌ముఖ్ డ్రా చేసుకుంది. దీంతో నిర్ణాయక ఆఖరిగేమ్‌లో కమలిదెయోవా మెరుట్‌ను వైశాలి ఓడించి భారత్‌కు గెలుపును కట్టబెట్టింది.

సహజ జోడీకి రన్నరప్ టైటిల్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): డబ్ల్యూ 35 టెన్నిస్ టోర్నమెంట్ డబుల్స్‌లో హైదరాబాద్ అమ్మాయి సహజ జోడీ రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం కరేబియన్ దీవుల్లోని డొమినికన్ రిపబ్లిక్‌లో జరిగిన ఈ పోటీల ఫైనల్లో సహజ-జిబెక్ (కజకిస్థాన్) ద్వయం పోరాడి ఓడింది.

బిజినెస్

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	106	విజయవాడ	123
వరంగల్	106	గుంటూరు	125
కరీంనగర్	106	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	106	చిత్తూరు	115
కర్నూలు	106	నెల్లూరు	115
విశాఖపట్నం	106	అనంతపురం	115
గోదావరి	123		



ఆర్‌బీఐ నగదు నిర్వహణ
మరింత పటిష్ఠం

న్యూఢిల్లీ: వచ్చే నాలుగైదు సంవత్సరాల్లో ఏర్పడే నగదు అవసరాలు తీర్చేందుకు ఆర్‌బీఐ ఇప్పటి నుంచే సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా కొత్త నగదు నిర్వహణ కేంద్రాల ఏర్పాటు, వేర్‌హౌస్‌ల ఆటోమేషన్, నగదు నిల్వ కేంద్రాల వద్ద గట్టి నిఘా, భద్రత పటిష్ఠత, ఇన్వెంటరీ మేనేజ్‌మెంట్ వ్యవస్థల ఏర్పాటు, కేంద్రీకృత కమాండ్ కేంద్రం ఏర్పాటు, ఇప్పటికే ఉన్న మౌలిక సదుపాయాలను మరింత పటిష్ఠం చేయడం వంటి చర్యలకు సిద్ధమైంది. ఈ ఏర్పాట్ల కోసం ఇప్పటికే టెండర్లు ఆహ్వానించింది.

ఇంకా పెరుగుడే: నిజానికి డిజిటల్ చెల్లింపుల విస్తరణతో గత మూడేళ్లలో చలామణిలో ఉన్న నగదు (ఎన్‌ఐసీ) వృద్ధిరేటు తగ్గింది. అయినా ఆర్థిక వృద్ధితో పాటు నోట్ల గిరాకీ కూడా వచ్చే పదేళ్లలో మరింత పెరగుతుందని నిపుణుల అంచనా. నిజానికి చలామణిలో ఉన్న నోట్ల పరిమాణం, విలువ రెండూ గత ఏడాది కాలంగా బాగా పెరిగాయి. గత ఏడాది మార్చి 31 నాటికి చలామణిలో ఉన్న నోట్ల పరిమాణం 13,621 కోట్ల నుంచి ఈ ఏడాది మార్చి 31 నాటికి 14,687 కోట్లకు చేరింది. ఇదే సమయంలో చలామణిలో ఉన్న నాణేల పరిమాణం 12,792 కోట్ల నుంచి 13,235 కోట్లకు చేరింది. ఇది చాలదన్నట్టు పాడైపోయిన నోట్ల పరిమాణం కూడా పెరిగిపోతోంది. దీంతో కరెన్సీ నోట్ల నిర్వహణ మరింత కట్టుదిట్టంగా చేపట్టాల్సిన అవసరం ఏర్పడుతోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)			
16వ తేదీ		విజయవాడ	535
హైదరాబాద్	505	గోదావరి	530
వరంగల్	507	విశాఖపట్నం	540
చిత్తూరు	553	దజను గుడ్లు రూ. 72	

ఐపీఓకు స్విగ్గీ సిద్ధం!



ఈ వారమే సెబీకి దరఖాస్తు
రూ.8,400 కోట్లకు పైగా సమీకరణ

న్యూఢిల్లీ: మరో ఫుడ్ డెలివరీ కంపెనీ 'స్విగ్గీ' ఐపీఓకు సిద్ధమవుతోంది. దీనికి సంబంధించి ఈ వారమే సెబీకి దరఖాస్తు చేయబోతున్నట్టు సమాచారం. స్విగ్గీ ఈ ఐపీఓ ద్వారా 100 కోట్ల డాలర్లకు పైగా (సుమారు రూ.8,400 కోట్లు) సమీకరించే అవకాశం ఉందని భావిస్తున్నారు. అయితే స్విగ్గీ ఈ వార్తలపై నోరు మెదపడం లేదు. 2014లో ఏర్పాటైన ఈ ఫుడ్ డెలివరీ కంపెనీ ప్రస్తుతం దేశవ్యాప్తంగా లక్షన్నరకు పైగా రెస్టారెంట్లతో టై అప్ పెట్టుకుని భోజనప్రియుల ఆకలి తీరుస్తోంది. జొమాటో, అమెజాన్.కామ్ ఇండియా యూనిట్‌తో పాటు టాటా గ్రూప్ బిగ్ బాస్కెట్‌తో ప్రస్తుతం స్విగ్గీ పోటీపడుతోంది.

మరిన్ని ఐపీఓలు: సెకండరీ మార్కెట్ జోరుతో ప్రస్తుతం ప్రైమరీ మార్కెట్ కూడా మంచి జోరు మీద ఉంది. బజాజ్ హౌసింగ్‌తో సహా అనేక మంచి కంపెనీల ఐపీఓలు సూపర్ డూపర్ సక్సెస్ అయ్యాయి. దీంతో ఈ సంవత్సరం ఇప్పటి వరకు కంపెనీలు ఐపీఓల ద్వారా దాదాపు 700 కోట్ల డాలర్ల (సుమారు రూ.58,500 కోట్లు) వరకు సమీకరించాయి. త్వరలో హ్యుండయ్ మోటార్ కంపెనీ, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ వంటి దిగ్గజాలు కూడా ఐపీఓలకు రానున్నాయి. ఇందులో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఒక్కటే రూ.12,500 కోట్ల ఐపీఓ జారీ చేస్తుందని సమాచారం. అయితే కొన్ని ఎస్‌ఎంఈల ఐపీఓలు మాత్రం ఈ బూమ్‌ను అడ్డుపెట్టుకుని మదుపరులకు కుచ్చుటోపీ పెడుతూ నిండా ముంచుతున్నాయి. వాటి వాల్యుయేషన్లకు వత్తాసు పలుకుతున్న మర్చంట్ బ్యాంకర్లకు కళ్లెం వేస్తే తప్ప, ఈ గూడు పుఠానీకి తెరపడదని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

13 రోజుల్లో రూ.27,856 కోట్లు
సెప్టెంబరు నెలలో ఎఫ్‌పీఐ పెట్టుబడులు

న్యూఢిల్లీ: విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) మళ్లీ భారత మార్కెట్‌పై దృష్టి పెట్టారు. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో మార్కెట్ నుంచి రూ.34,252 కోట్లు ఉపసంహరించిన ఎఫ్‌పీఐలు సెప్టెంబరు 13నాటికి అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం ఈ నెలలో రూ.27,856 కోట్లు ఇన్వెస్ట్ చేశారు. భారత మార్కెట్లో గల అంతర్గత బలంతో పాటు అమెరికాలో వడ్డీరేట్లు తగ్గుతాయన్న సంకేతాలు జూన్ నుంచి వారు పెట్టుబడుల దిశగా ఆకర్షితులు కావడానికి దోహదపడిన అంశాలని అంటున్నారు. ప్రస్తుతం అందరి దృష్టి అమెరికన్ ఫెడరల్ సమావేశంలో తీసుకునే నిర్ణయం పైనే కేంద్రీకృతమై ఉంది. ఈ నిర్ణయమే సమీప కాలంలో భారత మార్కెట్లో వారి పెట్టుబడులను ప్రభావితం చేస్తుందని పరిశీలకులంటున్నారు. సెప్టెంబరు పెట్టుబడితో కలిపితే ఈ ఏడాది ఇప్పటివరకు ఎఫ్‌పీఐ పెట్టుబడుల పరిమాణం రూ.70,737 కోట్లుంది.

అమెరికాలో రేట్లు తగ్గితే మనకే లాభం: అమెరికన్ ఫెడరల్ వడ్డీరేట్ల నిర్ణయంపై ఈ వారంలో సమావేశం అవుతోంది. అక్కడ వడ్డీరేట్లు వరుసగా ఐదు నెలలుగా తగ్గుతూ ప్రస్తుతం 43 నెలల కనిష్ఠ స్థాయిలో ఉన్నాయి. ఈ కారణంగా ఈ వారంలో జరిగే సమావేశం నుంచే వడ్డీరేట్ల తగ్గింపును ప్రారంభించవచ్చునన్నది పరిశీలకుల అభిప్రాయం. అదే జరిగితే ఎఫ్‌పీఐ పెట్టుబడులు అమెరికా నుంచి వర్ధమాన దేశాలకు..ప్రత్యేకించి మన దేశానికి మరలవచ్చునంటున్నారు. అయితే ప్రస్తుతం భారత ఈక్విటీల విలువలు గరిష్ఠంగా ఉండడం మాత్రం ఆందోళనకరమని చెబుతున్నారు.

మహారాష్ట్రకు అదానీ పవర్ విద్యుత్

న్యూఢిల్లీ: అదానీ పవర్ కంపెనీకి భారీ కాంట్రాక్టు లభించనుంది. దాదాపు 6,600 మెగావాట్ల థర్మల్, సౌర విద్యుత్ సరఫరా కోసం మహారాష్ట్ర విద్యుత్ పంపిణీ కంపెనీ (ఎంఎస్‌ఈడీసీఎల్) ఫ్లోట్ చేసిన టెండర్‌కు అదానీ పవర్ కంపెనీ యూనిట్‌కు రూ.4.08 ధర కోట్ చేసింది. జేఎస్‌డబ్ల్యు ఎనర్జీ, టోరెంట్ ఎనర్జీ కంపెనీల కంటే ఇది తక్కువ ధర. దీంతో ఈ కాంట్రాక్టు దాదాపుగా అదానీ పవర్‌కే లభిస్తుందని భావిస్తున్నారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పీపీఏ) కుదిరిన 48 నెలల్లో అదానీ పవర్ ఈ విద్యుత్ సరఫరా ప్రారంభిస్తుంది.

25000 పైన బుల్లిష్
(సెప్టెంబరు 16-20 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

అస్ట్రో గైడ్

గత వారం నిఫ్టీ : 25357 (+504)

నిఫ్టీ గత వారం 25433-24801 పాయింట్ల మధ్యన కదలాడి 504 పాయింట్ల లాభంతో 25357 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25600 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25161, 25061, 25114, 24832 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డిఎంఏ 200 డిఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 25600 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 25000
నిరోధ స్థాయిలు: 25560, 25660, 25760 (25460 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 25150, 25050, 24950

లార్జ్ క్యాప్ షేర్లే బెటర్..

గత వారం కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఎఫ్‌ఎంసీజీ, ఐటీ, మెటల్, మీడియా కంపెనీల షేర్లు మంచి లాభాలతో ముగిశాయి. ఎఫ్‌ఐఐల కొనుగోళ్లతో బ్యాంకింగ్, ఫైనాన్స్ కంపెనీల షేర్లలో మళ్లీ బుల్లిష్‌నెస్ కనిపిస్తోంది. ఎఫ్‌ఐఐల కొనుగోళ్లు, చమురు ధర తగ్గడం, ప్రధాన కరెన్సీలతో డాలర్ మారకం రేటు నీరసించడం, ప్రపంచవ్యాప్తంగా సెంట్రల్ బ్యాంకులు వడ్డీరేట్ల కోతకు సిద్ధమవడం ఈ వారం మార్కెట్‌కు కలిసొచ్చే అంశాలు. అయినా ఈ వారం సూచీలు మిశ్రమంగానే ట్రేడయ్యే అవకాశం ఉంది. నిఫ్టీ ఈ వారంలో కూడా 25000 శ్రేణిలోనే కొనసాగవచ్చు. మదుపరులు ఈ వారం లార్జ్ క్యాప్ షేర్లలో కొనసాగడమే మంచిది.

స్టాక్ రికమండేషన్లు

ఎల్‌ఐసీ హౌసింగ్ ఫైనాన్స్: ఆగస్టులో ఈ కంపెనీ షేర్లు జీవితకాల గరిష్ఠస్థాయిని తాకాయి. అయితే హెడ్‌లైన్ సప్లై రావడంతో ఒక్కసారిగా 23 శాతం మేర దిద్దుబాటుకు లోనయ్యాయి. ప్రస్తుతం కీలక మద్దతు స్థాయి రూ.700 వద్ద ట్రేడవుతున్నాయి. రిలేటివ్ స్ట్రెంత్ పెరగడం, కొనుగోళ్ల మద్దతుతో ఈ కౌంటర్‌లో మళ్లీ అప్‌ట్రెండ్ కనిపిస్తోంది. శుక్రవారం 2.79 శాతం లాభంతో రూ.723 వద్ద ముగిశాయి. రూ.770/805 టార్గెట్‌తో మదుపరులు రూ.720/700 శ్రేణిలో ఈ కౌంటర్‌లో పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.685ను గట్టి స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

పిరామల్ ఎంటర్‌ప్రైజెస్: రెండేళ్లుగా డౌన్‌ట్రెండ్‌లో ఉన్న ఈ కంపెనీ షేర్లలో గోల్డెన్ క్రాస్ ఓవర్‌తో మళ్లీ అప్‌ట్రెండ్ కనిపిస్తోంది. రూ.800 వద్ద మద్దతు తీసుకున్న ఈ కౌంటర్ ప్రస్తుతం రూ.1,120 వద్ద గట్టి నిరోధం ఎదుర్కొంటోంది. దీనిని అధిగమిస్తే అప్‌ట్రెండ్ మరింత బలపడుతుంది. శుక్రవారం ఈ కంపెనీ షేర్లు 4.69 శాతం లాభంతో రూ.1,119 వద్ద ముగిశాయి. రూ.1,250/1,310 టార్గెట్‌తో మదుపరులు రూ.1,100 స్థాయిలో ఈ కౌంటర్లో పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.1,070ను స్ట్రిక్ట్ స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

బంధన్ బ్యాంక్ : చాలా కాలంగా డౌన్‌ట్రెండ్‌లో ఉన్న ఈ కౌంటర్లో ప్రస్తుతం బేస్ ఏర్పడుతోంది. మరోసారి కీలక మద్దతు స్థాయి రూ.170 వద్ద బలం కనిపిస్తోంది. చివరి త్రైమాసిక ఆర్థిక ఫలితాలు బాగుండడం, డివిడెండ్ ప్రకటనతో ప్రస్తుతం ఈ బ్యాంక్ షేర్లలో సంస్థాగత మదుపరులు కూడా పెట్టుబడి పెడుతున్నారు. ఈపీఎస్ సైతం 1841 శాతం పెరిగింది. శుక్రవారం 5.41 శాతం లాభంతో రూ.207 వద్ద ముగిశాయి. రూ.245 టార్గెట్‌తో మదుపరులు ఈ కౌంటర్లో రూ.205/200 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.190ను కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

గోద్రెజ్ ప్రాపర్టీస్: జీవితకాల గరిష్ఠ స్థాయికి చేరాక, ఈ కంపెనీ షేర్లు 16 శాతం వరకు దిద్దుబాటుకు లోనయ్యాయి. ప్రస్తుతం ఈ కౌంటర్లో కన్సాలిడేషన్ కొనసాగుతోంది. రూ.2,850 స్థాయిలో మద్దతు లభించింది. శుక్రవారం 2.46 శాతం లాభంతో రూ.2,950 వద్ద ముగిశాయి. రూ.3,250 టార్గెట్‌తో మదుపరులు ఈ కౌంటర్లో రూ.2,940/2,920 శ్రేణిలో పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.2,880ను గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

అపోలో టైర్స్: ప్రస్తుతం ఈ కంపెనీ షేర్లు కన్సాలిడేషన్ ఆఖరి దశలో ఉన్నాయి. మరోసారి జీవితకాల గరిష్ఠ స్థాయివైపు పయనిస్తున్నాయి. సరఫరా తక్కువగా ఉండడంతో డిమాండ్ పెరుగుతోంది. శుక్రవారం రూ.526 వద్ద ముగిశాయి. మదుపరులు రూ.570 టార్గెట్‌తో రూ.520/500 శ్రేణిలో ఈ కౌంటర్లో పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.480ను కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

25000 పైన నిలదొక్కుకోవడం కీలకం

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ప్రారంభంలో 25000 స్థాయిలో రికవరీ సాధించి మరింత పురోగవించింది. గురువారం ఏర్పడిన ఆకస్మిక ర్యాలీలో 470 పాయింట్లకు పైగా లాభపడి 25000 కన్నా పైన క్లోజయింది. ముందు వారంతో పోల్చితే 500 పాయింట్ల మేరకు లాభపడి 25356 వద్ద జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో ముగిసింది. అలాగే మిడ్‌క్యాప్-100 ఇండెక్స్ 1500 పాయింట్లు, స్మాల్‌క్యాప్-100 ఇండెక్స్ 230 పాయింట్లు లాభపడి జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో ముగిశాయి. అయితే గత కొద్ది వారాల్లో పలు మధ్యస్థాయి, చిన్న స్థాయి షేర్లు కరెక్షన్ చవి చూశాయి. టెక్నికల్‌గా మార్కెట్ పటిష్ఠంగానే క్లోజయినప్పటికీ గరిష్ఠ స్థాయిల్లో కన్సాలిడేషన్ ఏర్పడాల్సి ఉంది. అమెరికన్ స్టాక్ మార్కెట్ సూచీ డో జోన్స్ కూడా 41,600 వద్ద నిలిచి ఉంది. గతంలో ఈ స్థాయిలోనే రెండు సార్లు కరెక్షన్ ఏర్పడింది. మార్కెట్ ఇప్పటికీ ఓవర్‌బాట్ స్థితిలో ఉన్నందు వల్ల అప్రమత్తత తప్పదు. గత వారంలో బ్రేకౌట్ ఏర్పడినందు వల్ల పుల్‌బ్యాక్ రియాక్షన్‌కు కూడా ఆస్కారం లేకపోలేదు.

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ట్రెండ్‌లో ట్రేడయితే తదుపరి నిరోధం 25440. ప్రధాన నిరోధ స్థాయిలు, మానసిక అవధులు 25500, 25550. ఈ స్థాయిలో కన్సాలిడేషన్ ఏర్పడవచ్చు. మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమించేందుకు స్వల్పకాలిక నిరోధం 25500 కన్నా పైన నిలదొక్కుకోవాలి.

బేరిష్ స్థాయిలు: బలహీనత ప్రదర్శించినా మైనర్ మద్దతు స్థాయి 25250 కన్నా పైన నిలదొక్కుకోవడం తప్పనిసరి. విఫలమైతే మైనర్ బలహీనతలో పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 25000. భద్రత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో ప్రవేశిస్తుంది.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం పునరుజ్జీవం సాధించిన ఈ సూచీ 1360 పాయింట్ల మేరకు లాభపడి 51940 వద్ద ముగిసింది. ఇప్పటికీ జీవితకాల గరిష్ఠ స్థాయి 53350 కన్నా దిగువనే ఉంది. మరింత పాజిటివ్ ట్రెండ్‌లో ట్రేడయితే ప్రధాన నిరోధం 52400 కన్నా పైన నిలదొక్కుకోవాలి. విఫలమై ప్రధాన మద్దతు స్థాయి 51500 కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత తప్పదు.

పాటర్న్: నిఫ్టీ 25000 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే బలహీనత సంకేతం ఇస్తుంది. అయితే ఈ స్థాయి కొంత దూరంగానే ఉంది. అలాగే 25500 వద్ద "ఏటవాలుగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిరోధం ఎదుర్కొంటోంది. సానుకూలత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	25,440, 25,500
మద్దతు	25,250, 25,170

ఐదున్నర నెలల్లో 50 వేల కోట్ల అప్పు

» జూలై వరకు 43 వేల కోట్లు తెచ్చారన్న కాగ్

(అమరావతి-ఆంధ్రజ్యోతి):

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఐదున్నర నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం రూ.50,000 కోట్ల అప్పులు చేసింది. ఏప్రిల్ నుంచి జూన్ 4వరకు వైసీపీ ప్రభుత్వం ఉంది. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ రెండు ప్రభుత్వాలు కలిపి ఇప్పటి వరకు రూ.50,000 కోట్ల అప్పులు తెచ్చాయి. ఏప్రిల్ నుంచి జూలై వరకు రూ.43,000 కోట్లు అప్పులు తెచ్చినట్టు కాగ్ నివేదిక వెల్లడించింది. ఆగస్టులో రూ.3,000కోట్లు, సెప్టెంబరులో రూ.4,000కోట్లు తెచ్చారు. కేంద్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొదటి 6 నెలలకు(ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు) రూ.47,000 కోట్ల అప్పులకు అనుమతివ్వగా, ఆ పరిమితి దాటి అదనంగా రూ.3,000 కోట్లు అప్పు తెచ్చారు. ఆర్థికశాఖ మాత్రం ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ రూ.44,000 కోట్ల అప్పులు తెచ్చామని, ఇంకో రూ.3,000 కోట్లు అప్పులు తెచ్చుకునే అవకాశం ఉందని చెబుతోంది.

ప్రధాని వీడియో హత్తుకుంది: మంత్రి లోకేశ్

అమరావతి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోషల్ మీడియాలో పెట్టిన 'దీపజ్యోతి' వీడియో హృదయాన్ని హత్తుకునేలా ఉందని మంత్రి నారా లోకేశ్ ప్రశంసించారు. 'పుంగనూరు గోజాతికి చెందిన లేగ దూడ 'దీపజ్యోతి' వీడియో చూసి, నేను చాలా సంతోషించాను. ఎందుకంటే ఈ పుంగనూరు మా చిత్తూరు జిల్లాలోనిది. ప్రధానమంత్రి నివాసంలో దీపజ్యోతి ద్వారా మా రాష్ట్రం, మా జిల్లాను చూడటం మాకు ఆనందాన్ని కలిగించింది' అని లోకేశ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

చంద్రబాబును భగవంతుడితో పోల్చుతున్నాడేమో?!

» ప్రకృతి వైపరీత్యాలన్నీ గాడ్ మేడే.. మేన్ మేడ్ ఉండదు

» జగన్‌ను ఉద్దేశించి ఉండి ఎమ్మెల్యే రఘురామ సెటైర్లు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 15: 'ప్రకృతి వైపరీత్యాలన్నీ గాడ్ మేడే.. మేన్ మేడ్ వరదలు ఎవరూ క్రియేట్ చేయలేరు.. అది తెలియకుండా చంద్రబాబు వల్లే వరదలు వచ్చాయంటూ జగన్ అంటున్నారంటే, ఆయన మా సీఎం చంద్రబాబును భగవంతుడితో పోల్చుతున్నాడేమో అని అనుకుంటున్నా' అని ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు వ్యాఖ్యానించారు. ఆదివారం రాజమహేంద్రవరంలో ఆయన మాట్లాడుతూ 'జగన్ ముఖ్యమంత్రి హోదాలో విఎస్‌యూజ్ చేసే అవకాశం ఉంది కాబట్టే.. ఆయన బెయిల్‌ను రద్దు చేయాలని ఆరోజు కోర్టును ఆశ్రయించాను. ఇప్పుడు పదవి పాయే. ఆ రీజన్ చెల్లదు. స్పీడప్ అవ్వాలని మరో పిటిషన్ ఉంది. అది స్పీడప్ అవుతుందని చూస్తున్నా' అని పేర్కొన్నారు. 'యుద్ధం అయిపోయింది, జగన్ ఓడిపోయాడు. ఇప్పుడింక పోరాటం ఏముంది? ఎన్నికల వరకే పోరాటం. పోరాడాం. జగన్ దారుణంగా ఓడిపోయారు. ఇంక పోరాడాల్సిన అవసరం లేదు. ఇప్పుడు అన్నీ ఊడగొట్టుకుని అతిగా ఆవేశపడుతున్నాడు. జైలులో ఉన్న తన తోటి క్రిమినల్స్‌ను జాగ్రత్తగా చూసుకోవడాన్ని పెద్దగా తప్పు పట్టాల్సిన అవసరం లేదు' అంటూ రఘురామ ఎద్దేవా చేశారు.

రాష్ట్రంలో భానుడి సెగలు

విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆదివారం వేసవి తరహాలో ఎండల తీవ్రత నెలకొంది. ఉదయం నుంచి ఎండ తీవ్రతతోపాటు ఉక్కపోతతో వేడి వాతావరణం కొనసాగింది. కావలిలో 39 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. పశ్చిమ బెంగాల్‌లో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండంతో తేమగాలులు వీస్తుండడంతో రాష్ట్రంలో అధిక వేడి, ఉక్కపోత కొనసాగిందని నిపుణులు పేర్కొంటున్నారు. వాయుగుండం పశ్చిమ దిశగా పయనించి పూర్తిగా బలహీనపడే వరకు రాష్ట్రంలో ఎండలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. రానున్న 24 గంటల్లో కోస్తాలో అక్కడక్కడా ఉరుములు, పిడుగులతో వర్షాలు కురుస్తాయని, రాయలసీమలో పొడి వాతావరణం నెలకొంటుందని వివరించారు.

టిడ్కో ఎండీ బదిలీ

అమరావతి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): టిడ్కో ఎండీగా ఉన్న ఎం.శ్రీకాంత్ వర్మను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన్ను ఏపీ ఆర్థికాభివృద్ధి బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాలిచ్చారు.



సీఎం చంద్రబాబుకు రూ.5 కోట్ల విరాళం అందిస్తున్న జీవీకే ఫౌండేషన్ చైర్మన్ జీవీకే రెడ్డి, జీవీ సంజయ్ రెడ్డి



మంత్రి నారా లోకేశ్‌కు రూ.5 కోట్ల చెక్కును అందిస్తున్న దివీస్ సీఈవో దివి కిరణ్



నెల్లూరుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త గంటా రమణయ్య నాయుడు, ఆయన కుమారుడు రమేశ్, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు, ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు కుమారులు ధనుష్, కార్తీక్ సంయుక్తంగా రూ.కోటి విరాళాన్ని సీఎం చంద్రబాబుకు అందజేశారు.

వరద బాధితులకు ఆపన్నహస్తం

» జీవీకే, దివీస్ సంస్థలు రూ.5 కోట్ల చొప్పున విరాళం

» సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లకు చెక్కుల అందజేత

అమరావతి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వరద బాధితులను ఆదుకునేందుకు పెద్ద మనసుతో అనేక మంది దాతలు ముందుకొస్తున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి, సీఎం సహాయ నిధికి పలువురు దాతలు విరాళాలను చెక్కుల రూపంలో అందజేశారు. విరాళాలు అందజేసిన దాతలకు సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. జీవీకే ఫౌండేషన్ చైర్మన్ జీవీకే రెడ్డి, జీవీ సంజయ్‌రెడ్డి రూ.5కోట్ల చెక్కు అందజేశారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ చైర్మన్ అరుణ్ అలగప్ప, ఎండీ శంకర్‌సుబ్రహ్మణ్యం రూ.కోటీ 50లక్షలు, కాంటినెంటల్ కాఫీ తరఫున చల్లా శ్రీకాంత్ రూ.కోటీ 11లక్షలు, చల్లా రాజేంద్రప్రసాద్ ఫ్యామిలీ ఫౌండేషన్ తరఫున చల్లా అజిత రూ.కోటి, ట్రైజియో టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ వేములపల్లి అశోక్, వేములపల్లి రోహిత్ రూ.కోటి, లారస్ ల్యాబ్స్ ఫౌండర్, సీఈవో డాక్టర్ సత్యనారాయణ చావా, నాగరాణి చావా రూ.కోటి అందించారు. అదేవిధంగా నెల్లూరుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త గంటా రమణయ్య నాయుడు, ఆయన కుమారుడు రమేశ్, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు, ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు కుమారులు ధనుష్, కార్తీక్ సంయుక్తంగా రూ.కోటి రూపాయల విరాళాన్ని సీఎం చంద్రబాబుకు అందజేశారు. అలాగే, చలసాని చాముండేశ్వరి, శ్రీమన్ రూ.25లక్షలు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ రూ.2లక్షలు, నరసింహారావు రూ.2లక్షలు సీఎంకు చెక్కు రూపంలో అందించారు. ఈ సందర్భంగా చంద్రబాబు వారితో మాట్లాడుతూ ఇలాగే ప్రజాసేవలో పాల్గొంటూ ముందుకు సాగాలని అభినందించారు.

దివీస్ సంస్థ మొత్తం 9.8కోట్ల భూరి విరాళం!

దివీస్ సంస్థ సీఈవో దివి కిరణ్ ఆదివారం హైదరాబాద్‌లో మంత్రి నారా లోకేశ్‌ను కలిసి రూ.5కోట్ల చెక్కును అందజేశారు. ఈ నెల 1 నుంచి 8 వరకు వరద బాధితులకు ఆహారాన్ని అందించేందుకు ఇంతకుముందే అక్షయపాత్ర ఫౌండేషన్‌కు దివీస్ సంస్థ రూ.4.8కోట్లను అందజేసింది. మొత్తం రూ.9.8కోట్లు విరాళమిచ్చిన దివీస్‌ను లోకేశ్ అభినందించారు.

నేడు గుజరాత్‌కు సీఎం చంద్రబాబు

» రెన్యూవబుల్ ఎనర్జీ సదస్సుల్లో పాల్గొననున్న సీఎం

అమరావతి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాజధాని గాంధీనగర్‌లో ఈ నెల 16 నుంచి 18 వరకు జరగనున్న రెన్యూవబుల్ ఎనర్జీ(ఆర్‌ఈ) ఇన్వెస్టర్స్ మీట్-2024లో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు సోమవారం ఆ రాష్ట్రానికి వెళ్లనున్నారు. పునరుత్పాదక విద్యుత్తు రంగంలో ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాల గురించి ఆయన సదస్సులో కీలకోపన్యాసం చేస్తారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో సమావేశమవుతారు.

ప్రధాని మోదీతో ప్రత్యేక సమావేశం!

ఆర్‌ఈ ఇన్వెస్ట్-2024కు ముఖ్యఅతిథిగా ప్రధాని మోదీ హాజరవుతున్నారు. ఈ సందర్భంగా ప్రధానితో సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా భేటీ అయ్యే అవకాశాలున్నాయని అధికార వర్గాలు చెబుతున్నాయి.

బాధితులను కేంద్రం ఆదుకుంటుంది

» కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ వెల్లడి

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 15: రాష్ట్రంలో ఇటీవల సంభవించిన వరదల కారణంగా నష్టపోయిన వారిని ఆదుకోవడానికి కేంద్రం సానుకూలంగా ఉందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఆదివారం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఒక ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన తనను కలిసిన మీడియాతో మాట్లాడుతూ వరద నష్టానికి సంబంధించి పూర్తి వివరాలు రాగానే సహాయం అందించడానికి కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటికే కేంద్రం తాత్కాలిక సాయం అందించిందని, కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి చౌహాన్ వచ్చి పరిశీలించి వెళ్లారని అన్నారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం అన్నివిధాలుగా కట్టుబడి ఉందని పేర్కొన్నారు. అమరావతి అభివృద్ధికి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి భారీగా నిధులు కేటాయించిందని, రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులపై సమీక్ష చేస్తున్నదని తెలిపారు. సమస్యల సుడిగుండంలో ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంటును ఏ విధంగా బయటకు తీసుకురావాలనే దానిపై కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. ఈ ప్రైవేట్ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు రఘురామకృష్ణంరాజు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, దాట్ల బుచ్చిరాజు, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రవాణా చార్జీలు ఖరారు

(మొదటి పేజీ తరవాయి)

చర్చలు జరిపాయి. ఈ సందర్భంగా అవి ఇచ్చిన సూచనల మేరకు రవాణా చార్జీలను ఖరారు చేసినట్లు గనుల శాఖ పేర్కొంది. ఇసుక సరఫరా చేసే స్టాక్ పాయింట్ల నుంచి డెలివరీ చేసేవరకు ఉండే దూరాన్ని ప్రామాణికంగా తీసుకొని ధరలను నిర్ణయించారు. ట్రాక్టర్‌కు 4.5 టన్నులు, ఆరు టైర్ల లారీకి 10 టన్నులు, 10 నుంచి 14 టైర్ల లారీకి 18 నుంచి 35 టన్నుల వరకు కిలో మీటరుకు ఏ మేరకు ధర వసూలు చేయాలో ప్రభుత్వం ఈ జీఓలో నిర్దేశించింది. స్టాక్ పాయింట్ నుంచి పది కిలో మీటర్ల లోపుగా 4.5 టన్నుల ట్రాక్టర్‌కు కిలో మీటరుకు రూ.13.5 చొప్పున ధర వసూలు చేయాలి. ఆరు టైర్ల లారీకి 10 టన్నులకు గాను కిలోమీటరకు 10.7, 10-14 టైర్ల లారీకి 18 నుంచి 35 టన్నుల లారీకి 9.4 రూపాయల చొప్పున ధర నిర్ణయించారు. 11 నుంచి 20 కి.మీ దూరంలో ఇసుక డెలివరీ చేయాలనుకుంటే, తొలి 10 కి.మీ వరకు ఆర్ 1 ధర, ఆ తర్వాత 11 వ కి.మీ నుంచి ఆర్ 2 ధర వర్తింపజేస్తారు. ఇలా కిలోమీటరు చొప్పున ధరలను ఖరారు చేశారు. రాష్ట్రమంతటా ఇవే ధరలను అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని గనుల శాఖ కమిషనర్‌ను ఆదేశించారు.

ప్రభుత్వం నిర్ణయించిన రవాణా చార్జీలు ఇవే..

దూరం (స్లాబ్)	ట్రాక్టర్ (4.5 టన్నులు)	6-టైర్ల లారీ (10 టన్నులు)	10నుంచి 14 టైర్ల లారీ (18-35 టన్నులు)
0-10 కి.మీ (ఆర్1)	13.5	10.7	9.4
11-20 కి.మీ(ఆర్2)	12.8	10.2	8.9
21-30 కి.మీ(ఆర్3)	12.8	10.2	8.9
31-40 కి.మీ(ఆర్4)	12.8	10.2	8.9
40-80 (ఆర్5)	6.3	6.3	6.3
80 కి.మీపైనే(ఆర్6)	-	3.5	3.5

కిలోమీటరుకు సగటు చార్జీ జీఎస్టీతో కలుపుకొని...

ధరల నిర్ణయం ఇలా:

తొలి పది కిలోమీటర్ల మేరకు టేబుల్‌లో పేర్కొన్న విధంగా కిలో మీటర్ చొప్పున ట్రాక్టర్/లారీకి రవాణా చార్జీని వసూలు చేస్తారు. ఆ తర్వాత 11-20 కి.మీ పైన తొలి పది కిలో మీటర్లకు టేబుల్‌లో పేర్కొన్నట్లుగా ఆర్ 1 ధర, ఆ తర్వాత 11 నుంచి 20 కి.మీ వరకు అదనంగా ఆర్ -2 ధరలను వసూలు చేస్తారు. ఉదాహరణకు స్టాక్ పాయింట్ నుంచి 14 కి.మీ దూరంలో ట్రాక్టర్‌తో ఇసుక డెలివరీ చేయాలంటే తొలి 10 కిలో మీటర్లకు సగటున కిలో మీటర్‌కు రూ.13.5ల చార్జీ ఉంటుంది. ఆ తర్వాత 11వ కి.మీ నుంచి రూ. 12.8 చొప్పున ధర వసూలు చేస్తారు. ఆ పైన 4 కి.మీ దూరానికి రూ.12.8 చొప్పున రూ.51.2 చార్జీ ఉంటుంది. ఇలా మొత్తం 14 కి.మీ దూరానికి రూ.186.2 వసూలు చేస్తారు. అదే ట్రాక్టర్‌కు 40 కిమీ దూరంలో ఇసుక డెలివరీ చేయాలంటే, రూ.519 మేర చార్జీ ఉండనుంది.

'రివర్స్' రివర్సయింది!

» జలవనరుల శాఖలో తిరిగి 2003 నాటి టెండర్ విధానం

అమరావతి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం అట్టహాసంగా తీసుకొచ్చిన రివర్స్ టెండరింగ్ విధానాన్ని టీడీపీ కూటమి ప్రభుత్వం రివర్స్‌లోకి నెట్టింది. మళ్లీ 2003 నాటి జీవో 94ను అమల్లోకి తెచ్చింది. తక్కువ ధరకు పనులు పూర్తి చేస్తామంటూ లిఖితపూర్వకంగా వేసే బిడ్లను ఆమోదించే ప్రక్రియను తీసుకొచ్చింది. టెండర్‌లో పాల్గొన్న కాంట్రాక్టు సంస్థల్లో ఎల్-1గా ఉన్న సంస్థకు పనులు అప్పగించే విధానాన్ని అమలు చేస్తామంటూ గత నెలలో జరిగిన భేటీలో రాష్ట్ర కేబినెట్ తీర్మానాన్ని ఆమోదించిన సంగతి తెలిసిందే. పోలవరం ప్రాజెక్టులో రివర్స్ టెండర్ విధానంతో ఏకంగా రూ.860 కోట్లు ఆదా చేశామంటూ జగన్ ప్రభుత్వం ప్రచారం చేసుకుంది. కానీ వాస్తవాన్ని పరిశీలిస్తే ఈ రివర్స్ టెండర్‌లో పనులు పొందిన కాంట్రాక్టు సంస్థకు తెరవెనుక కట్టబెట్టిందే ఎక్కువని తేలింది. చంద్రబాబు ప్రభుత్వం ఇప్పుడు వీటిన్నిటినీ పరిశీలించి.. రివర్స్ టెండర్ విధానాన్ని సమీక్షించింది. ఇదే సమయంలో రాష్ట్ర చీఫ్ ఇంజనీర్ల బోర్డు కూడా రివర్స్ టెండర్ విధానం రద్దుకు సిఫారసు చేస్తూ గత నెల 8న ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఈ నేపథ్యంలో గత నెలలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో రివర్స్ టెండర్ విధానాన్ని రద్దు చేయాలన్న జల వనరుల శాఖ ప్రతిపాదనను ఆమోదించారు. దీంతో.. 2003 జూలై ఒకటో తేదీన జారీ చేసిన జీవో 94 మేరకు టెండర్ విధానాన్ని అమల్లోకి తెస్తూ జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఆదివారం ఉత్తర్వు జారీ చేశారు.

గోదావరి బేసిన్ భూభాగంలో చమురు నిక్షేపాలు..!

» నదీ పరీవాహక ప్రాంతంలో సహజవాయువులు

» బీఎస్ఐపీ శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడి

లఖ్‌నవూ, సెప్టెంబరు 15: గోదావరి నదీ పరీవాహక ప్రాంతంలోని భూభాగంలో (గతంలో నదీ ఆధిపత్యంలో ఉన్న నేటి భూభాగం) చమురు, సహజవాయువుల నిక్షేపాలు ఉండే అవకాశం ఉందని బీర్బల్ సాహ్నీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పాలియోసైన్సెస్ (బీఎస్ఐపీ) శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఇవి సాధారణంగా సముద్ర క్రమంలో కనిపిస్తాయని, కానీ.. భూభాగంలో వీటి లభ్యతను గుర్తించడం సవాలుతో కూడుకున్న అంశమని పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త నేహా అగర్వాల్ తెలిపారు. ఈ సీక్వెన్స్ స్ట్రాటిగ్రఫీని గుర్తించేందుకు పాలినాలజీ, జియోకెమికల్ టూల్స్‌ను ఉపయోగించినట్టు చెప్పారు. 'సీక్వెన్స్ స్ట్రాటిగ్రఫీ అనేది సముద్ర మట్టాలలో క్రమంగా వచ్చే మార్పుల కారణంగా కాలక్రమేణా అవి ఎలా నిక్షిప్తమయ్యాయో అర్థం చేసుకోవడానికి, రాతి పొరలను అధ్యయనం చేయడానికి భూగర్భ శాస్త్రవేత్తలు ఉపయోగించే సాంకేతికత. పెర్మియన్ కాలంలో ఒక భౌగోళిక సంఘటన కారణంగా గోండ్వానా ఉపఖండంలో ఒక మహాసముద్రం - నియో - టెథిస్.. తెరుచుకుంది. సముద్ర మట్టాలు పెరగడం కూడా గోదావరి లోయలోని బొగ్గు క్షేత్రాన్ని ప్రభావితం చేసింది' అని అగర్వాల్ తెలిపారు. 'పాలియో ఎన్విరాన్‌మెంట్ (గత పర్యావరణం)ను అర్థం చేసుకోవడానికి శాస్త్రవేత్తలు ఈ ప్రాంతంలో నిక్షిప్తమైన బొగ్గు, రాతి పొరలు సహా మరిన్ని అవక్షేపాలను అధ్యయనం చేశారు. పరిశోధనలో భాగంగా ఆర్గానిక్ కార్బన్ పరిమాణాన్ని కొలిచారు. ఈ క్రమంలో హైడ్రోకార్బన్ ఉత్పత్తికి అవకాశం ఉన్న ప్లాంక్టానిక్ జీవుల నిక్షేపణను గుర్తించారు. కాబట్టి ఈ హైడ్రోకార్బన్‌లో చమురు, సహజవాయువులు ఉంటాయి' అని అగర్వాల్ తెలిపారు. గోదావరి నదీ పరీవాహక ప్రాంతంలో చమురు, సహజవాయువుల నిక్షేపాలను కనుగొనేందుకు ఇదొక ప్రాథమిక ప్రయత్నమని మరో శాస్త్రవేత్త దివ్య మిశ్రా చెప్పారు.

ఐపీఎస్‌లపై వేటు

(మొదటి పేజీ తరవాయి)

నటి కాదంబరి జెత్వానీ వ్యవహారంలో ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు, విజయవాడ మాజీ పోలీస్ కమిషనర్ కాంతి రాణా తాతా, విజయవాడ మాజీ డీసీపీ విశాల్ గున్నీని రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసింది. జెత్వానీ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విజయవాడ పోలీసులు ఇచ్చిన నివేదికను డీజీపీ ద్వారకా తిరుమల రావు ప్రభుత్వానికి నివేదించారు. దీన్ని పరిశీలించిన ప్రభుత్వం ముగ్గురు ఐపీఎస్ అధికారులను సస్పెండ్ చేస్తూ జీవో 1590, 1591, 1592 విడుదల చేసింది. మాజీ సీఎం జగన్ స్నేహితుడు సజ్జన్ జిందాల్‌ను కాదంబరి పెట్టిన కేసు నుంచి కాపాడేందుకు ఆమెను అక్రమ కేసులో ఇరికించి నరకం చూపించారు. వైసీపీ పెద్దల ఆదేశాల మేరకు ఐపీఎస్‌లు పీఎస్ఆర్, కాంతిరాణా, విశాల్ గున్నీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారు. ఆమెను, కుటుంబ సభ్యులను అరెస్ట్ చేసి టార్చర్ పెట్టారు. ఈ ముగ్గురు ఐపీఎస్‌లపై గతంలో కూడా తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రానికి డీజీపీ కావాలనే ధ్యేయంతో ప్రతిపక్ష పార్టీల నేతల్ని హింసించడం, ప్రశ్నించే గొంతుకల్ని నొక్కేయడం, తప్పుడు కేసులతో వేధించడం లాంటి అడ్డగోలు పనులు చేసినట్టు ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులుపై విమర్శలు ఉన్నాయి. కుప్పంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి దొంగ ఓట్లు వేయించడం నుంచి బెజవాడలో అడ్డమైన పనులు చేయడం వరకు కాంతిరాణాపై ఆరోపణలు ఉన్నాయి. పోస్టింగ్ కోసం రాజధాని రైతుల్ని హింసించడం మొదలు దళితులపైనే అట్రాసిటీ కేసులు పెట్టిన ఘనత నాడు గుంటూరు ఎస్పీగా విశాల్ గున్నీ సొంతం.

వైసీపీ పెద్దల ఆదేశాలతో...

ఈ ఏడాది జనవరి చివరి వారంలో తాడేపల్లి ప్యాలెస్ నుంచి పీఎస్ఆర్ ఆంజనేయులుకు పిలుపొచ్చింది. ముంబైలో ఉన్న సినీ నటి కాదంబరి జెత్వానీని ఏదో ఒక కేసులో ఇరికించి ఏపీకి లాక్కొచ్చి ఒక సెటిల్మెంట్ చేయాలని వైసీపీ పెద్దల నుంచి ఆదేశాలొచ్చాయి. అంతే ఆమెకు వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్‌తో ఉన్న పాత పరిచయాన్ని తెరపైకి తెచ్చారు. ఆయన భూమి కాజేసేందుకు కాదంబరి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారని కేసు పెట్టేందుకు ప్లాన్ వేశారు. జనవరి 31న నాటి విజయవాడ పోలీస్ కమిషనర్ కాంతి రాణా, డీసీపీ విశాల్ గున్నీని తాడేపల్లి ప్యాలెస్‌కు పిలిపించి కాదంబరి జెత్వానీని అరెస్టు చేయాలని చెప్పారు. పీఎస్ఆర్ ఆంజనేయులు ఆదేశాల మేరకు వెంటనే డీసీపీ విశాల్ గున్నీ, టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ రమణమూర్తి, ఇబ్రహీంపట్నం సీఐ, ఎస్ఐతో టీమ్ సిద్ధం చేశారు. ఫిబ్రవరి 1న నలుగురికీ విజయవాడ సీపీ కార్యాలయం నుంచి ముంబైకి విమాన టికెట్లు బుక్ అయ్యాయి. కానీ ఆ టికెట్లకు డబ్బులు సీపీ అధికారిక ఖాతా నుంచి ఎక్కడా డ్రా చేయలేదు. ముంబైకి వెళ్లే పోలీసు బృందం ఫిబ్రవరి 2న ఉదయం ఐదున్నరకే బయలుదేరి ఆరింటికి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని ఏడున్నరకు విమానం ఎక్కింది. అదే రోజు ఉదయం ఆరున్నర, ఏడు గంటల మధ్య ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్‌లో జెత్వానీపై విద్యాసాగర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. అంటే.. డీసీపీ బృందం విమానాశ్రయానికి బయలు దేరినప్పటికీ ఎఫ్ఐఆర్ ఇంకా నమోదు కాలేదు. పీఎస్ఆర్ ఆంజనేయులు ఇంతటి స్కెచ్ వేస్తే అందుకు సీనియర్ ఐపీఎస్ అధికారులు కాంతి రాణా, విశాల్ గున్నీ సహకరించారు.

జగన్ మిత్రుడి కోసమే...

వైఎస్ఆర్ బతికి ఉన్నప్పుడు జగన్ రెడ్డికి వ్యాపార మెలకువలు నేర్పించమని తనను అడిగారంటూ కడప స్టీల్ ప్లాంట్ భూమిపూజ సందర్భంగా వ్యాఖ్యానించిన పారిశ్రామిక వేత్త సజ్జన్ జిందాల్ కోసమే ఒక మహిళను జగన్ వేధింపులకు గురి చేశారు. లైంగికంగా తనను వాడుకుని మోసం చేశారంటూ జిందాల్‌పై జెత్వానీ ముంబైలో పెట్టిన కేసు వెనక్కి తీసుకోవడానికి ఎలాగైనా ఒప్పించే ప్రయత్నంలో భాగంగా ముగ్గురు ఐపీఎస్‌లు కుట్ర పన్ని అమలు చేశారు. వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్‌తో ఆమెకు గతంలో ఉన్న పరిచయం ఆధారంగా ఒక నకిలీ డాక్యుమెంటు సృష్టించారు. కృష్ణా జిల్లాలో తనకున్న ఐదెకరాల పొలాన్ని నకిలీ అగ్రిమెంట్‌తో అమ్మేసేందుకు జెత్వానీ ప్రయత్నిస్తున్నారని, కొండపల్లి కిల్లాకు చెందిన నాగేశ్వరరావు, భరత్ అనే వ్యక్తుల నుంచి ఐదు లక్షలు అడ్వాన్స్ తీసుకున్నారని ఫిబ్రవరి 2న ఉదయం 6.30కి విద్యాసాగర్ ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తాజాగా పోలీసుల విచారణలో కాదంబరి ఎవరో తమకు తెలియదంటూ కొండపల్లి ఖిల్లాకు చెందిన నాగేశ్వర రావు, భరత్ వెల్లడించారు. విద్యాసాగర్ తెలుసు కానీ ముంబై నటి గురించి తెలియదని, ఆమెకు ఐదు లక్షలిచ్చి అగ్రిమెంట్ చేసుకోలేదని స్పష్టం చేశారు. జెత్వానీ ఇచ్చిన తాజా ఫిర్యాదులో తాను 2020లో కొనుగోలు చేసిన ఇంటి చిరునామాను... 2018లో చేసుకున్న అగ్రిమెంట్‌లో పెట్టారని, దీన్ని ఇటీవల సృష్టించిందేనని అనుమానం వ్యక్తం చేశారు. ఆ అగ్రిమెంట్ ఇక్కడే ఒంగోలు వ్యక్తి సృష్టించారని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఆ ఐపీఎస్‌లు గీత దాటారు

జెత్వానీ కేసులో కర్త, కర్మ, క్రియగా వ్యవహరించిన ఐపీఎస్‌లు పీఎస్ఆర్ ఆంజనేయులు, కాంతిరాణా తాతా, విశాల్ గున్నీ ఎక్కడెక్కడ పరిధి దాటి వ్యవహరించారో డీజీపీ ద్వారకా తిరుమల రావు ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. కేసు నమోదు చేసి ముంబై నటిని వేధించిన స్థానిక సీఐ, డీఏస్పీని ఇప్పటికే సస్పెండ్ చేశానని పేర్కొన్నారు. విజయవాడ పోలీస్ కమిషనర్ విచారణలో సాక్షులు, బాధితురాలు చెప్పిన అంశాలను పరిశీలిస్తే ఐపీఎస్‌లు, పోలీసులు తప్పు చేసినట్లు తేలిందని పదహారు పేజీల నివేదికలో పేర్కొన్నారు. హడావుడిగా ముంబైకి వెళ్లేందుకు నలుగురికి విమాన టికెట్లు బుక్ చేయాలంటూ తన సీసీని ఆదేశించిన కాంతిరాణా విమానంలో వెళ్లే పోలీసులకు పాస్‌పోర్టు ఇవ్వలేదన్నారు. ఒక మహిళను అరెస్టు చేయాలంటే కచ్చితంగా మహిళా పోలీసు ఉండాలన్న నిబంధన కూడా పాటించకుండా పోలీసు కమిషనర్ బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. జెత్వానీపై ఎఫ్ఐఆర్ నమోదైన గంటలోనే విశాల్ గున్నీ ఎటువంటి సమాచారం లేకుండా ముంబైకి విమానం ఎక్కి వెళ్లారని, పై అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదన్నారు. ఒక పోలీసు అధికారి రాష్ట్రం దాటి వెళ్లేముందు తగిన పాస్‌పోర్టు పోలీసు శాఖ నుంచి తీసుకోవాల్సి ఉంటుందన్న కనీస నిబంధనలు కూడా పాటించలేదన్నారు. విధి నిర్వహణలో భాగంగా వెళ్లిన ప్రయాణ ఖర్చులు కూడా క్లెయిమ్ చేసుకోలేదని, ఈ వ్యవహారంలో గున్నీ చర్యలు దుష్ప్రవర్తన కిందికి వస్తాయన్నారు.

పీఎస్ఆర్‌పై ఎన్నో ఆరోపణలు

ఐపీఎస్ అధికారులుగా చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులు జగన్ ప్రభుత్వంలో వైసీపీ చట్టాన్ని అమలు చేశారు. జగన్ రెడ్డిని ప్రశ్నించిన ఎవరినైనా సరే ఏదో ఒక కేసు పెట్టి జైలులో తోయడం ఎలా అనే దానిపై మొత్తం పథక రచన చేసి, నాటి సీఎంతో అంజన్నా అని పిలిపించుకునేవారు పీఎస్ఆర్ ఆంజనేయులు. శ్రీకాకుళంలో అచ్చెన్నాయుడు నుంచి అనంతపురంలో జేసీ ప్రభాకర్ రెడ్డి వరకూ.. హైదరాబాద్‌లో రఘురామ రాజు నుంచి నంద్యాలలో చంద్రబాబు వరకూ ఎవరిని అక్రమంగా జైలుకు పంపాలన్నా ఆయనదే స్కెచ్ అన్నది పోలీసు శాఖలో బహిరంగ రహస్యమే. జగన్ మెప్పు పొంది డీజీపీ అవ్వాలనే లక్ష్యంతో ఆయన చేసిన అరాచకాలు రాష్ట్ర చరిత్రలో ఏ ఐపీఎస్ అధికారి కూడా చేసి ఉండరు.

వెంకటరామిరెడ్డిని కాపాడుతున్నదెవరు?

» వైసీపీ వీరవిధేయుడికి రక్షణ

» ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలూ లేవు

» అనుమానాలకు తావిస్తున్న ప్రభుత్వ వైఖరి

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె. వెంకట్రామిరెడ్డిపై కూటమి ప్రభుత్వం కూడా వల్లమాలిన ప్రేమ కనబరుస్తోందా...? జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే అలాంటి సంకేతాలే కనిపిస్తున్నాయి.! ఎన్నికల కోడ్ సమయంలో వెంకట్రామిరెడ్డి నిబంధనలకు విరుద్ధంగా బద్వేలు, కడప, ప్రొద్దుటూరు ప్రాంతాల్లో వైసీపీకి అనుకూలంగా రాజకీయ ప్రచారం చేశారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన ఎన్నికల సంఘం ఆయనను సస్పెండ్ చేయాలని అప్పటి సీఎస్ జవహర్ రెడ్డికి ఆదేశాలిచ్చింది. అప్పుడు కూడా వారం రోజుల పాటు ఆ ఫైలు అలాగే ఉంచారు. 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో వెంకట్రామిరెడ్డిని సస్పెండ్ చేశారు. తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. అయినప్పటికీ వెంకట్రామిరెడ్డిపై నిబంధనల ప్రకారం అభియోగాలు నమోదు చేయలేదు. పైగా... ఏకంగా ఆయన సస్పెన్షన్ ఎత్తివేతను ప్రతిపాదిస్తూ ఫైలు పెట్టారు. పంచాయతీరాజ్ శాఖలో అడిషనల్ సెక్రటరీగా ఉన్న హనుమంతరెడ్డి ఈ ఫైలు పెట్టారు. అయితే.. ఆ శాఖ ముఖ్యకార్యదర్శి ఆదేశాల మేరకే హనుమంతరెడ్డి ఆ ఫైలు పెట్టినట్టు తెలుస్తోంది. విషయం బయటకు పొక్కడంతో ఆ ఫైలును ఆపేసి, వెంకట్రామిరెడ్డిపై అభియోగాలు నమోదు చేస్తూ ఆగస్టు 21న జీవో ఇచ్చారు. 10 రోజుల్లో దీనిపై వెంకట్రామిరెడ్డి వివరణ ఇవ్వకపోతే శాఖాపరమైన చర్యలు నేరుగా తీసుకుంటామని ఆ జీవోలో పేర్కొన్నారు. సెప్టెంబరు 1తో ఆ పది రోజుల గడువు ముగిసింది. అది దాటి పదిహేను రోజులైనా వెంకట్రామిరెడ్డిపై శాఖాపరంగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇన్ని రోజులైనా చర్యలు తీసుకోకపోవడం, దీనికంటే ముందు సస్పెన్షన్ ఎత్తివేతకు ప్రతిపాదించడం... ఇవన్నీ చూస్తుంటే వెంకట్రామిరెడ్డిని కాపాడేందుకు గట్టి ప్రయత్నాలే జరుగుతున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వెంకట్రామిరెడ్డి విషయంలో జరుగుతున్న పరిణామాలు ఆ శాఖ ముఖ్యకార్యదర్శికి ఎందుకు తెలియడం లేదో ఆశ్చర్యంగా ఉంది. పక్కా వైసీపీ భక్తుడు, జగన్‌కి వీరవిధేయుడు, ఎన్నికల్లో నిబంధనలకు విరుద్ధంగా పబ్లిక్‌గా వైసీపీకి ప్రచారం చేసిన వ్యక్తిని ఇప్పుడు ఈ ప్రభుత్వంలో ఇంతలా కాపాడుతున్నది ఎవరన్న దానిపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఆయనను కాపాడడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ శ్రేణులకు ప్రభుత్వం ఎలాంటి సంకేతాలిస్తోంది..? జగన్ హయాంలో రెచ్చిపోయి టీడీపీ శ్రేణులపై దాడులకు పాల్పడిన వైసీపీ నాయకులపై చంద్రబాబు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదన్న అసంతృప్తి తీవ్రంగా ఉంది. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర పరిపాలనకు కేంద్రమైన సచివాలయంలో కూడా ఒక వైసీపీ వీరభక్తుడిని ఇంతలా కాపాడాల్సిన అవసరం ఏముందో ప్రభుత్వ పెద్దలకే తెలియాలి.

సీక్రెట్ ఆపరేషన్.. సీక్రెట్ ఫండ్

» అడ్డంగా బుక్కైన పీఎస్ఆర్ ఆంజనేయులు

» విశాల్ గున్నీ స్టేట్‌మెంట్‌తో మెడకు ఉచ్చు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'ఎంత కరుడుగట్టిన, తెలివైన నేరస్తుడైనా ఎక్కడో చిన్న తప్పు చేస్తాడు. మాకు దొరికిపోతాడు'.. ఇది పోలీసులు చెప్పే కొటేషన్. 'ఎంత రాటుదేలిన పోలీసైనా ఆరాటం ఎక్కువై ఎక్కడో ఏదో పొరపాటు చేస్తాడు. అడ్డంగా దొరికి పోతాడు'.. ఇది ఇప్పటి సీన్. ఒక సినీ నటిని అక్రమంగా నిర్బంధించారనే అభియోగాలతో ఒక డీజీ ర్యాంకు అధికారి, మరో ఐజీ ర్యాంకు అధికారి, డీఐజీ స్థాయి అధికారి సస్పెండయ్యారు. ఏదైనా తప్పు చేస్తున్నప్పుడు చేతికి మట్టి అంటకుండా చేయడంలో పోలీసుల్ని మించిన వారెవ్వరూ ఉండరు. అందులోనూ ఇలాంటి విషయాల్లో పీహెచ్‌డీ చేసిన ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు లాంటి వ్యక్తి ఎలా అడ్డంగా దొరికిపోయారో? ఇది పోలీసు అధికారుల్ని వేధిస్తున్న ప్రశ్న. దీనికి సమాధానం చాలా సింపుల్. ఎంతటి తెలివైన పీఎస్ఆర్ అయినా ఎక్కడో తప్పు చేయక పోరు. ఆ తప్పే ఈ ముగ్గురినీ కాటేసింది. ముంబై నటి జెత్వానీపై వైసీపీ నేత విద్యాసాగర్ ఫిర్యాదు ఇవ్వడానికి కొన్ని గంటల ముందే ఆమెను పట్టుకురావడానికి విశాల్ గున్నీ మరో ముగ్గురు పోలీసులు ముంబైకి విమానంలో టికెట్ బుక్ చేసుకున్నారు. ఎవరైనా ఫిర్యాదు ఇస్తే.. 'దీన్ని మేం ఎగ్జామిన్ చేయాలి.. ఆరోపణలు నిర్ధారించుకోవాలి.. నోటీసులు ఇవ్వాలి' అంటూ సతాయించే పోలీసులు ఫిర్యాదుకు ముందే ముంబైకి వెళ్లేందుకు ఎలా సిద్ధమయ్యారు? రేపు ఫిర్యాదు ఇస్తారని ఇవాళే ఎలా పసిగట్టారు? అనే ప్రశ్న దగ్గరే కీలక వ్యవహారమంతా ముడిపడింది. విశాల్ గున్నీ తన అధికార విధుల్లో భాగంగా ముంబైకి వెళితే ముందుగా డీజీపీ అనుమతి తీసుకోవాలి. తిరిగి వచ్చాక టీఏ, డీఏ క్లెయిమ్ చేయాలి. కానీ ఇంతవరకూ ఆయన బిల్లు పెట్టలేదు. ఆరా తీస్తే తెలిసిందేంటంటే.. ఆ టికెట్ అధికారికంగా బుక్ కాలేదు. ఒక ఐపీఎస్ బయటి ప్రాంతాలకు వెళ్లాలంటే ముందుగా ఉన్నతాధికారులు ఆయనకు అనుమతి పత్రం జారీ చేయాలి. దాన్ని పోలీసు పరిభాషలో పాస్‌పోర్టు అంటారు. ఈయన విషయంలో అది కూడా లేదు. రానూ పోనూ ప్రయాణ టికెట్లను తన సొంత డబ్బు నుంచి ఖర్చు చేసినప్పటికీ తిరిగి వచ్చాక బిల్లు క్లెయిమ్ చేయాలి. కానీ ఆయన వైపు నుంచి ఇలాంటివి ఏమీ జరగలేదు. దానికి కారణమే పీఎస్ఆర్‌ను దోషిగా నిలబెట్టింది. సాధారణంగా జిల్లా ఎస్పీ, నగర సీపీ స్థాయి యూనిట్ అధికారుల వద్ద రహస్య ఫండ్ ఉంటుంది. ఇలాంటిదే ఇంటెలిజెన్స్ చీఫ్ వద్ద కూడా ఉంటుంది. నేరస్తులకు సంబంధించిన సమాచారాన్ని అందించిన వారికి ఈ ఫండ్ నుంచే డబ్బులు చెల్లిస్తారు. దీనికి ఎవ్వరూ లెక్క అడగరు. బిల్లులు ఉండవు. విశాల్ గున్నీ టికెట్ సీపీ కార్యాలయం నిధుల నుంచి బుక్ కాలేదు. అది పీఎస్ఆర్ ఆంజనేయులు చీఫ్‌గా ఉన్న ఇంటెలిజెన్స్ సీక్రెట్ ఫండ్ నుంచి ఖర్చు చేశారు. ఒక అధికారి తన అధికార విధుల్లో భాగంగా వెళుతున్నప్పుడు సీక్రెట్ ఫండ్ ఎందుకు వినియోగించారు? అంటే.. ఇదంతా సీక్రెట్ ఆపరేషనేనా అనే కోణంలో ఆరా తీస్తే మొత్తం డొంక కదిలింది. 'అసలు నిన్ను ముంబై ఎవరు వెళ్లమన్నారు.. టికెట్‌కు డబ్బులు ఎవరిచ్చారు.. నువ్వెందుకు క్లెయిమ్ చేయలేదు' అని ఉన్నతాధికారులు విచారిస్తే జరిగిన కథంతా గున్నీ విడమరిచి చెప్పారని తెలిసింది. దీంతోపాటు పీఎస్ఆర్ ఆంజనేయులు జనవరి 31నుంచి తనను ఎలా ఉపయోగించుకున్నదీ లిఖిత పూర్వకంగా స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు సమాచారం. ఇదే ఇప్పుడు పీఎస్ఆర్ మెడకు చుట్టుకుంది. ఆయన ప్రియ శిష్యుడు, ఈ ఎపిసోడ్‌లో కీలక పాత్రధారి అయిన కాంతి రాణా తాతా కూడా చిక్కుల్లో పడ్డారు.

ఫైబర్ నెట్ ఈడీ జగన్మోహనరావుపై వేటు

- ఎండీ సిఫారసుకు ప్రభుత్వం ఆమోదం
- డేటా మాయం, నియామకాల్లో అవకతవకలపై ఆరోపణలు

అమరావతి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అడ్డగోలుగా ఉద్యోగ నియామకాలు, జీతభత్యాల ఖరారు.. మాస్టర్ డేటా మాయం వంటి ఆరోపణలతో ఏపీ ఫైబర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిల్లా జగన్మోహనరావు సస్పెండ్ అయ్యారు. ఈడీగా ఆయన తీసుకున్న నిర్ణయాలు సంస్థకు నష్టం చేకూర్చే విధంగా ఉన్నాయని గుర్తించిన ఫైబర్ నెట్ ఎండీ దినేశ్‌కుమార్ ఆయనను సస్పెండ్ చేయాలని ఆదివారం ప్రభుత్వానికి సిఫారసు చేశారు. దీనిపై ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి యువరాజ్ సింగ్ సానుకూలంగా స్పందించడంతో ఆయనపై సస్పెన్షన్ వేటు పడింది. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి, ఆయన వ్యక్తిగత సహాయకుడు నాగేశ్వరరెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి సిఫారసు చేసిన వారందరికీ ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చేశారు. ఈ నియామకాలు, జీతభత్యాల ఖరారులో పెద్ద కుంభకోణమే చోటు చేసుకుందన్న ఆరోపణలు వచ్చాయి. వీటన్నింటిపైనా కూటమి సర్కారు వచ్చాక దర్యాప్తు చేస్తోంది. ఫైబర్‌నెట్‌ను ప్రక్షాళన చేసేందుకు సన్నద్ధమైంది. ఈ నేపథ్యంలో.. 2019 నుంచి 2024 దాకా ఉన్న మాస్టర్ డేటాను పరిశీలించేందుకు ఎండీ దినేశ్ సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే మాస్టర్ డేటాను చెరిపేసినట్టు, దీనిలో గత ప్రభుత్వ హయాంలో కీలక బాధ్యతలు నిర్వర్తించిన వారి హస్తమున్నట్టు గుర్తించారు. ఈడీ జగన్మోహనరావు తీసుకున్న నిర్ణయాలు సంస్థకు నష్టం చేకూర్చేవిగా ఉన్నాయని గుర్తించిన ఎండీ ఆయనను సస్పెండ్ చేయాలని ప్రభుత్వానికి సస్పెండ్ చేస్తూ ప్రభుత్వానికి సిఫారసు చేశారు. దానికి ప్రభుత్వం కూడా ఓకే తెలిపింది.

నేటి నుంచి విశాఖ-దుర్గ్ వందే భారత్

- పార్వతీపురంలో హాల్ట్.. జిల్లావాసుల హర్షం

పార్వతీపురం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): విశాఖ నుంచి దుర్గ్ వరకు నడవనున్న వందేభారత్ రైలు సోమవారం లాంఛనంగా ప్రారంభం కానుంది. ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. తొలిరోజు ఇది ఒడిశా రాష్ట్రం రాయగడ వరకు మాత్రమే నడుస్తుంది. 20 నుంచి రెగ్యులర్‌గా రాకపోకలు కొనసాగుతాయి. ఈ రైలుకు పార్వతీపురంలో హాల్ట్ ఇవ్వడంపై జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దుర్గ్‌లో ఉదయం 5.45 గంటలకు బయలు దేరే ఈ రైలు.. రాయ్‌పూర్, కరియార్ రోడ్డు, కంటాబంజి, టిట్లాగఢ్, కేసింగ, రాయగడ స్టేషన్‌లతో పాటు పార్వతీపురం, విజయనగరంలో ఆగి విశాఖ చేరుకుంటుంది. పార్వతీపురంలో ఉదయం 11.30కు వచ్చి రెండు నిమిషాలు ఆగి.. 11.32కు బయలుదేరుతుంది. తిరుగుపయనంలో విశాఖలో మధ్యాహ్నం 2.50 గంటలకు బయలుదేరి పార్వతీపురంలో సాయంత్రం 4.36 గంటలకు వచ్చి 4.38 నిమిషాల వరకు ఆగుతుంది. రాత్రి 10.30 గంటలకు అది దుర్గ్ చేరుకుంటుంది. మన్యం జిల్లావాసులు రాయగడ, రాయపూర్ తదితర ప్రాంతాలకు వెళ్లడానికి ఈ రైలు సౌలభ్యంగా ఉంటుంది.

వైద్య కళాశాలలపై విషం!

(మొదటి పేజీ తరువాయి)

ఒక్క రూపాయి కేటాయించలేదు.

ఇదేనా చిత్తశుద్ధి?

వైద్య కాలేజీల్లో రూ.2,125 కోట్ల విలువైన పనులనే వైసీపీ ప్రభుత్వం చేయగలిగింది. అందులోనూ కాంట్రాక్ట్ సంస్థలకు రూ.1,451 కోట్ల బిల్లులు మాత్రమే చెల్లించింది. ఇంకా రూ.674 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది. మెడికల్ కాలేజీల నిర్మాణంపై అంతలా బాధపడుతున్న జగన్ ఎందుకు బిల్లులు బకాయి పెట్టారో చెప్పాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఇటీవల ప్రశ్నించారు. నాలుగేళ్లలో 25శాతం పనులు కూడా చేయకపోగా, 16శాతం బిల్లులు మాత్రమే చెల్లించిన జగన్‌కు మెడికల్ కాలేజీల నిర్మాణంలో ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందని మండిపడ్డారు. ఈ విద్యా సంవత్సరంలో మెడికల్ కాలేజీల్లో ప్రవేశాలు చేపట్టకపోవడానికి కేవలం జగనే బాధ్యుడని మంత్రి స్పష్టం చేశారు.

అందుకే అనుమతులు రాలేదు

మరోవైపు పార్వతీపురం మెడికల్ కాలేజీకి సంబంధించిన టెండర్ ప్రక్రియను ఇప్పటి వరకూ పూర్తి చేయలేదు. బిల్లులు సక్రమంగా చెల్లించకపోవడంతో కాంట్రాక్ట్ సంస్థలు పనులు నిలిపేశాయి. కొన్ని సంస్థలు అయితే నెలల తరబడి పనులు నిలిపేసిన సందర్భాలు ఉన్నాయి. అసలు కాలేజీల నిర్మాణాలు గత ప్రభుత్వంలోనే నిలిచిపోయాయి. అందుకే ఫేజ్-2 మెడికల్ కాలేజీలకు ఎన్ఎంసీ అనుమతులు లభించలేదు. ఐదు కాలేజీల్లో నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉండటంతో పాటు ఫ్యాకల్టీ నియామకాలు కూడా పూర్తి చేయలేదు. దీంతో అడ్మిషన్లకు ఎన్ఎంసీ అనుమతి ఇవ్వలేదు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను కూటమి ప్రభుత్వంపై నెట్టేందుకు జగన్ అండ్ కో తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

గత ప్రభుత్వం వైద్య కాలేజీల కోసం చేసిన ఖర్చు వివరాలు. (రూ.కోట్లల్లో)

కాలేజీ	నిర్మాణ వ్యయం	రుణాలు	4ఏళ్లలో చేసిన పనులు	పెండింగ్ బిల్లులు
	నాబార్డు రుణంతో నిర్మించే కాలేజీలు			
విజయనగరం	500	500	169	63
మార్కాపురం	475	275	75	28
మదనపల్లె	475	275	71	41
పులివెందుల	500	275	371	79
ఆదోని	475	500	71	24
నర్సీపట్నం	500	375	27	15
అమలాపురం	475	475	109	50
పాలకొల్లు	475	275	70	70
బాపట్ల	505	297	69	49
పెనుగొండ	475	275	54	35
పార్వతీపురం	600	150	టెండర్లు పిలిచారు	
కేంద్ర ప్రభుత్వం నిధులతో నిర్మించే కాలేజీలు				
పాడేరు	500	325	156	39
మచిలీపట్నం	550	325	248	40
పిడుగురాళ్ల	500	325	217	39
కేంద్ర ప్రత్యేక సహకారం, ఆరోగ్యశ్రీ నిధులు				
రాజమండ్రి	475	80	123	35
ఏలూరు	525	139	177	34
నంద్యాల	475	82	118	28
మొత్తం	8,480	4,948	2,125	674

అప్పులతో నిర్మాణాలు

మెడికల్ కాలేజీల్లో ఇప్పటివరకూ చేపట్టిన నిర్మాణాలు మొత్తం అప్పుల తెచ్చిన నిధులతో చేపట్టినవే. రూ.8,480కోట్లలో నాబార్డు నుంచి రూ.3,672కోట్లు రుణాలు తీసుకున్నారు. కేంద్రం రూ.975 కోట్ల వరకూ ఇచ్చింది. ఇవికాకుండా కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక సహకారం కింద మరో రూ.301 కోట్లు తీసుకునేందుకు వైసీపీ ప్రభుత్వం సిద్ధమైంది. వీటితో పాటు ఆరోగ్యశ్రీ రోగులకు వైద్యం అందించాల్సిన నిధులను కూడా మెడికల్ కాలేజీలకు మళ్లించారు. నాలుగేళ్లలో నాబార్డు, కేంద్రం, ఆరోగ్యశ్రీ నిధుల ద్వారా సేకరించిన నిధుల నుంచే కాంట్రాక్ట్ సంస్థలకు బిల్లులు చెల్లించారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. నాబార్డు అయినా, కేంద్రం అయినా అవి నిధులు విడుదల చేసిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద కొంత మొత్తాన్ని ఇవ్వాల్సి ఉంది. నాబార్డు ఇస్తున్న రుణాలు, కేంద్రం ఇస్తున్న నిధులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి మ్యాచింగ్ గ్రాంట్ లేకపోవడంతో రెండో విడత నిధులు విడుదల ఆగిపోయింది. దీంతో గత ప్రభుత్వం పీజీ సీట్ల నిధులను కూడా కాలేజీలకు మళ్లించింది. పాత మెడికల్ కాలేజీల్లో పీజీ సీట్లు పెంపు కోసం కేంద్రం రాష్ట్రానికి దాదాపు రూ.700కోట్ల వరకూ ఇచ్చింది. ఈ మొత్తాన్ని విడతల వారీగా విడుదల చేయాలని నిర్ణయించింది. ఈ నిధులను కూడా వైసీపీ ప్రభుత్వం మెడికల్ కాలేజీల కోసం మళ్లించింది. దీనికి ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు కూడా సహకరించారు. చేయాల్సిన తప్పులన్నీ చేసేసిన జగన్.. ఇప్పుడేదో ఎంబీబీఎస్ విద్యార్థులకు అన్యాయం జరిగిపోతుందని ఆరోపణలు చేస్తున్నారు. పీజీ సీట్ల కోసం కేటాయించిన నిధులు వాటికే ఉపయోగించకపోతే ఆ సీట్లు పోతాయన్న విషయం తెలిసి కూడా జగన్ ప్రభుత్వం వాటిని నిర్మాణాలకు మళ్లించింది. పీజీ సీట్లు పోయినా విద్యార్థులకు నష్టం రాదని, ఎంబీబీఎస్ సీట్లు రాకపోతే మాత్రం నష్టపోతారని చెప్పడంపై జగన్ స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

అవినీతి 'గని' పరార్!

(మొదటి పేజీ తరువాయి)

వెలుగుచూసింది. ఇసుక అక్రమాల కేసులో ప్రభుత్వం, ఏసీబీ అన్ని శుభముహూర్తాలు చూసుకునేసరికి అసలు నిందితుడు వాటి కళ్లుగప్పి జారుకున్నాడు. ఇప్పుడు ప్రభుత్వం ఏం చేస్తుంది.. ఆయన కోసం విదేశాల్లో వెతుకుతుందా.. ఇంకేం చర్యలు తీసుకుంటుందన్న చర్చ నడుస్తోంది. ప్రభుత్వ అలసత్వం, సకాలంలో కేసును కొలిక్కి తీసుకురాలేక పోవడం వల్లే వెంకటరెడ్డి ముందుగానే తన దారి చూసుకున్నారని అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. రక్షణ రంగంలో కోస్ట్‌గార్డ్ సీనియర్ సివిలియన్ స్టాఫ్ అధికారి (ట్రైనింగ్)గా ఉన్న వెంకటరెడ్డి.. 2019లో జగన్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రానికి డిప్యుటేషన్‌పై వచ్చారు. తొలుత విద్యాశాఖలో పనిచేశారు. తర్వాత గనుల శాఖ డైరెక్టర్‌గా, ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరించిన సంగతి తెలిసిందే. ఇసుక అమ్మకం కాంట్రాక్టు టెండర్లు, నిర్వహణతోపాటు అనేకానేక అంశాల్లో వెంకటరెడ్డి కేంద్రంగా అవినీతి, అక్రమాలు జరిగాయని కొత్త ప్రభుత్వం భావించింది. ఎన్నికల ఫలితాలు వచ్చిన మూడో రోజే అంటే జూన్ 7న ఆయనపై బదిలీ వేటు వేసింది. తదుపరి పోస్టింగ్ కోసం జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఆయన పట్టించుకోకపోగా.. విజయవాడ విడిచివెళ్లారు. జూలై 31న వెంకటరెడ్డి డిప్యుటేషన్ గడువు ముగిసింది. సర్కారు అప్పటికప్పుడు మేల్కొని అదే రోజున ఆయన్ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చింది.

3 నెలలుగా దాగుడుమూతలు..

వెంకటరెడ్డి ఇసుక టెండర్లు, అమ్మకాల ప్రక్రియలో అనేక అక్రమాలకు పాల్పడ్డారని, ఆయనపై విచారణ చేయాలని గనుల శాఖ డైరెక్టర్ జూలై 27వ తేదీన ప్రభుత్వానికి లేఖ రాశారు. జూలై 31నే ఆయన్ను ప్రభుత్వం సస్పెండ్‌చేసింది. సస్పెన్షన్ సమయంలో హెడ్‌క్వార్టర్ వదిలివెళ్లకూడదని ఆదేశించింది. చెప్పకుండా అమరావతి విడిచి వెళ్లకూడదని స్పష్టం చేసింది. కానీ ఆ ఆదేశాలను వెంకటరెడ్డి లెక్కచేయలేదు. ఆయనపై వచ్చిన ఫిర్యాదులపై విచారణకు అనుమతి కోరుతూ ఏసీబీ నుంచి సీఎస్‌కు లేఖ వెళ్లింది. సీఎస్ ఆగస్టు 7న సమగ్ర విచారణకు అనుమతించారు. మర్నాడు ఏసీబీ విచారణ మొదలుపెట్టింది. సెప్టెంబరు 11న వెంకటరెడ్డిపై ఎఫ్ఐఆర్ నమోదుచేసింది. వాస్తవానికి ఎన్నికల ఫలితాలు వచ్చిన మూడ్రోజులకే ఆయనపై బదిలీ వేటు పడింది. జీఏడీలో రిపోర్టు చేయాలని ఇచ్చిన ఆదేశాలను ఆయన పాటించలేదు. పత్తా లేకుండా పోయారు. దీనిని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి ఉంటే.. అప్పుడే ఆయన ఎక్కడున్నారో తెలుసుకునే అవకాశం ఉండేది. సస్పెన్షన్ ఉత్తర్వులు తీసుకునేందుకు కూడా ఆయన అందుబాటులో లేరు. ఆగస్టు 31న వెంకటరెడ్డి పదవీ విరమణ చేశారు. ఆ తర్వాత ఈ నెల రెండో వారంలో ఆయన అమరావతికి వచ్చి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం తనను సస్పెండ్ చేసిందని, తనపై తీసుకున్న చర్యలను పక్కనపెట్టేలా ఆదేశాలివ్వాలని అందులో కోరారు. ఆ వెంటనే తిరిగి హైదరాబాద్ వెళ్లిపోయారు. ఇది జరిగిన మూడ్రోజులకు.. అంటే ఈ నెల 11న ఏసీబీ కేసు నమోదు చేసింది. ఆ తర్వాత వెంకటరెడ్డి కోసం గాలింపు చేపట్టింది. కడప, తిరుపతి, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో సోదాలు జరిపినా ఆయన జాడ తెలియలేదు. 11వ తేదీకి ముందే ఆయన ఆయన దేశం విడిచి వెళ్లిపోయినట్లు తెలిసింది. తనకు వ్యతిరేకంగా ప్రభుత్వం ఏం చేస్తోంది.. ఎలాంటి చర్యలకు దిగుతుందో ఆయన ముందుగానే పసిగట్టారు. ప్రతి కీలకమైన సమాచారాన్నీ పొందగలిగారు. అందుకే చాలా వ్యూహాత్మకంగా.. కేసు నమోదుకు ముందే విదేశాలకు సేఫ్‌గా పారిపోగలిగారని అధికార వర్గాలు చెబుతున్నాయి.

ఉద్యోగులపై నాటి జగన్ సర్కారు కర్కశం

- హక్కుల కోసం ప్రశ్నిస్తే కేసులు..బెదిరింపులు
- ఆర్థిక విధ్వంసంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేసినందుకు వేధింపులు
- ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ ఆవేదన
- నాడు చంద్రబాబు అండగా నిలిచారని వెల్లడి

అమలాపురం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): గత జగన్ ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయుల పట్ల కర్కశంగా వ్యవహరించిందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ విమర్శించారు. హక్కుల కోసం, ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రశ్నిస్తే కేసులు, బెదిరింపులకు పాల్పడ్డారని తెలిపారు. ఆదివారం ఆ సంఘం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాశాఖ సమావేశంలో సూర్యనారాయణ మాట్లాడుతూ నాటి ప్రభుత్వం రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడిందన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు దాచుకున్న సొమ్ములకు సైతం భద్రత లేకుండా చేయడాన్ని వివరిస్తూ అప్పట్లో గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తే.. తనను, తన కుటుంబాన్ని, ప్రాతినిధ్యం వహిస్తున్న సంఘ సభ్యులందరినీ వైసీపీ ప్రభుత్వం వేధించిందన్నారు. ఎస్ఆర్కే(సజ్జల రామకృష్ణారెడ్డి)ని క్షమాపణ కోరకపోతే ఆ భగవంతుడు కూడా నిన్ను రక్షించలేడని ఆలిండియా సర్వీసు పోలీసు అధికారి సైతం తనను హెచ్చరించారని వివరించారు. 'ఎక్కడ తిరిగానో ఎలా ఉన్నానో తెలియదు. అటువంటి పరిస్థితుల్లో అండగా నిలిచి ధైర్యం చెప్పింది నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు మాత్రమే. సుప్రీంకోర్టు ఇచ్చిన యాంటిసిపేటరీ బెయిల్‌తో మళ్లీ బాహ్యప్రపంచంలోకి వచ్చా. రాష్ట్రంలో జరిగిన ఆర్థిక విధ్వంసంపై శాసన సభా నాయకుడిగా ముఖ్యమంత్రి చంద్రబాబు శ్వేతపత్రం విడుదల చేశారు. అప్పటికీ అందుబాటులో ఉన్న సమాచారం మేరకు రూ.22,980 కోట్ల బకాయిలను ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు చెల్లించాల్సి ఉంది. అదే విషయాన్ని అప్పట్లో గవర్నర్‌కు ఫిర్యాదుచేస్తే జగన్ ప్రభుత్వం నన్ను దేశద్రోహిగా చిత్రీకరించింది' అన్నారు. ఉద్యోగులకు భరోసా కల్పించేలా చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉద్యోగులు, ఉపాధ్యాయులు భయాన్ని వీడి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేలా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో సంఘాన్ని సంస్థాగతంగా మరింత పటిష్ఠ పరిచి రాష్ట్రంలోనే నంబర్ వన్ సంఘంగా తీర్చిదిద్దుతానని ప్రకటించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపారావు, వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

బెజవాడ వరద జగన్‌దే పాపం!

- కోటి విరాళం ఎవరికిచ్చారో చెప్పాలి: మంత్రి డోలా



ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 15: విజయవాడ వరద పాపం మాజీ ముఖ్యమంత్రి జగన్‌దేనని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు కాలువ కట్టలపై మట్టిని కూడా వదలకుండా తవ్వి అమ్ముకున్నారన్నారు. దాని ఫలితంగానే విజయవాడను వరద ముంచెత్తిందని తెలిపారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వరద బాధితులకు జగన్ ప్రకటించిన రూ.కోటి విరాళం ఎవరికి ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వైద్య కళాశాలలను రద్దు చేయట్లేదని, వాటిలో వసతులను పెంచుతున్నామని తెలిపారు.

ఆ బోట్ల రంగులు అందరికీ తెలుసు

- గత ఐదేళ్లలో వ్యవస్థలన్నీ నాశనం: సోమిరెడ్డి



తిరుమల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వరద సమయంలో ప్రకాశం బ్యారేజీ వద్దకు కొట్టుకొచ్చిన బోట్లు ఎవరివో, వాటి రంగులు ఏమిటో అందరికీ తెలుసని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. జరగరానిది జరిగితే పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఆ బోట్ల యజమానులకు బాధ్యత లేదా? ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగేలా నిర్లక్ష్యంగా ఉండటం కూడా తప్పే కదా! అంటూ మండిపడ్డారు. ఆదివారం తిరుమలలో శ్రీవారి ఆలయం వెలుపల విలేకరులతో మాట్లాడారు. గత ఐదేళ్ల పాలనలో వ్యవస్థలన్నీ నాశనమయ్యాయని, తిరిగి వాటిని సాధారణ స్థితికి తీసుకురావాల్సి ఉందని చెప్పారు. తమ ప్రభుత్వానికి మంచి శక్తిసామర్థ్యాలు ప్రసాదించాలని శ్రీవారిని కోరుకున్నట్టు తెలిపారు.

త్వరలో ఆపరేషన్ బుడమేరు!

- కాలువలు, చెరువులు ఆక్రమణకు గురికాకుండా పకడ్బందీ చర్యలు
- 'ఆంధ్రజ్యోతి'తో మంత్రి నారాయణ

అమరావతి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వరదల బారి నుంచి ప్రజలను రక్షించేందుకు త్వరలో రాష్ట్రవ్యాప్తంగా 'ఆపరేషన్ బుడమేరు' ప్రారంభమవుతుందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. దీని ద్వారా కాలువలు ఎంత వెడల్పు ఉండాలో.. అంతే ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రాష్ట్రంలో కాలువలు, చెరువులు ఆక్రమణకు గురి కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని తెలిపారు. బుడమేరు ప్రాంతంలో ఆక్రమణలను తొలగించి.. అక్కడివారికి టిడ్కో ఇళ్లు ఇచ్చి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు. విజయవాడ వరద బాధిత ప్రాంతాల్లో ఎన్యుమరేషన్ ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. సీనియర్ అధికారులు పరిశీలించిన తర్వాత సీఎంకు నివేదిస్తామని.. ఈ నెల 17 నుంచి పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంత్రి ఆదివారం తన నివాసంలో 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. విజయవాడలో వరదలు, ప్రభుత్వ సహాయ చర్యలను వివరించారు. అనూహ్య వర్షాలు, వరదతో విజయవాడ నగరంలోని 32 డివిజన్లు ముంపునకు గురయ్యాయని, సుమారు 7 లక్షల మంది ప్రజలు ప్రభావితులయ్యారని తెలిపారు. నగరం మధ్యలో నుంచి వెళ్లే బుడమేరు కాలువకు 11,500 క్యూసెక్కుల నీటి సామర్థ్యం ఉంటే.. 30 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చిందన్నారు. 'భారీ వర్షాలకు ఈ కాలువ, కృష్ణానది ఒకేసారి నిండిపోయాయి. ప్రకాశం బ్యారేజీకి మునుపెన్నడూ లేని విధంగా 11.43 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సకాలంలో స్పందించడం వల్లనే వందల మంది ప్రాణాలు కాపాడుకోగలిగాం. 10 రోజుల తర్వాత నగరంలో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. మొదట్లో ఒకట్రెండు రోజులు ప్రజలు అసహనానికి గురైనా.. ఆ తర్వాత ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రభుత్వ యంత్రాంగం ప్రజల మన్ననలు పొందింది' అని చెప్పారు. ఇప్పటికే ముఖ్యమంత్రి కేంద్ర వ్యవసాయ మంత్రితో చర్చించారని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో పాటు బ్యాంకుల సాయం తీసుకుని బాధితులకు పరిహారం అందజేస్తామన్నారు. అమరావతి మునిగిపోయిందని వైసీపీ వాళ్లు వదంతులు పుట్టించారని ఆక్షేపించారు. కృష్ణా నదిలో భారీ వరద వచ్చినా.. రాజధాని చెక్కుచెదరలేదన్నారు. గతంలో కూడా ఇలాంటి ప్రచారాలు చేసి ప్రపంచ బ్యాంకు నుంచి రుణం రాకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు. కృష్ణా కరకట్ట ఎత్తు పెంచి రోడ్లు నిర్మించేలా మరో 2-3 నెలల్లో టెండర్లు పిలుస్తామన్నారు.

డ్రైనేజీ కాలువలు పూర్తయి ఉంటే..

2014-19 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వం మున్సిపల్ శాఖ ద్వారా మురుగునీటి ప్రవాహ కాలువలు తీసుకొచ్చిందని, వాటిని వైసీపీ ప్రభుత్వం పూర్తిచేయకపోవడం వల్లే ఇప్పుడీ పరిస్థితి ఏర్పడిందని మంత్రి చెప్పారు. భవన నిర్మాణాలకు గతంలో ఆన్‌లైన్ ద్వారా అనుమతులిచ్చామని.. ఈ విషయంలో అధికారులు 15 రాష్ట్రాల్లో అధ్యయనం చేసి నివేదికలు సిద్ధం చేశారని తెలిపారు. వాటన్నిటినీ క్రోడీకరించి మెరుగైన విధానాన్ని తీసుకొస్తామని, అనుమతుల నిబంధనలు కఠినతరం చేసి ప్రమాదాలను నివారిస్తామని చెప్పారు.

రైతులు కోరుకున్న చోటే ప్లాట్లు

- రాజధాని రైతులకు మంత్రి నారాయణ ఓపెన్ ఆఫర్

మంగళగిరి, సెప్టెంబరు 15: గతంలో రాజధానికి భూములు ఇవ్వని రైతులు సైతం నేడు స్వచ్ఛందంగా భూములిచ్చేందుకు ముందుకొస్తున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు. అప్పట్లో భూములు ఇచ్చిన రైతులకు లాటరీ పద్ధతిలో ప్లాట్లు ఇచ్చామని, ప్రస్తుతం కొంత మేర మాత్రమే భూముల అవసరం వుందని, ఇప్పుడు ఇచ్చే రైతులకు వరుస క్రమంలో వారు కోరుకున్న చోట్ల ప్లాట్లు కేటాయిస్తామని ఓపెన్ ఆఫర్ ప్రకటించారు. గుంటూరు జిల్లా ఎర్రబాలెంలో ఆదివారం ఆయన పర్యటించారు. 11 మంది రైతులు ల్యాండ్ పూలింగ్ ద్వారా 12.27 ఎకరాల భూమి ఇచ్చారు. నారాయణ నేరుగా రైతుల ఇళ్లకు వెళ్లి ల్యాండ్ పూలింగ్ పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం రెండు విడతల వార్షిక కౌలు చెల్లింపు చేయలేదని, కూటమి ప్రభుత్వం రెండు రోజుల్లో ఒక విడత వార్షిక కౌలు చెల్లిస్తుందని, త్వరలోనే మరో విడత చెల్లిస్తామని తెలిపారు. భారీ వర్షాల కారణంగా రాజధానిలో నిలిచిన ముళ్ల కంప తొలగింపు పనులను 2 రోజుల్లో ప్రారంభిస్తామన్నారు. ఐఐటీ నిపుణుల నివేదిక రాజధాని నిర్మాణానికి అనుకూలంగా వచ్చిందని, దాని ఆధారంగా పనులు చేపడతామన్నారు.



రైతుల నుంచి ల్యాండ్ పూలింగ్ పత్రాలు స్వీకరిస్తున్న మంత్రి నారాయణ

ప్రతి ప్రశ్నకూ ఒకే సమాధానం

- నాకు తెలియదు.. గుర్తులేదు!
- టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో పోలీసు కస్టడీలో నందిగం సురేశ్
- విచారణకు సహకరించని వైనం
- ఆదివారం రాత్రి స్టేషన్‌లోనే నిద్ర



వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను మంగళగిరి సర్కిల్ కార్యాలయానికి తీసుకువచ్చిన పోలీసులు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 15: 'ఏ ప్రశ్న అడిగినా ఒకటే సమాధానం... తెలియదు, గుర్తులేదు'... టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో బాపట్ల వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ పోలీస్ కస్టడీలో చెప్పిన మాటిది. విచారణకు ఆయన సహకరించలేదని తెలుస్తోంది. ఈ కేసులో ఆదివారం మంగళగిరి రూరల్ పోలీసులు ఆయన్ను కస్టడీలోకి తీసుకున్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి మధ్యాహ్నం ఒంటి గంటకు రూరల్ సర్కిల్ కార్యాలయానికి తీసుకొచ్చారు. సురేశ్‌ను చూసేందుకు ఆయన భార్య, పిల్లలు, బంధువులు, అనుచరులు వచ్చినప్పటికీ పోలీసులు ప్రాంగణం వెలుపలే నిలువరించారు. తొలుత ఆదివారం సాయంత్రం ఆరు గంటల వరకు విచారణ కొనసాగింది. మంగళగిరి రూరల్ సీఐ, కేసు దర్యాప్తు అధికారి శ్రీనివాసరావు పలు ప్రశ్నలు సంధించారు. గతంలో సురేశ్‌ను పోలీసులు విచారించినప్పుడు టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి జరిగిన రోజు తాను కూడా వెళ్లానని, అయితే అది సరైన విధానం కాదని భావించి వెనక్కి వచ్చేశానని ఆయన తెలిపారు. అదే కోణంలో ఇప్పుడు కూడా పోలీసులు విచారణ చేపట్టారు. దాడి జరిగిన రోజు ఎన్ని, ఏయే వాహనాల్లో వెళ్లారు? ఏ ఫోన్లు ఉపయోగించారు? వంటి ప్రశ్నలను అడిగినట్టు సమాచారం. అయితే పోలీసులు అడిగిన ఏ ప్రశ్నకూ సురేశ్ సరైన సమాధానం ఇవ్వలేదని తెలిసింది. సోమవారం కూడా విచారణ కొనసాగనుంది. న్యాయస్థానం ఆదేశాల మేరకు సురేశ్ తరఫు న్యాయవాది బాజీగంగాధర్ రావును విచారణ సందర్భంగా పోలీసులు అనుమతించారు. ఆదివారం రాత్రి ఆయన పోలీసు స్టేషన్‌లోనే నిద్రించారు.

నేడు కస్టడీలోకే

టీడీపీ ఆఫీసుపై దాడి కేసులో నిందితుడిగా ఉన్న సురేశ్ అరెస్టు భయంతో సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకుని ఈ నెల 5వ తేదీన పారిపోయారు. ముందస్తు ప్రయత్నించగా మంగళగిరి రూరల్ పోలీసులు హైదరాబాద్‌లో అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. మంగళగిరి కోర్టులో హాజరు పర్చగా న్యాయస్థానం 14 రోజుల పాటు రిమాండ్ విధించింది. నందిగం సురేశ్‌ను విచారణ నిమిత్తం కస్టడీకి ఇవ్వాలని పోలీసులు న్యాయస్థానాన్ని విన్నవించారు. దీంతో న్యాయస్థానం రెండు రోజుల పాటు పోలీసు కస్టడీకి అనుమతి ఇచ్చింది. ఆదివారం నుంచి మంగళవారం 12 గంటల వరకు ఆయనను పోలీసు కస్టడీలో విచారణను ఎదుర్కొంటారు.

బోటు ఆపరేషన్‌లో 'కావడి'



విజయవాడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బావులు, చెరువుల నుంచి నీళ్లు తెచ్చుకునేందుకు పాత కాలంలో కావడి ఉపయోగించేవారు. అంటే చెక్క బద్దకు ఇరు వైపులా వేలాడదీసిన తాళ్లకు బిందెలు కట్టుకుని నీళ్లు తెచ్చుకునేవారు. నాడు గ్రామాల్లో ఉపయోగించిన ఈ కావడి విధానాన్ని ఇప్పుడు ప్రకాశం బ్యారేజీ వద్ద బోటు తొలగింపు ఆపరేషన్‌లో వాడాలని ఇంజనీరింగ్ నిపుణులు భావించారు. దీనికోసం దుర్గాఘాట్ చెంతనే పనులు చేపట్టారు. బ్యారేజీ వద్ద ఇరుక్కున్న బోట్లను ఒడ్డుకు చేర్చే క్రమంలో ఒక బోటు నీటిలో మునిగిపోయిన విషయం తెలిసిందే. మూడు రోజులుగా 450 మీటర్ల ఇనుప రోప్‌ను అమర్చి మోడల్ గెస్ట్‌హౌస్ నుంచి భారీ క్రేన్‌తో లాగుతున్నారు. ఆదివారం సాయంత్రానికి ఈ బోటు ఒక దశను దాటి మరో దశకు చేరుకుంది. బ్యారేజీ గేట్ల వెనుక భాగంలో పెద్దపెద్ద రాళ్లు ఉండటంతో బోటు త్వరగా ముందుకు రాలేదని గుర్తించారు. ఇప్పటి వరకు రాళ్లపై ఉన్న బోటు ఆదివారం మధ్యాహ్నానికి ఇసుక మేట వేసిన ప్రాంతానికి వచ్చింది. దీంతో క్రేన్ ఎలాంటి ఒత్తిడి, భారం లేకుండా బోటును సులువుగా ముందుకు లాగింది. బోటు ఇసుక ప్రదేశానికి చేరుకోవడంతో సులువుగా ముందుకు కదిలిందని అబ్బులు టీం గుర్తించింది. క్రేన్ సహాయంతో మరింత ముందుకు లాక్కొచ్చే అవకాశం ఉంది. అయితే, ఈ బోటుకు సమీపంలో బ్యారేజీ వెనుక నిర్మించిన సేఫ్టీ వాల్ ఉంది. బోటును ముందుకు లాగితే ఆ వాల్ దెబ్బతింటుంది. పైగా ఈ వాల్‌ను ఢీకొని ఆగిపోతే బోటును లాగడం సాధ్యం కాదని నిర్ధారించారు. నీటిలో మునిగిపోయి ఉన్న బోటు ఎలాంటి నష్టం లేకుండా ఒడ్డుకు చేర్చడానికి కావడి విధానమే మేలని అబ్బులు టీం భావించింది. ఈ ఆపరేషన్ కోసం రెండు కార్గో బోట్లను రప్పించారు. వాటిని దుర్గాఘాట్‌కు పక్కన నది ఒడ్డుకు తీసుకొచ్చి పక్కపక్కనే పెట్టి వాటి పైభాగాన టన్ను బరువు గల మూడు ఇనుప గడ్డర్లను ఏర్పాటు చేశారు. ఈ గడ్డర్లకు పైభాగాన మూడేసి పెద్ద రంధ్రాలు ఉన్న హుక్‌లు పెట్టి వెల్డింగ్ చేశారు. సోమవారం ఉదయం ఒక బోటును బ్యారేజ్ గేట్ల వైపున, మరో బోటును నది వైపున నిలుపుతారు. విశాఖ సీ లయన్ కంపెనీ డైవర్లు నీళ్లలోకి దిగి మునిగిన బోటుకు రెండు వైపులా ఉండే రంధ్రాల్లో ఇనుప రోప్‌ను పెట్టి లాక్ చేస్తారు. ఈ రోప్‌లను గడ్డర్ల హుక్‌లకు బిగిస్తారు. తర్వాత గడ్డర్లు ఉన్న రెండు బోట్లు నెమ్మదిగా గొల్లపూడి వైపు కదులుతాయని ఇంజనీర్లు తెలిపారు.

అబ్బులు ఫోన్ చోరీ

రిగ్గింగ్‌లో ప్రావీణ్యం ఉన్న అబ్బులు టీమ్ బెకమ్ కంపెనీ నిపుణులతో కలిసి బోటు ఆపరేషన్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. మోడల్ గెస్ట్‌హౌస్ వద్ద ఆయన ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు కాజేశారు. చార్జింగ్ పెట్టిన కాసేపటికి ఫోన్ కనిపించలేదు. మనస్తాపం చెందిన ఆయన ఆదివారం ఈ ఆపరేషన్‌లో కనిపించలేదు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.